# శ్రీ వేంకటేశం

ఆధ్యాత్మిక మాసపత్రిక

ఫిబ్రవరి
2024

వెల: రూ.
25/-





# శ్రీవేంకటేశం

ఆధ్యాత్మిక మాసపత్రిక

సంపుటి: 17 సంచిక: 2

సలహాదారులు, స్ఫూర్తిదాత, కర్త, కర్మ, క్రియ మా ప్రభు తిరుమల శ్రీ వేంకటేశ్వరుడు

ప్రధాన సంపాదకులు:
పుల్లగూర్ల సాయిరెడ్డి
(గోవిందదాసు)

గౌరవ సంపాదకులు:
డా॥ టి. గౌరీశంకర్

ఫొటోగ్రాఫర్:
పత్తి సుబ్రమణ్యం, శ్రీనివాస మంగాపురం

డి.టి.పి & డిజైన్: సాయినాథ్, రమేష్

**Email:** srivenkatesham@gmail.com
namo_venkateshaya@yahoo.com
**Website:** www.srivenkatesham.org
**E-Magazine:** www.readwhere.com
Phone: **040–27175050**
Cell: **9348212354**

## లోపలి పేజీల్లో

| | |
|---|---|
| శ్రీ వేంకటేశ్వర స్తుతి | 4 |
| ముక్తిమార్గం | 5 |
| అహంకారం అనర్థదాయకం | 6 |
| తిరుమల శ్రీ వేంకటేశ్వరుని దిశ... | 9 |
| ప్రత్యక్షభగవానుడు – సూర్యభగవానుడు | 18 |
| దైవచింతితులకు దేహచింతనలేల? | 22 |
| రంతిదేవుడు | 23 |
| మహాభారతంలోని మహోపాఖ్యానాలు | 25 |
| శ్రీ పంచమి | 31 |
| శుభప్రదాయిని రథసప్తమి | 32 |
| రామాయణ రత్నాకరం | 36 |
| శ్రీ వేంకటాచల మాహాత్మ్యం | 40 |
| ముకుందమాల | 47 |
| ధనుర్విద్యా ప్రవీణుడు, వీరుడు అర్జునుడు | 51 |
| వందే కృష్ణం జగద్గురుం | 53 |
| .. బడే హనుమాన్ దేవాలయం | 57 |
| సర్పరూప సుదర్శనునకు శాప విమోచనం | 59 |
| శ్రీకృష్ణ తత్వం | 60 |
| అమ్మ కథలు | 61 |
| రాశి ఫలితములు | 65 |
| మీ విజ్ఞానం | 66 |



# నిరీక్షణ

భగవంతుడు సర్వవ్యాపి. ఆయన లేని చోటు లేదు. సాధకుడు ఆలయానికి వెళ్ళనవసరం లేదు. తను ఉన్నచోటనే నిష్ఠతో ఆరాధించి భగవంతుని కృపను పొందవచ్చును. భక్తునికి నిరీక్షణ ఎంతో అవసరము. 'నిరీక్షణ' భక్తుని యొక్క సహనశక్తిని తెలియచేస్తుంది. అనన్యభక్తితో నిరీక్షించే భక్తుడంటే భగవంతునికి ఎంతో ఇష్టము. కొన్ని కొన్ని సార్లు భగవంతుడు భక్తునితో దోబూచులాడుతుంటాడు. భక్తుడు దగ్గరయితే భగవంతుడు దూరము పోతాడు. భక్తుడు దూరమయితే భగవంతుడు దగ్గరవుతాడు. ఈ విధమైన ఆటను భగవంతుడు దాదాపు ప్రతి భక్తునితో ఆడుతుంటాడు. మనకు అందినట్లే అంది కొన్నిసార్లు చేజారిపోతాడు. మరికొన్నిసార్లు మన చూపుకు అందనంత దూరం పోతాడు. అప్పుడు భక్తుడు చెందు దుఃఖం వర్ణనాతీతం. సమస్తం కోల్పోయినట్లు అనిపిస్తుంది. కాని సహనం నశించక మరింత భక్తి శ్రద్ధలతో భగవంతుని ఆరాధించుట భక్తుని కర్తవ్యం. మనం భగవంతునితో ఆడుతున్నట్లు భావించినప్పుడు మన ఆరాధనలో అలసిపోకుండా కొంత ఉత్సాహం లభిస్తుంది. ఈ ఉత్సాహం సాధనలో ఎంతో ముఖ్యం. ఇక భగవంతుడు మనతో ఎంతవరకు ఇలా దోబూచులాడుతాడు అనేది మన పరిధిలో లేని విషయం. ఇది భక్తుని యొక్క భక్తి పరిపక్వతను బట్టి ఉంటుందని పెద్దలంటారు. పూర్వం గోపికలు శ్రీకృష్ణునితో ఇలాంటి దోబూచులాట ఆడి, అలసి పోయినవారే! ప్రక్కనే ఉన్నట్లు భ్రమింపచేస్తాడు కాని ఉండడు. ఏమీ లేదని గ్రహించి ఊరుకుంటే మరో చప్పుడు చేసి మన దృష్టిని ఆకర్షిస్తాడు. అక్కడికి పోయి చూస్తే అక్కడ ఉండడు. ఇలా మనం ఊరుకోకుండా ప్రతిరోజు ఆయనకి సాధన చేయు విధంగా చేస్తూనే ఉంటాడు. ఇది భగవంతుడు మనతో ఆడుకునే ఆటలాగా భావించుకోవాలి. ఈవిధంగా కాలం గడుస్తున్న కొద్దీ మనలో భగవంతుని పట్ల మరింత ప్రేమ, భక్తిభావం, ఆత్మవిశ్వాసం వృద్ధి చెందుతాయి. ఇవి భక్తుని కృపను పొందుటకు అవసరమైన ముఖ్య సాధనాలు.

'శబరి' ఒక నిమ్నజాతి అనాగరిక స్త్రీ. కాని భగవంతుడైన శ్రీరాముడు ఈ ఆశ్రమానికి వస్తాడు, అంతవరకు వేచి వుండమని చెప్పిన గురుదేవుల మాట పట్ల విశ్వాసముతో జీవిస్తుంది. ప్రతిరోజు, ప్రతిక్షణం వారికై తపించిపోయింది. ఏ దిశగా వస్తారని, ప్రతి అలికిడిని గమనిస్తూ ఒక పిచ్చిదానిలా ప్రవర్తిస్తుంది. అందరూ ఎగతాళి చేసినా పట్టించుకోలేదు. కేవలం ఆమె గురుదేవుల మాటయందే విశ్వాసమును ఉంచి, అన్యుల మాటలను విశ్వసించదు. అన్యుల ఎగతాళి మాటలకు క్రుంగిపోదు. రోజు రోజుకి ఆమెలో పట్టుదల తారాస్థాయికి చేరుతుంది. శ్రీరాముడు వస్తే ఎక్కడ కూర్చోపెట్టాలి, ఏయే పదార్థాలను తినిపించాలి, ఆయన పాదపూజ ఏవిధంగా చేయాలి? ఆయనతో ఏమని మాట్లాడాలి అనే విషయాలమీదే పూర్తి ధ్యాస ఉంచి జీవిస్తుంది. ఆయన రూపు రేఖలను ఊహించుకుంటూ ఏడుస్తుంది. ఎన్నోసార్లు శ్రీరాముడు వస్తున్నట్లు భ్రమపడినప్పటికీ రాలేకపోయాడు. కాని శబరి మాత్రం తన పట్టుదలను వదలలేదు. అధైర్యపడలేదు. నమ్మకము సడలనివ్వలేదు. చివరికి శ్రీరాముణ్ణి దర్శించింది. వారికి తనకు తోచిన సపర్యలు చేసింది. చరిత్రలో భక్తురాలిగా చిరస్థాయిగా నిలిచిపోయింది.

నమో వేంకటేశాయ

**వినా వేంకటేశం న నాథో న నాథః ।**
**సదా వేంకటేశం స్మరామి స్మరామి ।।**

శ్రీ వేంకటేశ్వర పాదసేవకుడు

**పుల్లగూర్ల సాయిరెడ్డి** (గోవిందదాసు)

Editor, Publisher, Printer and owned by **Pullagurla Sai Reddy**. Published at: H.No.1-1-53, Street No:1, Habsiguda, Hyderabad-500007. Printed at: Sai Tirumala Printers, H.No:1-8-556/2, Chikkadpally, Hyderabad-500020. **Editor: Pullagurla Saireddy:** Cell : **93482 12354,** Ph:040-27175050; E.mails: **srivenkatesham@gmail.com**, namo_venkateshaya@yahoo.com

## చందా వివరాలు

(రూ.లలో)

| | |
|---|---|
| ☐ 2 సం॥ | 500-00 |
| ☐ 4 సం॥ | 1,000-00 |
| ☐ జీవిత చందా | 5,000-00 |
| ☐ పోషకులు | 10,000-00 |
| ☐ రాజపోషకులు | 50,000-00 |

**9348212354**

నంబర్‌కు పేటీఎం / ఫోన్‌పే / గూగుల్ పే ద్వారా జమచేసి మీ చిరునామాతోపాటు మాకు తెలపండి.

లేదా

శ్రీ వేంకటేశం పేరుపైన ఎం.ఓ / డి.డి. / క్రాస్డ్ చెక్‌ను

లేదా

**Srivenkatesham**

A/c no. S.B. 11002191002593
(Ifsc Code: PUNB0110010)
Punjab National Bank,
Habsiguda, Hyderabadలో
చేరునట్లు, ఆన్‌లైన్ ద్వారా కాని చెల్లించి మాకు తెలియజేయండి.

పూర్తి పేరు: ____________________

____________________

చిరునామా: ____________________

____________________

____________________

____________________


____________________

పిన్‌కోడ్: ____________________

చందా వివరాలు: ____________________

మా చిరునామా:
శ్రీ వేంకటేశం, ఆధ్యాత్మిక మాసపత్రిక
ఇం.నెం. 1-1-53, వీధి నెం. 1,
హబ్సిగూడ, హైదరాబాద్-500 007.
ఫోన్: 040-27175050
సెల్: 9348212354
Email: srivenkatesham@gmail.com

**చందాదారులకు స్వామివారి పవిత్ర పాదాలు (10"x8") ఉచితం**



# శ్రీ వేంకటేశ్వర స్తుతి

**శ్లో॥ పద్మేశమిత్ర శతపత్రగతాళి వర్గాః**
**హర్తుం శ్రియం కువలయస్య నిజాంగలక్ష్మా ।**
**భేరీ నినాద మివ బిభ్రతి తీవ్రనాదం**
**శేషాద్రి శేఖరవిభో తవ సుప్రభాతమ్ ॥**

తాత్పర్యం : శేషశైలేశా! తుమ్మెదలు తమ నల్లని శరీర శోభతో నల్ల కలువ పూల అందమును జయించుటకై చేయుచున్న పెద్ద ధ్వనియా? (భేరీ ధ్వనియా?) ఇది అనునట్లు ఝుంకారములను చేయుచున్నవి. వేంకటేశా! నీకు శుభోదయమగు గాక!

**శ్లో॥ శ్రీమన్నభీష్ట వరదాఖిల లోకబంధో**
**శ్రీ శ్రీనివాస జగదేక దయైక సింధో**
**శ్రీ దేవతా గృహ భుజాంతర దివ్యమూర్తే**
**శ్రీవేంకటాచలపతే! తవ సుప్రభాతమ్ ॥**

తాత్పర్యం : సకల సంపదలు గలవాడవై, ప్రజలందరికీ బంధువై, దయానిధివై, లక్ష్మీదేవిని వక్షస్థలమున గలవాడవై, దివ్యమైన మూర్తి గలవాడవై, కోరిన వరములను ఇచ్చువాడవై వేంకటాచలమున వెలసియున్న స్వామీ! శ్రీనివాసా! నీకు శుభోదయమగు గాక!

– డా॥ కె.వి. రాఘవాచార్యులు



# ముక్తిమార్గము

## వరాళి

పుడమి నిందరిఁ బట్టె – భూతము కడు
బొడవైన నల్లని – భూతము ||పల్లవి||
కినిసి వోద మిం – గెడి భూతము
పునుక వీఁపు పెద్ద – భూతము
కనలి యవియు చీఁ – కటి భూతము
పొనుగు సోమపు – మోము భూతము ||పుడమి||
చేటకాళ్ళ మిం – చిన భూతము
పోటుదా రల పెద్ద – భూతము
గాటపు జడల బిం – కపు భూతము
జూటరి నల్లము – సుగు భూతము ||పుడమి||
కెలసి బిత్తలే తిరి – గేటి భూతము
పొలుపు దాంట్ల పెద్ద – భూతము
బలుపు వేంకటగిరి – పయి భూతము
పులుగు మీఁది మహా – భూతము ||పుడమి||





భావము :

ఇది ఒక పెద్ద ఎత్తైన నల్లని భూతము. భువిలో వారు. వీరు అను భేదము లేక ఇది అందరినీ పట్టినది.

కోపముతో పైబడి పెద్ద ఓడనే అమాంతముగా మ్రింగివేయు భూతమిది.

వీపున ఈ పెనుభూతమున కొక యెముక చిప్ప గలదు. చీకటివలె నల్లనైన (తామసికమైన) ఈ భూతము కోపముతో పైకొను స్వభావము గలిగియున్నది.

విజృంభించు విక్రమముతో నిండిన ముఖముగల భూతమిది.

ఈ భూతము చేటలవలె వెడల్పైన కాళ్ళతో అతిశయించి యున్నది. ఇది పెద్ద బీరము గల పోటుదారు. దట్టమైన జడలుగల పొగరైన భూతము ఇది. ఈ మాయదారి భూతము నల్లని ముసుగు వేసికొని యున్నది.

ఈ భూతము దిస మొలతో అడ్డమాక లేక తిరుగుచుండును. అవలీలగా ఇటునటు లంఘించు వడిగల భూతమిది.

ఇది సమున్నతమైన వేంకటాచలముపై నుండును. ఈ మహాభూతము పక్షిపై నుండును.

భావానువాదం:
**శ్రీమాన్ సముద్రాల లక్ష్మణయ్య**



# అహంకారం అనర్ధదాయకం

- చిల్లర సీతారామారావు

మానవునకు గల అంతర్గత శత్రువులలో అహంకారం ఒకటి. అహంకారమును ఒక మానసిక రుగ్మతగా భావించవచ్చును. అహంకారమునకు లోనైనవారు పతనావస్థకు చేరుకుంటారు. నేను, నాది అనునది అహంకారమునకు ప్రతీక. ఇతరులకన్నా తాను గొప్పవాడినని భావించుట అహంకారము క్రిందకు వస్తుంది. అహంకారం ఆవహించగానే ఈర్ష్యా ద్వేషాలు ఉత్పన్నమవుతాయి. ఉచితానుచితాలు మరిచిపోవడం సంభవిస్తుంది. అహంకారమునకు లోనైన మనస్సు అక్రమ పద్ధతులను ఆశ్రయించడానికి మొగ్గు చూపుతుంది. సమాజంలో ప్రముఖ వ్యక్తిగా గుర్తింపబడాలన్న కాంక్ష తలెత్తుతుంది. ప్రతి వ్యక్తీ తనను గౌరవించాలని, ప్రతి పనికి తనపై ఆధారపడాలన్న దురాశ కలుగుతుంది. అహంకారమునకు వశీభూతులైనవారు కామ, క్రోధాది దుర్గుణములకు వశీభూతులవుతారు. ఉన్న సంపదతో తృప్తి కలగదు. ఇంకా సంపాదించాలన్న భావన అధికమవుతుంది. రూపము, సంపద, లావణ్యము, బలము మున్నగునవి అహంకారమును పెంపొందించే సాధనాలు. ఈ గుణాలు ఏవీ శాశ్వతం కావు. ఏనాటికైనా అవి నశించిపోతాయన్న ఆలోచన అహంకారపూరితులకు రాదు. ఈ గుణములను అత్యున్నతమైనవిగా భావించి అహంకరించువారు పెద్ద, చిన్న తారతమ్యం లేకుండా అగౌరవపరిచే స్థితికి చేరుకుంటారు. అహంకారము వలన కుటుంబ జీవనము అస్తవ్యస్తమవుతుంది. మనస్సు అశాంతికి లోనవుతుంది. రావణాసురుడు, ఇంద్రుడు, విశ్వామిత్రుడు మున్నగు మహనీయులు కూడా మహా శక్తిసంపన్నులయినప్పటికీ అహంకారమునకు వశీభూతుల వడంతో అనర్థాలను ఎదుర్కోవలసి వచ్చింది. రావణాసురుడు అహంకారంతో చెలరేగిపోయి తన రాజ్యమును, కుటుంబమును సర్వనాశనము గావించుకున్నాడు. అహంకారము వలననే ఇంద్రుడు పలుమార్లు రాజ్యాధికారమును కోల్పోయాడు. విశ్వామిత్రుడు శక్తి నశించిపోవడానికి కారణము అహంకారమే. అహంకారము ప్రబలమైనది. దానిని జయించుట చాలా కష్టము. అయిననూ అహంకారమును దూరము చేసుకొని ప్రశాంతముగా నుండటానికి అవకాశమున్నది. ఆధ్యాత్మిక గ్రంథముల పఠనము, ఆధ్యాత్మిక ప్రవచనముల శ్రవణము, త్రికరణశుద్ధిగా భగవంతుని ఆరాధించడం ద్వారా మనస్సును నిర్మలం గావించుకుంటే

అహంకారం నశించి శాంతి లభిస్తుంది.

అహంకారము అనర్థదాయకమని తెలియజెప్పే కథ ఒకటి బ్రహ్మ పురాణమునందు చెప్పబడింది. విష్ణుభగవానుని వాహనము గరుత్మంతుడు. విష్ణుభగవానుడు ఎక్కడికి వెళ్ళవలసి వచ్చినా గరుత్మంతుడు విష్ణుభగవానుని తనమీద కూర్చుండబెట్టుకుని తీసుకొని పోతుండేవాడు. నేను చాలా బలవంతుడిని. నేను కాబట్టి విష్ణుభగవానుడిని మోయగలుగుతున్నాను. వేరెవ్వరూ ఆయనను మోయలేరు అన్న అహంకార భావన గరుత్మంతుడిలో ప్రవేశించింది.

పూర్వకాలమున ఆదిశేషుడు అను సర్పరాజు ఉండెడివాడు. అతడికి ఒక కొడుకు ఉన్నాడు. అతడిపేరు మణినాగుడు. మణినాగుడు బలపరాక్రమాదులలో శ్రేష్ఠుడు. అయినప్పటికీ సర్పజాతికి శత్రువు అయిన గరుత్మంతుడు అంటే అమితమైన భయము. ఆ భయమును తొలగించుకొని నిర్భీతిగా తిరగడానికి భగవంతుడి అనుగ్రహం ఉండాలని మహాశివుడిని భక్తిశ్రద్ధలతో ఆరాధించసాగాడు. మణినాగుడి భక్తిశ్రద్ధలకు ప్రసన్నుడైన శివుడు ప్రత్యక్షమై మణినాగుడిని వరమును కోరుకొమ్మని పలికాడు. మణినాగుడు శివుడిని స్తుతించి తనకు కావలసిన వరమును అడిగాడు. దేవా! మా జాతికి ప్రబలమైన శత్రువు గరుత్మంతుడు. అతడి వలన ఎటువంటి భయము కలుగకుండా, నిర్భయముగా సంచరించడానికి ఒక వరమును ప్రసాదించండి. శివుడు తథాస్తు అని పలికి అదృశ్యమయ్యాడు. శివుడు ప్రసాదించిన వరముతో మణినాగుడు నిర్భీతిగా తిరుగసాగాడు. ఒకసారి విష్ణుభగవానుడి నివాస ప్రాంతమైన క్షీరసముద్ర పరిసరాలలో యథేచ్ఛగా తిరుగసాగాడు. అలా తిరుగుతూ, తిరుగుతూ గరుత్మంతుని నివాస ప్రాంతమునకు వచ్చాడు. తన ప్రాంతమునందు నిర్భీతిగా తిరుగాడుతున్న మణినాగుడిని చూశాడు గరుత్మంతుడు. వెంటనే అతడిని పట్టుకొని తన గృహమునందు బంధించాడు.

ప్రతిరోజూ శివుడిని దర్శించుకోవడం మణినాగునికి అలవాటు. ప్రతిరోజు వచ్చు మణినాగుడు ఆరోజు శివ దర్శనమునకు రాకపోవడంతో నందీశ్వరునికి అనుమానం కలిగింది. నందీశ్వరుడు శివుడిని దర్శించుకొని – ప్రభూ! ప్రతిరోజూ తమ దర్శనము కొరకు వచ్చు మణినాగుడు నేడెందులకో రాలేదు. బహుశా గరుత్మంతుడు మణినాగుడిని బంధించుటయో లేక భక్షించుటయో చేసి యుండునని నాకు అనుమానము కలుగుతున్నది. లేకున్నచో మణినాగుడు తప్పక తమరి దర్శనము కొరకు వచ్చి యుండెడివాడు. నందీశ్వరుడి పలుకులను విని తర్వాత మణినాగుడికి తాను ఇచ్చిన వరము స్మరణకు వచ్చింది. శివుడు దివ్యదృష్టితో చూచి నందీశ్వరుడితో ఇలా అన్నాడు. నందీశ్వరా! మణినాగుడు గరుత్మంతుడి గృహమునందు బందీగా ఉన్నాడు. నీవు క్షీర సముద్రమునకు వెళ్ళి విష్ణువును స్తుతించుము. ఆయన అనుగ్రహముతో మణినాగుడిని విడిపించుకొని తీసుకొని నా వద్దకు రమ్ము అని ఆనతిచ్చాడు. నందీశ్వరుడు శివుడి ఆనతి ప్రకారము క్షీర సముద్రమునకు వెళ్ళి విష్ణుభగవానుడిని స్తుతించాడు. నందీశ్వరుడి స్తుతికి ప్రసన్నుడైన విష్ణుభగవానుడు నందీశ్వరుడిని వచ్చిన కారణమేమిటి? అని ప్రశ్నించాడు. దేవా! పన్నగేంద్రుడు మణినాగుడు తమరి వాహనమైన గరుత్మంతుడికి భయపడి పరమశివుని ప్రార్థించగా పరమశివుడు మణినాగునకు అభయమిచ్చాడు. దాని ప్రకారము గరుత్మంతుడికి భయపడకుండా సంచరిస్తున్న మణినాగుడిని గరుత్మంతుడు తన గృహమునందు బంధించాడు. శివుడు మిమ్ములను ప్రార్థించి మణినాగుడిని విడిపించి తీసుకొని రమ్మని ఆదేశించారు. ఆ ఆదేశానుసారం మీ దగ్గరకు వచ్చాను అని విన్నవించుకున్నాడు. నందీశ్వరుడి ప్రార్థనను మన్నించి గరుత్మంతునితో మణినాగుడిని బంధవిముక్తుడిని గావించమని చెప్పాడు. విష్ణుమూర్తి వచనములు గరుత్మంతుడికి నచ్చలేదు. అహంకరించి యున్న గరుత్మంతుడు ఆగ్రహముతో విష్ణుమూర్తితో దేవా! నన్ను మన్నించండి. నేను మణినాగుడిని బంధవిముక్తుడిని గావించలేను. సేవకుడియందు ప్రసన్నుడైన యజమాని సేవకుడికి బహుమానము ఇవ్వడము సర్వసాధారణము. నేను నా బలముతో సంపాదించుకున్న ఆహారమును ఇతరులకు ఇవ్వమని చెప్పడం అధర్మము గదా! నేను మీకు అన్నివిధములా సేవలు చేస్తున్నాను. నన్ను కరుణించి ఏనాడైనా మీరు నాకు బహుమతులు ఇచ్చారా? నేను చాలా బలవంతుడను గనుక మీరు నన్ను వాహనముగా చేసుకున్నారు. నేను కూడా రాక్షస సంహారమునకు గాని, ఎక్కడికైననూ వెళ్ళవలసి వచ్చినప్పుడు గాని మిమ్ములను తీసుకొని వెళుతున్నాను గదా! నన్ను అధిరోహించే గదా యుద్ధములకు గాని, భక్తుల దగ్గరకు గాని వెళ్ళెడివారు. నన్ను మన్నించండి. మణినాగుడు నా ఆహారము. నా ఆహారమును ఇవ్వజాలను అని పలికాడు గరుత్మంతుడు. విష్ణుమూర్తి చిరునవ్వు నవ్వుతూ – గరుత్మంతా నీవు చెప్పినది యథార్థమే. అమిత బలపరాక్రమవంతుడివి గనుక నీ సహాయముతో శత్రువులను జయించగలిగాను. భక్తులను కాపాడగలిగాను. నన్ను మోసి మోసి నీవు దుర్బలుడివి అయ్యావు. ఇకముందు కూడా నీ సహాయముతోనే సకల కార్యక్రమములు పూర్తి గావించుకుంటాను. మహాబలశాలీ! నీ శక్తినుపయోగించి నా చిటికెనవేలిని ఒకసారి మోయుము అని పలికి తన చిటికెన వ్రేలిని గరుత్మంతుడి తలమీద పెట్టాడు విష్ణుభగవానుడు. వెంటనే అతని శిరస్సు కుక్షి లోనికి కూరుకొనిపోయింది. కుక్షి కూడా క్రుంగి చూర్ణమైపోయింది. బాధలను భరించలేక అందరిముందు అవమానము జరగడంతో లజ్జా భయములతో విష్ణుభగవానుని దీనముగా వేడుకున్నాడు.

దేవా! బలవంతుడినన్న అహంకారముతో ఇచ్చ వచ్చినట్లు మాట్లాడాను. దయచేసి నా అపరాధమును మన్నించండి. మహా

మహులకే అర్థంకాని మిమ్ములను నేను ఎలా అర్థం చేసుకోగలను? సర్వలోకములను కుక్షి యందుంచుకున్న మహనీయులు. ఈ సేవకుడి అపరాధమును మన్నించండి. ప్రక్కనే ఉన్న లక్ష్మీదేవిని చూచి అమ్మా! నేను నీ బిడ్డను. బిడ్డలు అపరాధము చేస్తే వారిని క్షమించే విశాల హృదయులు మీరు. ఆర్తుడను. దయచేసి నన్ను కాపాడమని విష్ణుభగవానునికి చెప్పుము తల్లీ! అని రోదించసాగాడు గరుత్మంతుడు. కరుణార్ద్ర హృదయురాలైన లక్ష్మీదేవి గరుత్మంతుడిని రక్షించమని ప్రార్థించింది. ఇంకా ఇలా అంది. స్వామీ, గరుత్మంతుడు మీ సేవకుడు. అతడి అహంకారం నశించిపోయింది. సేవకులను రక్షించడం యజమానుల ధర్మం. గరుత్మంతుడు చేసిన అపరాధమునకు పశ్చాత్తాప పడుతున్నాడు. ఇకనైనా అతడిని క్షమించండి. లక్ష్మీదేవి పలుకులను ఆలకించిన విష్ణుభగవానుడు గరుత్మంతునితో ఇలా అన్నాడు. గరుత్మంతా! మణినాగుడిని బంధవిముక్తుడిని గావించి అతనితో, నందీశ్వరుడితో కలిసి శివుడి దగ్గరకు వెళ్ళుము. ఆయన కృపా దృష్టి వలన స్వస్థుడవు కాగలవు అన్నాడు. విష్ణుమూర్తి ఆజ్ఞననుసరించి గరుత్మంతుడు మణినాగున్ని బంధ విముక్తిణ్ణి గావించి, నందీశ్వరుడితో కలిసి వెళ్ళి శివుడిని దర్శించుకున్నాడు. నందీశ్వరుడు శివుడికి జరిగిన వృత్తాంతమును తెలియజేశాడు. శివుడు గరుత్మంతుడితో – గరుత్మంతా! పశ్చాత్తాపము నీ పాపములను నాశనము గావించింది. సర్వకామప్రదాయిని, శాంతిస్వరూపిణి, లోకపావని అయిన గౌతమీ నదిలో స్నానము చేయుము. దానివలన నీవు నీ పూర్వశరీరమును, బలమును పొందగలవు. నీ సమస్త పాపములు నశించగలవు. నీ కోరికలన్నీ నెరవేరగలవు అని పలికాడు. శివుడి ఆజ్ఞానుసారము గరుత్మంతుడు గౌతమీ నదీతీరమునకు వెళ్ళి, నమస్కారము చేసి నదిలోనికి దిగి స్నానము చేశాడు. శివకేశవులను స్తుతించసాగాడు. వెంటనే అతనికి పూర్వశరీరము, బలము ప్రాప్తించాయి. అక్కడినుండి విష్ణుభగవానుని దగ్గరకు వెళ్ళి ఆయన పాద పద్మములకు ప్రణమిల్లాడు.

అహంకారము అన్నివిధాలా అనర్థదాయకము. అహంకారమును దగ్గరికి రానివ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. మనస్సును నిర్మలముగా నుంచుకొని, కామ క్రోధాదులను దూరముగా నెట్టి, సర్వదా భగవంతుడి సేవలో నిమగ్నమవ్వాలి. భగవంతుడి ఆరాధనలో పాల్గొంటే అహంకారము నుండి విముక్తులము గావడమే కాకుండా భవబంధముల నుండి విడివడటమే గాకుండా ముక్తిని పొందగలము.


## రచనలకు శ్రీ వేంకటేశం ఆహ్వానం



'శ్రీ వేంకటేశం' మాస పత్రికలో వివిధ రకాల శీర్షికలకు రచయితల నుండి, కవుల నుండి, పాఠకుల నుండి సరికొత్త రచనలను ఆహ్వానిస్తున్నాము. యాత్రానుభవాలు, భక్తుల అనుభూతులు, దైవసంబంధమైన వ్యాసాలు, కథలు, కవితలు, ఇతర అంశాలను పంపవచ్చు. అయితే ఆయా రచనలతో పాటు అందుకు సంబంధించిన ఫొటోలను వీలైనచో జత చేయండి. పరిశీలించిన తరువాత ప్రచురణకు యోగ్యమైన రచనలను ప్రచురిస్తాం.

రచనలు తిప్పిపంపగోరువారు తగు స్టాంపులు అతికించిన కవరు కూడా జతచేయాలి. ప్రచురించిన ప్రతి రచనకు తగు పారితోషికం ఉంటుంది. రచనలలో అవసరమైతే భాష, శైలిలో మార్పులు, చేర్పులు చేసుకునే స్వేచ్ఛ మా సంపాదక వర్గానికి ఉంటుందని తెలియజేయుచున్నాం.

ఈ పత్రిక ప్రపంచంలోని నలుమూలలలో గల తెలుగు ప్రజలు అంతర్జాలంలో (ఇంటర్‌నెట్) వీక్షించుదురు కావున రచయితలు తగు జాగ్రత్తలు వహించి మంచి రచనలు పంపగలరని మనవి.

మీరు పంపే ప్రతి రచన పాఠకులలో భక్తిభావం కలిగే విధంగా, వారి జీవితమునకు కొంతవరకైనా ఉపయోగకారిగా ఉండవలెనని మనవి. రచనలు తెలిసే విధంగా దస్తూరి స్పష్టంగా ఉండాలి. ఫోన్ నెంబర్ తప్పనిసరిగా వ్రాయాలి.

**గమనిక: మీ రచనలను ఆన్‌లైన్‌లో పంపాలనుకునేవారు srivenkatesham@gmail.com మెయిల్ చేయండి.**

రచనలు పంపవలసిన చిరునామా

**శ్రీ వేంకటేశం** ఆధ్యాత్మిక మాసపత్రిక,
(శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం)
ఇం.నెం. 1-1-53, వీధి నెం.1, హబ్సీగూడ, హైదరాబాద్-07.
ఫోన్: 040-27175050, సెల్: 9348212354
Email: srivenkatesham@gmail.com

11వ భాగము

# తిరుమల శ్రీ వేంకటేశ్వరుని దిశ..



## తెలంగాణలో మరో తిరుపతిగ తన 'హరినామ క్షేత్రము'ను ఏర్పాటు చేయుటకై తిరుమల శ్రీ వేంకటేశ్వరుని లీలల ధారావాహికం

శ్రీ వేంకటేశ్వర పాదసేవకుడు
**– గోవింద దాసు**
**(పుల్లగూర్ల సాయిరెడ్డి)**



**దిశ** : సిద్ధిపేటకు 7 కి.మీ. దూరములో ఉన్న చిన్నగుండవెల్లి అనే మా స్వగ్రామంలోని మా తోటబావి వద్ద తిరుమల శ్రీవేంకటేశ్వరుడు తన 'హరినామ క్షేత్రము'ను ఏర్పాటు చేయదలచాడు. కనీసం రెండు ప్రాకారాల (వెండి వాకిలి) వరకైనా తిరుమల ఆలయ ప్రతిరూపమును నిర్మించమన్నారు. తాను స్వయంగా ఈ క్షేత్రంలో స్థిరనివాసమేర్పరచుకొని భక్తులను అనుగ్రహించుదునన్నారు. మరియు వివిధ భక్త బృందాలచే వంతుల వారిగా అఖండ హరినామ స్మరణ జరగాలని సూచించారు. స్వామివారిని తిరుమల నుండి ఆహ్వానించుటకు తగిన యోగ్యత సాధించుటకు వీలుగా కఠిన సాధనతో పాటు భాగవతుల ఆశీర్వాదమును పొందమన్నారు. తన కలల ద్వార ఏప్రిల్ 2000 నుండి శిక్షణ ఇచ్చుట ప్రారంభించి ఏప్రిల్ 2022లో అసలు విషయం తెలిపారు. మరియు ఈ కార్యక్రమములో భక్తులను భాగస్వాములుగ చేయుటకు వీలుగ స్వామివారు ప్రసాదించిన అనుభూతులను ఏప్రిల్ 2023 నుండి ప్రచురించమన్నారు. అందులో భాగంగానే ప్రస్తుతపు 11 వ భాగపు లీలల ప్రచురణ. **(ఫిబ్రవరి 2004 నుండి మార్చి 2004)**


తిరుమల శ్రీవేంకటేశ్వరుని కృపా విశేషం చేత 'నమో వేంకటేశాయ' రథం పనులు చక్కగా జరుగుచున్నవి. స్వామివారి లీలలో భాగంగా మా ఇంటినుండి ఆఫీసుకి వెళ్ళే దారి లోని ఎస్.వి.ఎస్ వద్ద నున్న పెట్రోల్ బంకు వారు, సతీష్ నాయక్ గారు మా రథ నిర్మాణ పనులు చేసుకొనుటకు తన రెండు మడిగలను ఉచితంగా ఇచ్చారు. ఈ స్థలం ప్రతిరోజు రథం పనులను చూచుకొనుటుకు అత్యంత అనుకూలంగా, మా ఇంటికి, ఆఫీసుకి మధ్యలో ఉన్నది. ఈ రథం తయారులో అడుగడుగునా శ్రీవేంకటేశ్వరుడు తన సహాయాన్ని అందించారు. రథం గురించి స్వామివారు చూపిన కొన్ని లీలలను తెలుపుచున్నాను.

### నమో వేంకటేశాయ రథ నిర్మాణములో స్వామివారి లీలలు

### సమర్పణ క్రతువు

రథంలో స్వామివారి మహామంత్రమును వ్రాసి వేయుటకు వీలుగా చిన్న చిన్న పేపరు ముక్కలను ఉపయోగించాలనుకున్నాను. ఒకరోజు ఈ పేపరు ముక్కలకు "సమర్పణ క్రతువు" అనే పేరు పెట్టాలనే హృదయాంతర భావం కలిగింది. దీని సమర్పణ విధానానికి కూడా చక్కని భావం ఏర్పడ్డది. దాని ప్రకారం రథం వద్దకు వచ్చిన ప్రతి భక్తునికి ఈ క్రతువు అందించబడుతుంది. దీనిని పొందిన భక్తుడు, తన కోరికలను మనస్సులోనే కోరుకుని స్వామివారి మహామంత్రమును ఈ క్రతువుపై వ్రాస్తాడు. ఆ తరువాత సమర్పణా భావంతో శరణాగత భావంతో స్వామివారికి మరొక్కసారి నమస్కరించి, మీరు తప్ప మాకు దిక్కెవరూ లేరంటూ ప్రార్థించి రథంలో ఉన్న శంకులలో ఈ క్రతువులను సమర్పణా

పూర్వకంగా, శరణాగత పూర్వకంగా సమర్పిస్తారు. వ్రాయలేనివారు ఈ క్రతువును స్పృశించి, శరణాగత భావంతో శంకులలో సమర్పిస్తారు. ఈ విధానాన్ని అనుసరించాలనే భావన కలిగింది. దీనితో పాటు రథంతో తిరిగే మా వారిని 'స్వామి సేవకులుగా' సంబోధిస్తూ వారికి పసుపుపచ్చ రంగు డ్రెస్ కోడ్ పెట్టాలనిపించింది.



సమర్పణ క్రతువు

శ్రీ వేంకటేశ్వరున్ని మనస్ఫూర్తిగా స్మరించి, మీ మీ కోరికలను తీర్చుమని ప్రార్థించి, 'ఓం నమో వేంకటేశాయ' అను మహా మంత్రమును వ్రాసి, సమర్పణా భావంతో, శరణాగత భావంతో ఈ రథం (శంఖు) లో వేయండి.

తిరుపతిలో నిర్మించిన శ్రీవేంకటేశ్వర దివ్య మహామంత్ర స్థూపము మోడల్ ను చక్కగా నిర్మిస్తున్నాము. నాలుగు ప్రక్కలు ఒకే విధంగా ఉండాలి. ప్రతి వైపు స్వామివారు ఉండాలి. అయితే భక్తులు మహామంత్రమును వ్రాసి వేయుటకు వీలుగా ప్రతి వైపు శంకు చక్రములను ఏర్పాటు చేద్దామని స్థపతి శ్రీమాన్ సెల్వకుమార్ గారు సూచించారు. దీనికోసం శంకు చక్రములను వాడవచ్చా? అనే అనుమానం కలిగింది. వెంటనే స్వామివారిని ప్రార్థించి దారి చూపమన్నాను. స్వామివారు ఈ క్రింది చక్కటి కలను ప్రసాదించారు.

## ముత్యాలతో అలంకరించిన శంకును చూపుట

**29-02-2004 కల** : ఈ రాత్రి కలలో నాకు ఒక శంకు కనబడింది. అది ముత్యములతో చక్కగా అలంకరించబడి ఉంది. ఆ ముత్యములు తెల్లగా నిగనిగలాడుతూ మెరుస్తూ ఉన్నవి. ఈ ముత్యములు రెండు వరుసలలో అమర్చబడి కాంతివంతంగా మెరుస్తూ ఉన్నవి. ఈ ముత్యాల హారాలు శంకు యొక్క రెండు చివరలలో క్రిందికి కొంత భాగం జారి వ్రేలాడుచున్నవి. కల చెదిరింది. తెల్లవారి ఈ కల విషయమును మా సురేఖతో చెప్పాను. ఆమె కూడా శ్రీమాన్ ఉపేందర్ రావు గారితో మాట్లాడినప్పుడు ఆయన చెవి ప్రక్కన ముత్యాలతో వ్రేలాడుచున్న శంకును చూచానని చెప్పింది. చివరికి నమో వేంకటేశాయ రథానికి ప్రతివైపు స్వామికి రెండు ప్రక్కల ముత్యములతో అలంకరించిన శంకులను మాత్రమే వాడాలని




నిర్ణయించుకున్నాము. శంకులకు మూతలాగా తయారు చేసి దీనిలో సమర్పణ క్రతువులను వేయుటకు వీలుగ చేయాలని నిర్ణయించుకున్నాము. ఒక రకంగా ఇది పోస్ట్ డబ్బా లాగా ఉంటుంది.

ఇక ఈ రథాన్ని ఏవిధంగా తిరుపతి వరకు త్రిప్పుచు తీసుకువెళ్ళాలి అనే విషయాన్ని ఆలోచిస్తున్నాను. లారీపై బిగించి త్రిప్పాలా లేదా ఒక ట్రాలీ తయారు చేయాలా అనే సందిగ్ధములో ఉన్నాను. ఈరోజు మా అపార్టుమెంటు ముందు ఒక నీటి ట్రాలీ నిలిచి ఉండుటను చూచాను. ఇది నన్ను చాలా ఆకర్షించింది. వెంటనే దీనిని ఆదర్శంగా తీసుకుని తయారు చేయాలనుకున్నాను. ఈరోజు ఈ విధమైన మరో కల కన్నాను.

## ట్రాలీని చూపుట


**2004-03-07 కల** : ఈ రాత్రి కలలో 7' X 7' సైజు ఉన్న ఒక ట్రాలీ ముందు రెండు ఇనుప రాడ్ లు Y ఆకారంగా కలిసి ఉండుటను చూచాను. ఈ విధంగా చేయుమని స్వామి ఆజ్ఞ ఇచ్చారని అనుకున్నాను. ఈ విధంగా చేసినచో ముందువైపు నుండి కూడా భక్తులు సేవించుకోవచ్చును. పూజలు, టెంకాయలు కొట్టుట మొదలగునవి ముందునుండే చేయాలని నిర్ణయించుకున్నాము.

ఈ విధంగా ఈ రథం తయారులో నా స్వామివారు అడుగడుగునా చక్కని దిశా నిర్దేశం చేశారు. ఒక రకంగా నేను నిమిత్తమాత్రుడను. నాకు కేవలం ఆయన సేవా భాగ్యాన్ని కలిగించాడు. అందుకు నా స్వామివారికి కోటి కోటి ప్రణామాలను సమర్పింస్తున్నాను.

**భూ సమస్య :**

మియాపూర్ లో ఉన్న నా ఆస్తి గొడవ ముదిరింది. ఈ దుండగులు నన్ను అడ్డు పెట్టుకుని, నా భూమిపైకి రామని చెప్పుచూ ప్రక్క హిస్సాదారు భూమిని కబ్జా చేశారు. చివరికి ఆ భూమివారికి, ఈ దుండగులకు, నాకు ఒక ఒప్పందం కుదిరింది. దాని ప్రకారం ప్రక్క భూమి వారు కొంత మొత్తానికి ఒప్పుకున్నారు. ఈ డబ్బు తీసుకుని అన్ని ప్లాట్స్ ను కొని వాటి రిజిస్ట్రేషను క్యాన్సిల్ చేయాలి. నేను వారి దగ్గరే కొన్నాను కాబట్టి, నా భూమిలోకి రామని ఒక అగ్రిమెంట్ వ్రాసి ఇవ్వాలి. ఈ ఒప్పందం ప్రకారం ప్రక్క భూమివారు డబ్బును ఇచ్చారు. వీరు ఆ డబ్బుతో

చాలా ప్లాట్స్ కొని క్యాన్సిల్ చేయకుండా వారి పేరు పైన జి.పి.ఏ తీసుకుని తిరిగి వాటిని అమ్మాలని చూస్తున్నారు. వాటితో మళ్ళీ డబ్బు సంపాదించాలని చూస్తున్నారు. పైగా నా భూమిపైకి రామని చెప్పుచు ఒక అగ్రిమెంట్ ఇస్తామన్నవారు, వారి మాట మార్చి, మనస్సు మార్చుకొని నన్ను బెదిరిస్తున్నారు. నేను వారి మాటలకు భయపడుచున్నాను. రోజు రోజుకు భయము పెరుగుతోంది. 17-03-04 నాడు ఒక అగ్రిమెంట్ కాపీని ఇచ్చి దీని ప్రకారం వెళ్ళుదామన్నారు. అది పూర్తిగా వారి పక్షాన ఉన్నది. నేను ఒప్పుకోలేదు. మనస్సులో బాధ కలిగింది. నేను నా భూమిని మోసం చేసి సంపాదించలేదు. పైగా దీనిని మా రక్షిత ఆస్తిగా పెట్టుకున్నాను. నాకున్న ఒక్కటే ఆస్తి. దీనిపైన అత్యంత వ్యామోహం ఉంది. కాబట్టి ఇది పోతుందని చాలా బాధేసింది. ఈ దుండగులు చాలా దుర్మార్గులు, నేర్పరితనం కలవారు. తప్పక నా ఆస్తిని కబళించగలరని అనిపించింది. దీనిని రక్షించమని స్వామివారిని మరీ మరీ వేడుకున్నాను. స్వామివారు మాత్రం కరుణించుట లేదు. 20-03-2004 నాడు దుండగులతో మళ్ళీ ఒక సమావేశం జరిగింది. నేను ఒంటరినని, ఎలాంటి బలము లేనివాణ్ణని గ్రహించారు. కొంత తర్జన భర్జన తరువాత "మేము నీకు ఎలాంటి NOC ఇవ్వము. నీవు ఏమి చేసుకుంటావో చేసుకో. అవసరమైతే నీ భూమిని కబ్జా చేస్తాము. అది మా భూమి" అని ఖరాఖండిగా చెప్పారు. నేను వారితో "ఇది మీరు అమ్మిన భూమియే కదా. మీపై చీటింగ్ కేసు పెట్టుదునని" చెప్పినను లాభం లేకపోయింది. చేసేది లేక ఇంటికి తిరిగి వచ్చాను. మనస్సు బాధగా ఉంది. నేను నా స్వామికి ఏ ద్రోహం చేయలేదు. ఎందుకింత బాధ, ఒకవేళ పూర్వజన్మ ఫలితంగా ఈ బాధలు వస్తున్నాయనుకున్నాను. ఆ తప్పులను క్షమించి నన్ను ఈ బాధ నుండి రక్షించమని స్వామివారిని సాయంత్రం 7.30 గంటలకు వేడకున్నాను. విపరీతమైన బాధ నన్ను దహించి వేస్తున్నది. ఈ బాధను తీర్చి నాకు మనశ్శాంతిని, సంతోషమును ఇవ్వమని వేడుకున్నాను. ఈ బాధతో చాలాసేపు ఏడ్చాను. స్వామికి శరణాగతి చేశాను. ఈరోజు నన్ను రక్షించుదునని అభయమివ్వమని మొండిగా వేడుకున్నాను. నన్ను ఈ బాధ అనే నరకము నుండి రక్షించండి, నాకు సంతోషాన్ని, మనశ్శాంతిని ప్రసాదించుమని మరీ మరీ వేడుకున్నాను. మీరు నన్ను మోసం చేయకూడదని కూడా ప్రార్థించాను. అయితే "నేను చేస్తున్న సేవకు ప్రతిఫలంగా మీరు ఈ సహాయం చేయకూడదని" అన్నాను. ఒక సాధారణ భక్తునిగ, సేవకునిగా అడుగుచున్నాను. నేను మోసపోవుచున్నాను, నాకు మీరు తప్ప దిక్కెవరు లేరు, మిమ్మల్ని శరణు వేడుచున్నాను కాబట్టి రక్షించు ప్రభూ! అంటూ ఆయన పాదములపై పడి భోరుమన్నాను. చివరికి మీరు భగవంతులు, ఏమైనా చేయగలరు. నాకు




తెల్లవారుకల్లా సంతోషాన్ని, మనశ్శాంతిని ప్రసాదించుమని వేడుకున్నాను. మళ్ళీ ఇలా ప్రార్థించాను. ప్రభూ! నేను అల్పసంతోషిని. ఈ విషయం నాకంటే మీకు బాగా తెలుసు కాబట్టి ఏదో చిన్న చిన్న చాకిలెట్ వంటి పదార్థాలను ఇచ్చి సంతోషపెట్టకూడదు. నాకు మహా సంతోషం కావాలి. ఎంత సంతోషం అంటే మీరు "సంతోషించావా?" అని నన్ను అడగాలి. నేను "సంతోషించాను" అని చెప్పాలి. అంత వరకు సంతోషాన్ని ప్రసాదించుమని దీనాతి దీనంగా వేడుకున్నాను. ఆ సమయంలో నా హృదయం ద్రవించింది. సంతోషం కావాలి, సంతోషం కావాలి అంటూ మోకరిల్లాను.

నా దృష్టిలో అత్యంత సంతోషం అంటే ఈ భూ సమస్యను శాశ్వతంగా పరిష్కరించడం అని అర్థం. కాని ఆ సమయాన ఈ భావన నా మనస్సులో ఉన్నప్పటికీ నేను కేవలం అత్యంత సంతోషం అని మాత్రమే అన్నాను. నేను ఈ భూ సమస్య తీరితేనే "సంతోషించాను" అని అంటాను. లేకుంటే అనను కదా అని అనుకున్నాను. కాని శ్రీవేంకటేశ్వరుడు మహా చతురుడు. ద్వంద్వ అర్థాలను ఉపయోగించి నన్ను సంతోషపరచాడు. ఎంతగా సంతోషపరచాడంటే నీవు సంతోషించావా? అని అడిగిన ప్రశ్నకు నేనే నా నోటితో "నేను సంతోషించాను" అని అన్నాను. ఇది ఒక అద్భుతమైన లీల. బహుశా ఇంతవరకు ఏ భక్తుడూ ఇలాంటి అనుగ్రహానికి పాత్రుడు కాలేదు. శ్రీవేంకటేశ్వర సమోదేవో న భూతో: న భవిష్యతి: అనే మాట నిజం అనిపించింది. ఒక భక్తుని పట్ల భగవంతుని కృప ఇంతగా ఉంటుందా అనిపించింది. ఆ

లీల ఈవిధంగా ఉంది.

## అమ్మాయి నాట్యం చూపించి సంతోషపరచుట

ఆఫీసులో అత్యంత దీనంగా ప్రార్థించిన తరువాత అదే బాధతో ఇంటికి వెళ్ళాను. ఈ బాధను ఇంట్లో ఎవరికీ తెలుపలేదు. స్వామివారిని స్మరిస్తూ పడుకున్నాను. రాత్రి 1.30 గంటలకు మేల్కొన్నాను. స్వామివారు నాకు ఎలాంటి సందేశం ఇవ్వలేదని బాధపడ్డాను. తిరిగి పడుకున్నాను. అప్పుడు వచ్చిందీ కల. శ్రీవేంకటేశ్వరుడు ప్రసాదించిన ఎన్నో ఆణిముత్యాలలో ఇది ఒకటి.

**04-03-21 కల** : నేను కోరినట్లు స్వామివారు నన్ను సంతోషపరచారు. ఒక మనిషి జీవితంలో పొందే అతి గొప్ప సంతోషమును, ఆ సంతోషం పొందే సందర్భమును కలుగజేశారు. ఏ విధంగా అనగా, 2004 సంవత్సరం నాటికి నా వయస్సు 43 సంవత్సరాలు. భార్యా పిల్లలున్నవాణ్ణి. నా ఎత్తు 5' 3 ½". నల్లగా ఉంటాను. కాని ఈ కలలో నేను ఒక 25 సంవత్సరాల వయస్సుతో 5' 7" ఎత్తు కలిగి, మంచి మధ్య ఎరుపు రంగు కలిగి ఉన్న మగాణ్ణి. ఈ రూపములో నా యొక్క రంగు, రూపు, ఎత్తు మార్చబడ్డవి. లేదా ఒక 25 సంవత్సరాల వయస్సుతో 5' 7" ఎత్తు కలిగి, మధ్య ఎరుపు కలిగి, మంచి ముఖవర్చస్సు, ఎత్తుకు తగిన లావు కలిగిన ఒక వ్యక్తి లోనికి నా ఆత్మ ప్రవేశపెట్టబడింది. శ్రీవేంకటేశ్వరుని మాయచే నా ఆత్మ ఆ నూతన వ్యక్తి లోనికి పరకాయ ప్రవేశం చేయబడ్డది. నేను ప్యాంటు షర్టు ధరించాను. తల చక్కగా దువ్వుకున్నాను. చూచిన ప్రతివాడు ఈయన బాగున్నాడు అనే విధంగా ఉన్నాను. ఒక్కక్షణం ఈ మొత్తం ఆకారాన్ని నాది నేను చూచుకున్నాను. ఒక ఎదుటి వ్యక్తి ఏవిధంగా చూడగలడో ఆ విధంగా నన్ను నేను చూచుకున్నాను. ఆ తరువాత పరకాయ ప్రవేశం చేసినట్లు నా ప్రాణము ఈ ఆకారము లోనికి చొప్పించబడింది. మరో రకంగా చెప్పాలంటే శ్రీవేంకటేశ్వరుడు నాకు ఒక అందమైన మరు జన్మను ప్రసాదించాడు. ఈ నూతన జన్మలో నా రంగు, రూపు, ఎత్తు ఈ విధంగా ఉన్నవని చూపించాడు. ఇక్కడ మనస్సు నాదే. నేను ఎలా ఉన్నాను, ఏం చేస్తున్నాను, ఎలాంటి అనుభూతి పొందుచున్నాను అనే వాటిని స్వయంగా నేనే అనుభవిస్తున్నాను. కాని రూపం మాత్రం మారింది.


ఆ సమయమున పెండ్లి చేసుకొనుటకు నేను ఒక అందమైన అమ్మాయిని ప్రేమిస్తున్నానట. కాని నేను ఆ అమ్మాయితో ఇంతవరకు మాట్లాడలేదు. ప్రేమను వ్యక్తపరచలేదు. ఆ అమ్మాయి కూడా నన్ను ప్రేమిస్తున్నట్లే ఉంది. ఆమె కూడా నాతో ఎప్పుడూ మాట్లాడలేదు. వారు మాకు తెలిసినవారట. దూరపు బంధువులట. నేను ఆమెతో లేక వారి కుటుంబంతో చెబితే ఏమనుకుంటారో అనే భయముతో ఒకరికొకరమున్నాము. కాని మా ఇద్దరి మధ్యన మౌన ప్రేమ తారాస్థాయికి చేరింది.

ఒకరోజు ఏదో పని నిమిత్తమై ఆ అమ్మాయి నివసిస్తున్న ప్రాంతం గుండా రోడ్డుపై ఎండలో నడుచుకుంటూ పోతున్నాను. ఏదో తెలియని బాధతో అలసిపోయి నీరసించి ఉన్నాను. ఎండలో నడుస్తున్నాను కాబట్టి మరింత అలసిపోయాను. ఎక్కడైనా కొంతసేపు సేద తీర్చుకొనుటకు అనువైన ప్రదేశము కొరకు వెతుకుతున్నాను. ఆ రోడ్డుపై అటు ఇటు చూస్తూ నడుస్తున్నాను. నేను వెళ్ళుచున్న రోడ్డుకు ఎడమప్రక్క మరొక చిన్న రోడ్డు కనబడింది. ఈ చిన్న రోడ్డు దాదాపు 30' అడుగుల వెడల్పు ఉంది. ఇందులో కేవలం 3 ఇండ్లు మాత్రమే ఉన్నవి. మొదటి ఇల్లు ఎవరిదో తెలియదు. రెండవ ఇల్లు పెద్ద నాట్యశాల. ఈ నాట్యశాల ముందు చిన్న అఱుగు ఉంది. మూడవ ఇల్లు నేను ప్రేమిస్తున్న అమ్మాయిది. ఈ అమ్మాయి ఇల్లు రోడ్డుకు అభిముఖంగా ఉంది. ఈ అమ్మాయి ఇంటికి ఒక పోర్టికో ఉంది. నేను చూస్తున్నప్పుడు ఆ అమ్మాయి ఇంటి ముఖ ద్వారము మూసి ఉంది. వారి ఇంటి ముఖద్వారము ప్రక్కన ఒక కిటికీ కూడా ఉంది. ఈ కిటికీ తలుపులు మాత్రమే తెరచి ఉన్నవి. ఈ అమ్మాయి ఇల్లు రోడ్డుకు అభిముఖంగా ఉండుట వలన, ఈ రోడ్డులో వచ్చిపోయే ప్రతివారిని ఈ అమ్మాయి ఇంటిలోనివారు, వారి ముఖద్వారము మూసి ఉన్నప్పటికీ ప్రక్కన ఉన్న కిటికీ ద్వారా స్పష్టంగా చూడగలరు. కాని బయట రోడ్డుపై ఉన్నవారు ఇంటిలోని వారిని చూడలేరు.

ఈ అమ్మాయి ఇంటి ప్రక్క ఇల్లు పెద్ద నాట్యశాల. లోన దాదాపు 30' X 30' వైశాల్యముతో విశాలమైన హాలు ఉంది. ఈ నాట్యశాలలో అమ్మాయిలు నాట్యం చేస్తుంటారు. ఈ నాట్యశాలకు ఒక కొలాప్సిబుల్ గేట్ బిగించబడి ఉంది. ఈ గేటు మూసి ఉంది. కాని ఇది కొలాప్సిబుల్ గేటు కనుక లోన జరిగే నాట్యమును బయటివారు స్పష్టంగా చూడగలరు. నాట్యశాల ముందు కొలాప్సిబుల్ గేట్ ప్రక్కన ఒక చిన్న అరుగు ఉంది. ఈ అరుగు చాలా చిన్నది. ఒకరు మాత్రమే కూర్చోగలరు. ఈ అరుగు అమ్మాయి ఇంటిముందు ఉంటుంది. అమ్మాయి ఇంటిముందు ఒక పోర్టికో ఉంది. ఆ సమయాన ఈ పోర్టికో నీడ నాట్యశాల ముందు ఉన్న చిన్న అరుగుపై పడుతుంది.

సేద తీర్చుకుందామని అటు ఇటు చూస్తున్న నాకు నీడలో ఉన్న ఈ చిన్న అరుగు కనబడ్డది. బాధలో ఉన్నాను, అలసి నీరసించి ఉన్నాను కావున వెంటనే అప్రయత్నంగా వెళ్ళి ఆ అరుగుపై వచ్చి కూర్చున్నాను. ఆ సమయాన ఈ అమ్మాయి ఇంటి ముఖద్వారం మూసి ఉంది కాబట్టి ఎవ్వరూ చూడలేదనుకున్నాను.

ఒక తెలియని బాధ నన్ను వెంటాడుతోంది. చాలా విచారంగా ఉన్నాను. ఆ బాధను భరించలేక చేతితో తల పట్టుకొని ఆ అరుగుపై కూర్చున్నాను. నా ప్రక్కన ఉన్న నాట్యశాలలో ఒక 15 మంది అందమైన అమ్మాయిలు, వయస్సు 19 నుండి 22 సం॥ల వారు




నాట్యము చేస్తున్నారు. నేను అరుగుపై కూర్చుండి ఈ అమ్మాయిల నాట్యము చూచాను. చేతితో నా తలను పట్టుకుని, విచార వదనంతో ఆ అరుగుపై కూర్చుండి చూచాను. ఈ అమ్మాయిల నాట్యము నా బాధను తీర్చలేదు, సంతోషాన్నివ్వలేదు. అందుకని నా చూపును వారినుండి ప్రక్కకు మరల్చి దీనావస్థలో ఉన్నాను.

ఈ అమ్మాయి దీనినంతటినీ తన ఇంటి కిటికీలోంచి చూసింది. నేను రావడము, తలకు చేయిపెట్టి విచారవదనముతో కూర్చుండడము, ఈ అమ్మాయిల నాట్యము చూడడము, అది రుచించక నా ముఖమును ప్రక్కకు త్రిప్పడము ఇదంతా ఆమె తీక్షణంగా చూచింది. నన్ను మరింత దగ్గరగా చూచుటకు వారి కిటికీ దగ్గరకు వచ్చి మరీ మరీ తొంగి చూసింది. ఈ విధంగా ఆ అమ్మాయి వారి కిటికీ రెక్కలను మరింత తెరిచి చూచినపుడు అయిన చప్పుడుకు నేను ఆమెను చూచాను. బాధతో ఉన్నాను కాబట్టి ఆమెను చూచీ చూడనట్లే ఉన్నాను. ఆమె వంక ఉన్న చూపును ప్రక్కకు మరల్చాను. నా చూపును నేలపైకి త్రిప్పి తలకు చేయి పెట్టి దీనావస్థలోకూర్చున్నాను. ఆవిధంగానాచూపుప్రక్కకు మరల్చటము ఆ అమ్మాయి గమనించింది. నేను బాధలో ఉన్న విషయాన్ని ఆ అమ్మాయి గ్రహించింది. నన్ను ఊరడించడానికి మరింత నా వద్దకు రావటానికి ప్రయత్నించింది. తొంగి తొంగి చూసింది. నేను ఆమెను చూడాలని ఉబలాటపడింది. కిటికీ రెక్కలు చప్పుడు చేసి నా దృష్టిని ఆకర్షించుటకు ప్రయత్నించింది. కాని ఏదో బాధలో ఉన్న నేను ఆమెను పట్టించుకోలేదు. దీని నంతటినీ గమనించిన ఆ అమ్మాయి మరొక్క అడుగు ముందుకు వేసింది. తన ఇంటిలో నుండి బయటకు వచ్చి నా ముందు నుండి మూసి ఉన్న నాట్యశాల గేటును తెరిచి లోనికి వెళ్ళింది. ఈ అమ్మాయి అందంగా ఉంది. వయస్సు 22–21 సంవత్సరాలు. మంచి రంగు, ఎత్తు 2 ‘5’’ ఒంపు సొంపులతో చక్కగా ఉంది. ఈ అమ్మాయి నాట్యశాలలోకి వెళ్ళుచూ నన్ను లోనికి ఆహ్వానించింది. నేను అప్రయత్నంగా ఆమె వెనుక లోనికి వెళ్ళాను. ఇంతలో హాలులో నాట్యం చేస్తున్న అమ్మాయిలు వారి నాట్యం చాలించి వెళ్ళిపోయారు. ఆ అమ్మాయిలు మాకు ఏకాంతం ఇవ్వటానికి వెళ్ళినట్లు వెళ్ళిపోయారు. నేను ఆ హాలులో ఒక ప్రక్క నిలబడ్డాను. ఈ అమ్మాయి అదే హాలులో నాముందు ఒక 15 అడుగుల దూరంలో నిలబడ్డది. తాను పంజాబీ డ్రస్ వేసుకుంది. చున్నీ వేసుకుంది. చున్నీని ఎలాంటి భంగిమలోనూ జారిపోకుండా గట్టిగా నడుముకు బిగించుకుంది. తరువాత

నాట్యం చేయుట ప్రారంభించింది. భరతనాట్యం చేయసాగింది. ఆ నాట్యం మహా అద్భుతంగా ఉంది. నన్ను సంతోషపరచుటే లక్ష్యంగా చేసుకొని నాట్యం చేస్తోంది. అంతకుముందు అదే హాలులో 15 మంది అదే వయసున్న అమ్మాయిల నాట్యం చూచాను. ఏ ఒక్కరి నాట్యం నన్ను సంతోషపరచలేకపోయింది. ఈ అమ్మాయి నాట్యం మాత్రం మహాద్భుతంగా ఉంది. రకరకాల నాట్య భంగిమలను నాకు చూపుతోంది. ఆ అమ్మాయి వేయు ప్రతి అడుగు నన్ను సంతోష పెట్టుటకే అన్నట్లుంది. ఈ నాట్యం మొత్తం లక్ష్యం నన్ను ప్రసన్నుణ్ణి కావించుటకే. మెల్ల మెల్లగా ఈ నాట్యాన్ని చూచి సంతోషపడసాగాను. నాలోనున్న బాధ చెదిరిపోవుట ప్రారంభించింది. ఈ అమ్మాయి అలాగే నాట్యం చేస్తోంది. ప్రతి క్షణం నన్ను గమనిస్తూ, నా ముఖ కవళికలను తెలుసుకొనుచు, నన్ను సంతోషపెట్టే రీతిలో నాట్యం చేస్తోంది. నా జన్మలో అంతటి మహత్తరమైన నాట్యాన్ని నేను చూడలేదు. అది ఒక అప్సరస నాట్యం లాగా ఉంది. ఎవ్వరైనా ఈ నాట్యం చూచి సంతోషపడవలసిందే. అంతటి గొప్ప నాట్యం అది. ఆ అమ్మాయి అలసట అన్నదే లేకుండా తదేక దీక్షతో, ఒకే లక్ష్యంగా, కేవలం నా సంతోషమే తన ముఖ్యోద్దేశంగా నాట్యం చేస్తోంది. ప్రతి భంగిమలో నన్ను తదేక దృష్టితో చూచుచు నాట్యం చేస్తోంది. ఈ విధంగా నాట్యం చేస్తూ చేస్తూ నాపై వాలిపోయింది. నా ఎడమ ప్రక్కన వాలిపోయింది. ఆమె చేయు నాట్యంలో ఒక భంగిమలాగా నా ప్రక్కన వెల్లకిలా వాలిపోతోంది. ఒక రబ్బరు బొమ్మలాగా వంగిపోతోంది. నేను ఆమె క్రింద పడుతుందని భావించి నా ఎడమ చేతిని ఆమె వీపు క్రింద పెట్టి పట్టుకున్నాను. ఆమె నాపై ఒరిగిపోయి ఒక రకమైన చూపుతో చూచింది. కళ్ళు పెద్దవి చేసి మనస్సు నాపై లగ్నం చేసి నన్నే చూచింది. నాకు విపరీతమైన సంతోషం కలిగింది. నా కాళ్ళ నుండి తల వరకు అణువణువు పులకరించింది. సంతోషభరితుడనైనాను. ఇంతలో ఒక అద్భుతం జరిగింది. నేనంటే తనకు ఇష్టమని సైగల ద్వారా తెలిపింది. దీనితో మరింత సంతోషించాను. నన్ను పెండ్లి చేసుకుంటావా? అని నేనామెను అప్రయత్నంగా అడిగాను. ఆమె సంతోషంగా తన అంగీకారాన్ని తెలిపింది. ఇది నన్ను మరీ సంతోషపరిచింది. ఆ వెంటనే ఆ అమ్మాయి ''నీవు సంతోషించావా?'' అని అడిగింది. దానికి సమాధానంగా ముందూ వెనక ఆలోచించకుండా ''ఓ సంతోషించాను'' అని బదులిచ్చాను. వెంటనే ఆ అమ్మాయి ''పెళ్ళైన తరువాత కలుద్దాం'' అని చెప్పుచూ వెళ్ళిపోయింది. ఎప్పుడైతే ఆ అమ్మాయి ''నీవు సంతోషించావా?'' అని అడిగిందో నాకు శ్రీవేంకటేశ్వరుడు కలలోనే గుర్తుకు వచ్చాడు. నిన్నటి నా ప్రార్థన గుర్తుకు వచ్చింది. నా నోటి నుండి ''నేను సంతోషపడ్డాను'' అనే వరకు నన్ను సంతోషపరచాలి అనే నా కోరిక కలలోనే నాకు గుర్తొచ్చింది. వెంటనే కల చెదిరింది.

తెల్లవారి ఈ కల గుర్తుకు వచ్చి ఆశ్చర్యపోయాను. నేను నా స్వామిని ఆస్తి తగాదాలను తీర్చి సంతోషాన్ని ఇవ్వమని వేడుకున్నాను. కాని ఈ రకమైన ఆనందమును కోరలేదు. నేను మహా ఆనందమును కోరిన మాట వాస్తవమే. నా దృష్టిలో నేను ఎదుర్కొంటున్న భూ సమస్యను తాత్కాలికంగా కాకుండా శాశ్వతంగా పరిష్కరించి నాకు మహదానందాన్ని తెచ్చిపెట్టమని వేడుకున్నాను. కాని ఆనాటి నా పరిస్థితుల ప్రభావము వలన లేక సరైన భాష తెలియక లేక ఆ సమయాన నా నోటికి సరైన పదము దొరకక ''ప్రభూ తెల్లవారేవరకు నాకు మహా సంతోషాన్నివ్వండి! నేను ఇక చాలు సంతోషించాను'' అనే వరకు ఇవ్వండని వేడుకున్నాను. ఆనాటి నా భావంలో ''ఇక చాలు సంతోషించాను'' అంటే సమస్య పూర్తిగా పరిష్కరించబడ్డదని అర్థం. కాని ఆ సమయాన నా మనస్సుకు ఈ పదమే దొరికింది కాబట్టి మనస్సులో భావం వేరైనా పైకి మాత్రం ఈ విధంగా అన్నాను. కాని శ్రీవేంకటేశ్వరుడు మాత్రం నా కోరికకు ద్వంద్వార్థాన్ని కల్పించి తిరకాసు పద్ధతిలో నేను కోరినట్లే తీర్చాడు. తెల్లవారి ఈ కలను నా భార్యకు చెప్పాను.

ఈ జన్మలో నేను భార్యా పిల్లలు కలవాణ్ణి కాబట్టి ధర్మబద్ధంగా ఉండుటకని నాకు మరుజన్మను ప్రసాదించి నా కోరికను తీర్చాడు. ఒక వ్యక్తి తాను పూర్తి జీవితకాలంలో పొందే అత్యంత సంతోషం ఒకేసారి వస్తుంది. తాను మనసారా వరించిన యువతి, తనంటే ఇష్టం అని తెలిపి పెండ్లికి అంగీకరించినప్పుడు, ఆ యువతితో మాట్లాడినప్పుడు, స్పృశించినప్పుడు, మరియు మనసు సంతోషపెట్టుటకు ఆ యువతి చేసే ప్రయత్నాలను చూచినప్పుడు. నాకు ఈ నాలుగు సంఘటనలను ఒకేసారి కల్పించి మహదానందభరితుణ్ణి చేశాడు. ''వేంకటేశ సమోదేవో న భూతో న భవిష్యతి'' అనే నానుడి నిజం అనే విధంగా చేశాడు. భక్తునిపై భగవంతునికి ఇంత ప్రేమ ఉంటుందా? అందుకు నేను స్వామివారికి ఏమివ్వగలను?

ఆనాడు ఈ కల అర్థమును సరైన విధముగా గ్రహించలేదు. శ్రీవేంకటేశ్వరునికి నాపై ప్రేమ ఉంది కాబట్టి ఈవిధంగా చూపాడనుకున్నాను. కాని దీని నిజమైన అర్థం ఈ విధంగా ఉంది. ''ఆస్తిని కాపాడను, కాని నీవు ఈ జీవితములో సంపూర్ణముగా తృప్తి చెందేవరకు సంతోషాన్ని కలిగిస్తా''నన్నాడు. ఇంతటి భాగ్యానికి స్వామివారికి ఏమివ్వగలను?

తెల్లవారి ఈ మధ్యవర్తి నాకు ఫోన్ చేశాడు. నేను అనుకుంటున్నటులనే మా భూమి లోనికి రామని చెప్పుచు అగ్రిమెంట్ వ్రాయించి ఇస్తానన్నాడు. అప్పుడు నా మనస్సు ఎంతో సంతోషించింది. స్వామివారు నా ప్రతి ఒక్క మాటను వింటున్నాడని, నన్ను గమనిస్తున్నాడని నాకు సహాయ సహకారాలు అందిస్తున్నాడని మురిసిపోయాను.

ఈ మధ్యవర్తి నా భూమిలో ఎలాంటి ప్లాట్లు అమ్మలేదని, అది మొత్తం నా సొంతం అని చెప్పి అగ్రిమెంట్ ఇచ్చాడు. కాని

ఈ భూమికి ఉత్తర దక్షిణాన ఉన్న ప్రభుత్వ భూమిని ప్లాట్లు చేసి తిరిగి ఇవే డాక్యుమెంట్లతో అమ్ముకుంటామని చెప్పారు. అది ప్రభుత్వ భూమి అని ఎవరితోనూ చెప్పవద్దన్నారు. నా భూమిలోకి రామని వారిచ్చిన మాటతో సంతోషపడ్డాను. కాని అసలు వివాదం అప్పుడే మొదలౌతుందని, ఇంతవరకు మాటల వరకు ఉన్న కలహము చేష్టల వరకు వచ్చునని మరింత ముదురునని ఊహించలేదు. శ్రీవేంకటేశ్వరుని లీలలను అర్థం చేసుకోలేదు.

ఇక ఆస్తి గొడవల విషయంలో శ్రీవేంకటేశ్వరుడు నా భార్య సురేఖను కూడా అనుగ్రహించాడు. అది ఈ విధంగా ఉంది.

## స్వామివారి ఆత్రుత

గత కొన్ని రోజుల నుండి ఆస్తి గొడవలు, రాజీ ఒప్పందాలు, షరతులు మొదలగు వాటిపై ఇంట్లో మనశ్శాంతి కరువైంది. భయం భయంగా ఉంది. మేము శ్రీవేంకటేశ్వరుణ్ణి తప్ప మరెవ్వరినీ దీనిని పరిష్కరించమని సహాయ మర్థించలేదు. రక్షించినా నీవే, నిండా ముంచినా నీవే అనే ధోరణిలో ఉన్నాము. గట్టిగా శ్రీవేంకటేశ్వరుణ్ణే ప్రార్థిస్తున్నాము. స్వామివారు కూడా మా ప్రార్థనను వింటున్నాడు. మా కంటే తనకే ఆత్రుత ఎక్కువున్నట్లు అనుభూతి కల్పిస్తున్నాడు. ''నేను మిమ్మల్ని చూడాలని తపించిపోతున్నాను'' అనే విధంగా అనుభూతి కల్పించి ఆనందపరచాడు. మేము ఆ రోజుల్లో దుర్గాబాయి దేశ్ ముఖ్ కాలనీలో, 4వ అంతస్థులోని ఒక అపార్టుమెంటులో ఉండేవారిమి. సురేఖ ప్రతిరోజు ఉదయం 5.45 గంటలకు ఉస్మానియా యూనివర్సిటీ లోనికి మార్నింగ్ వాక్ కు వెళ్ళేది.

**లీల** : సురేఖ మార్నింగ్ వాక్ కని ఉదయం 5.45 గంటలకు అపార్టుమెంటు క్రిందికి దిగింది. గేటు తీసి బయటకు పోబోతోంది. ఇంతలో మామూలుగా ఉన్న ఆమెను ఒక మాయ ఆవహించినట్లైంది. ఆమె వెంటనే వేరే ప్రపంచములోనికి (ట్రాన్స్) వెళ్ళిపోయింది. తనకు ఏమో జరుగుతోందని భావించి అక్కడే నిలబడ్డది. ఒక శక్తి క్షణంలో ఆమెను తిరుమల కొండపైకి తీసుకుపోయింది. సురేఖ శ్రీవేంకటేశ్వరుని దర్శనార్థమై నేరుగా మహాద్వారము గుండా లోనికి వెళ్ళుచున్నదట. శ్రీవారిని దర్శించుకోవాలనే ఆత్రుతతో త్వర త్వరగా భక్తుల వరుసలో వెళ్ళుచున్నది. మేము భయంతో ఉన్నాము కాబట్టి, ఆమెకు శ్రీవేంకటేశ్వరుణ్ణి అత్యంత త్వరగా దర్శనము చేసుకోవాలనే కోరిక బలంగా ఉన్నదట. కాని జనరద్దీ ఉండుట వలన ఆమె అనుకున్నంత త్వరగా వెళ్ళలేక పోతోంది. మెల్లమెల్లగా శ్రీవారి బంగారు వాకిలి దాటి మణిమయ మండపం వరకు అంటే గరుడుడు జయవిజయులు ఉన్నటువంటి స్థలము వరకు వెళ్ళింది. ఆ స్థలమునకు రావడానికి ఉన్న రెండు మెట్లు ఎక్కిందట. అంటే బంగారు వాకిలి నుండి మణిమయ మండపము లోకి ప్రవేశించుటకు ఉన్న రెండు మెట్లు ఎక్కిందట. అంతే, అక్కడొక అద్భుతమును చూచిందట. అది చూచి ఆమె నమ్మలేకపోయిందట. అది చూచి ఆమె మహదానందానికి లోనైంది. ఆమె ఆనందానికి హద్దులు లేవు. అదేమిటంటే నిజానికి తిరుమల శ్రీవేంకటేశ్వరుడు ఆనందనిలయం లోపల ఉంటాడు. జయవిజయులను దాటి రాములవారి మేడ మొదలైన ఇంకా రెండు అరలు దాటిన తరువాత శ్రీవేంకటేశ్వరుడు కొలువై ఉంటాడు. కాని ఈ సమయాన మాత్రము స్వామివారు లోనుండి బయటకు వచ్చాడు. ఆయన నేరుగా జయవిజయుల వద్దనే అంటే జేగంటల ప్రక్కన నిలుచున్నాడట. సురేఖకు మరింత అలసట, ఆలస్యము కానీయకుండా స్వామివారు స్వయంగా లోపలి నుండి వచ్చి 'జే' గంటల వద్ద నిలబడి దర్శనమిచ్చారు. అప్పుడు ఆ భక్తవత్సలుడైన శ్రీవేంకటేశ్వరుణ్ణి తనివితీరా దర్శించి మహదానందానికి లోనైందట. ఆ తరువాత ఈ కలలాంటి భ్రమ చెదిరిపోయింది. మామూలుగా మారిపోయింది. కాని తనకు ఏమో అయ్యిందని భావించి ఆరోజు మార్నింగ్ వాక్ మానుకొని ఇంటికి తిరిగి వచ్చింది. ఈ విషయమును తెలుసుకున్న నేను నా ప్రభు శ్రీవేంకటేశ్వరునికి పలు ప్రణామాలనర్పించాను. నా భార్యను తరింపచేసినందులకు సంతోషించాను. ఆ తరువాత నాకు తెలిసినంతవరకు ఈ కల యొక్క అర్థమును ఆమెకు వివరించాను. నీవు భయపడకు. ఇది మనలను తరింపచేయుటకు స్వామివారి కృప. మనము ఆయనకై తపించిపోతున్నాము కాబట్టి ఆ తపనను కొంతైనా తగ్గించుటకు స్వామివారే స్వయంగా మనవద్దకు వచ్చారన్నాను. ఇది మనపై ఆయన కృపకు నిదర్శనమన్నాను. మా సమస్య తప్పక అత్యంత త్వరగా తీరుననే నమ్మకము ఏర్పడ్డది.

నా భార్య తన డైమండ్ టాప్స్ ను స్వామివారికి సమర్పించుదునని గతంలో ఈ భూ సమస్య మొదలైనప్పుడు మ్రొక్కింది. ఈ మధ్యన భూ సమస్య తీవ్రమైంది. పూర్తిగా ఈ భూ సమస్యను తీర్చుతే నిలువు దోపిడి ఇచ్చెదనని మళ్ళీ మ్రొక్కుకుంది. ఈ విషయం తెలుసుకున్న నేను ఆమెతో నాకు తెలిసిన కొన్ని హితబోధలు చేశాను. సమస్య తీరిన తరువాత సమర్పించుట మంచి లక్షణం కాదని, సమర్పించ దలచుకుంది ముందే ఆయనకు సమర్పించి నా కోరిక నెరవేర్చుమని ప్రార్థించుట ఉత్తమ లక్షణమని చెప్పాను. అంటే మా భూ సమస్య తీరినంత వరకు వేచి ఉండక వెంటనే ఆయనకు అనుకున్నవి సమర్పించుదామన్నాను. ఆ తరువాత ఆయనిష్టం ''బాల్ ఆయన కోర్టులో ఉంటుంది'' అనే విధంగా చెప్పాను. అంతే కాకుండా మాకు ఒక మంచి ఇంటి స్థలమును ప్రసాదించుమని, ప్రతిగా ఆయనకు రు.1,116/- సమర్పించుట కూడా బాకీ ఉందన్నాను. మొత్తం ఈ మూడు ముడుపులను స్వామివారికి సమర్పించుటకు మా కుటుంబం మొత్తం తిరుపతికి వెళ్ళుటకు సిద్ధపడ్డాము.

తేది 2004-03-25 నాడు నేను, నా భార్య, ఇద్దరు

పిల్లలు కలిసి తిరుమల చేరాము. ఈరోజు స్వామివారిని దర్శించుకున్నాము. కష్టాల్లో ఉన్నాము, పైగా చాలారోజుల నుండి స్వామివారిని చూడని దృష్ట్యా, స్వామివారిని చూడగానే నా కళ్ళ నుండి ఆనంద బాష్పాలు రాలుచుండగ స్వామివారిని దర్శించుకున్నాను. పరవశించిపోయాను. దుఃఖం ఉబికి ఉబికి వచ్చింది. మేము మీవారిమని, రక్షించుమని దీనంగా వేడుకున్నాము. నా భార్య యొక్క డైమండ్ టాప్స్ ను మరియు రు. 1,116/- నేనే స్వామి హుండీలో సమర్పించాను. నా భార్య తన మెడలో ఉన్న మంగళసూత్రం, బంగారు గొలుసును స్వామివారి హుండీలో సమర్పించింది. మమ్ములను కాపాడే బాధ్యతను స్వామివారిపై పెట్టాము. ఆయనను మనసారా ధ్యానించాము. ఆయన గుడిలో ఒక పసుపుతాడుకు తాళిని కట్టి నేను నా భార్య మెడలో కట్టాను. ఈ సమర్పణ అత్యంత దీనావస్థలో జరిగింది. మేము సంపూర్ణంగా స్వామివారి మని, శక్తిహీనులమని, మేము తీవ్ర సమస్యలలో ఇరుక్కున్నాము రక్షించండని అత్యంత దీనంగా వేడుకున్నాము. మొత్తం మూడు సమస్యలను విన్నవించాము. 1. నమో వేంకటేశాయ రథం అత్యంత సుందరంగా, త్వరగా తయారు కావాలి 2. మా భూ సమస్య పరిష్కరించాలి 3. మాకు ఒక ఇంటి స్థలమును ప్రసాదించాలి. ఈ మూడు కోరికలను తీర్చుమని వేడుకున్నాము. తిరిగి తేది 04-03-26 శుక్రవారం ఉదయం నిజపాద దర్శనం చేసుకున్నాము. ప్రత్యేక కళ్యాణం చేసి మరోసారి స్వామివారిని దర్శించుకున్నాము.

చివరికి సాయంత్రం హైదరాబాదుకు వచ్చుటకని తిరుపతి రైల్వే స్టేషన్ కు వచ్చాము. నారాయణాద్రి రైలుకై వేచి చూస్తున్నాము. ఇంతలో నా భార్యకు ఒక సందేహం కలిగింది. ‘‘స్వామివారు మేము వేసిన వస్తువులను స్వీకరించారా?’’ అని అనుమానంతో అడిగింది. మనము అత్యంత భక్తితో సమర్పించాము, తప్పక స్వీకరించునని నేనన్నాను. ఇంతలో నారాయణాద్రి ట్రెయిన్ వచ్చింది. మేము ఎక్కి కూర్చోగానే కదిలింది. అనుకోకుండా నా దృష్టి రైల్వే స్టేషన్ లో అమర్చిన టి.వి పైకి వెళ్ళింది. అప్పుడు నేను ఒక దృశ్యమును చూచి ఆశ్చర్యపోయాను. అందులో శ్రీవేంకటేశ్వర దివ్య మహామంత్ర స్తూపము గురించి వస్తోంది. పైగా నేను చూచినప్పుడు నేనే ఆ స్తూపములో జపమును సమర్పిస్తున్నాను. వెంటనే అదుగో మన ప్రోగ్రామ్ టి.వి.లో వస్తున్నదని మా వాళ్ళతో చెప్పాను. అందరం ఆ దృశ్యమును చూచాము. అప్పటికే రైలు కదులుచున్నది. కావున స్టేషన్ లో అమర్చిన వివిధ టి.వి లలో కొంత కొంత చూడడం జరిగింది. నా తరువాత నా భార్య వేయడం, ఆ తరువాత భక్తులు వేయడం, దాని చుట్టూ ప్రదక్షిణలు చేయటను చూచాము. ఆ తరువాత ట్రెయిన్ రేణిగుంట జంక్షన్ కూడా దాటింది. ఇంతలో మళ్ళీ నా భార్య అదే సందేహం వెలిబుచ్చింది. ‘‘స్వామివారు మన వస్తువులను స్వీకరిస్తే బాగుండునంది’’. తప్పక స్వీకరిస్తారని నేను, స్వీకరిస్తే బాగుండుననే అనుమానముతో ఆమె, ఇలా రెండు మూడు సార్లు అనుకున్నాము. ఇంతలో అనుకోకుండా నా శరీరం బరువెక్కింది. గాఢనిద్ర ముంచుకొచ్చింది. అప్పుడు టైమ్ సాయంత్రం దాదాపు 8.00 – 7.50 అవుతోంది. స్వామివారు ఈ విధంగా అనుగ్రహించారు.

## కానుకలను స్వీకరించుట

**26-03-04 కల** : ఆ నిద్రలో ఒక కల కన్నాను. అందులో నేను స్వామివారి దర్శన నిమిత్తమై స్వామివారి గర్భగుడిలోనికి అందరి భక్తుల మధ్య నుండి వెళ్ళుచున్నాను. స్వామివారిని శుక్రవారము అభిషేకము తరువాత ఉండే నిజపాద దర్శనము లాగా చూచాను. నాకు ఆయన నిజపాద దర్శనం చాలా ఇష్టం కావున ఆయన నాకు ఆ దివ్యరూపమును చూపెట్టాడు. ఇంతలో కల చెదిరింది. తిరిగి మేల్కొన్నాను. శరీరం బరువు తగ్గింది. దీనర్థం ఏమనగా స్వామివారు మా కానుకలను స్వీకరించాడని, మరియు మా కోరికలను తప్పక తీర్చగలడనే విశ్వాసం మాకేర్పడింది.

నా దశ : నమో వేంకటేశాయ రథ నిర్మాణము గురించి చక్కటి సూచనలిచ్చాడు. జీవితంలో నేను తృప్తి చెందేవరకు సంతోషాన్ని కల్పిస్తానన్నాడు. మా సమస్యల గురించి స్వామికే ఆత్రుత ఉందన్నాడు. సురేఖను అనుగ్రహించాడు. మా ముడుపులు స్వీకరించి, కోర్కెలు నెరవేర్చుతాననే నమ్మకాన్ని కలిగించాడు.

**భాగవత ఆశీర్వాదము** : తిరుమల శ్రీవేంకటేశ్వరుని ఆజ్ఞచే కేవలము మీ యొక్క ఆశీర్వాదము పొందుటకని, మరియు స్వామి సంకల్పములో మిమ్మల్ని కనీసం ఆశీర్వాద రూపకంగా నైనా భాగస్వాములుగ చేయుటకు ఈ లీలలను ప్రచురిస్తున్నాము. కావున ఈ లీలలను చదివిన ప్రతి భక్తుడు వయస్సు, లింగ భేదం లేకుండా స్వామి వారిని స్మరించి సంకల్పం నెరవేరాలని ప్రార్థిస్తూ ఆశీర్వదించగలరని ప్రార్థన.


**(సశేషం)**

శ్రీవేంకటేశ్వర పాదసేవకుడు **గోవిందదాసు** (పుల్లగూర్ల సాయిరెడ్డి)
ఇ.నెం.1-1-53, వీధి నెం.1, హబ్సీగూడ, హైదరాబాద్. ఫోన్: 040-27175050
Visit: www.srivenkatesham.org

### తిరుమల శ్రీ వేంకటేశ్వరునికి కోట్ల జపములో భాగముగా

## 22వ పర్యాయంగా 7 కోట్ల జప సమర్పణ

# శ్రీ వేంకటేశ్వర దివ్య మహామంత్ర లిఖిత జపము



ఈ సంవత్సరము తిరుమల శ్రీవారికి సమర్పించబోయే 7 కోట్ల జపములో భాగస్వాములు కండి! ఆ స్వామి కరుణా కటాక్షములకు పాత్రులు కండి!!

మీ మీ కోరికలను తీర్చమని తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని ప్రార్థించే భాగ్యాన్ని మాకు ప్రసాదించండి!!

## సంకల్పం

శ్రీ వేంకటేశ్వరుని కరుణా కటాక్షములకు, స్వామివారి అనుగ్రహానికి అందరూ పాత్రులు కావలెననే ఉద్దేశ్యంతో ఆయన నామస్మరణలోని మాధుర్యాన్ని అందరూ అనుభవించాలనే ఆకాంక్షతో.. ప్రతి భక్తునిచే 1,008 సార్లకు తక్కువ కాకుండా 7 కోట్ల జపమును వ్రాయించి ఒక పవిత్రమైన రోజున తిరుపతిలో, కొండపై ఇట్టి జపమును శ్రీవారి పాదముల చెంత పెట్టి, నివేదించి, ఎస్.వి. డైరీ ఫాం ఆవరణలో జపహోమాదులు నిర్వహించి 'శ్రీ వేంకటేశ్వర దివ్య మహామంత్ర స్థూపం'లో స్వామివారికి సమర్పించాలనే సంకల్పంతో ఈ కార్యక్రమం చేపట్టబడింది.

**నిబంధనలు:**

1. ఈ మహామంత్రాన్ని వ్రాయుటకు ముందు మీ మనస్సులోని కోరికలను శ్రీవారికి నివేదించి, మనసారా ధ్యానిస్తూ, నోరారా పలుకుతూ వ్రాయండి. మననం, స్మరణం స్వామివారికి ప్రియం.
2. ఈ మంత్రమును కుల మత భేదం లేకుండా అందరూ వ్రాయవచ్చును. మన ఆచారవ్యవహారాల ప్రకారం అర్హత లేని సమయములో వ్రాయకూడదు.
3. ఈ మంత్రమును మీ మీ సొంత పేపర్లపై వ్రాయండి లేదా మానుంచి స్వామివారి దివ్యమహామంత్ర లిఖిత జప పుస్తకమును పొంది వ్రాయండి. పుస్తకమును పోస్టు ద్వారా కోరువారు పోస్టు ఖర్చుల నిమిత్తం రూ. 5/– ఎం.ఓ (ఒక్కంటికి) పంపినచో మేము మీకు జప పుస్తకాన్ని పంపగలము. (రూ. 10/–కి తక్కువ కాకుండా పంపండి). 9348212354 నంబర్‌కు ఫోన్‌పే, పేటిఎం, గూగుల్‌పే ద్వారా డబ్బులు, అడ్రస్ పంపి జప పుస్తకమును పొందవచ్చును.
4. మీరు ఈ మంత్రమును 45 రోజులలో వ్రాసి 'శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం' ఇం.నెం. 1–1–53, వీధి నెం. 1, హబ్సీగూడ, హైదరాబాద్ – 500007 చిరునామాకు మాత్రమే నేరుగా గానీ / పోస్ట్ / కొరియర్ ద్వారా గానీ పంపగలరు. జప సమర్పణోత్సవ కార్యక్రమ వివరాలతో పాటు ఆహ్వాన పత్రం అందజేయడానికి వీలుగా సొంత చిరునామా కలిగిన రూ. 5/– స్టాంపు అతికించిన కవరును జతపరిచి పంపగలరు.
5. ఈ మహామంత్రమును వ్రాయునప్పుడు మీలో కలిగిన అనుభూతులను మాకు వ్రాసి పంపగలరు.
6. మీరు వ్రాయవలసిన దివ్య మహామంత్రం 'ఓం నమో వేంకటేశాయ'

**గమనిక:**

మేము శ్రీవారికి 2002 నుండి ప్రతి సంవత్సరం సమర్పించదలచిన 7 కోట్ల జపములో మీరు ప్రతి సంవత్సరము పాల్గొని శ్రీవారి కృపను, ఆశీస్సులను సంపూర్ణంగా పొందగలరని ప్రార్థన.

స్వామి నామమును 1,008 సార్లు వ్రాయలేనివారు కనీసం 108 సార్లు అయినా వ్రాసి ఏడు కోట్ల జపములో భాగస్వాములు కాగలరని మనవి.

శ్రీ వేంకటేశ్వర అనుగ్రహ ప్రాప్తిరస్తు..!

**శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం**

ఇం.నెం. 1-1-53, వీధి నెం. 1,
హబ్సీగూడ, హైదరాబాద్ - 500007.
ఫోన్: 040- 27175050

ఈ కార్యక్రమం గురించి పూర్తి వివరాలకు సంప్రదించండి:
**93482 12354**



# ప్రత్యక్ష భగవానుడు సూర్యభగవానుడు

- చింతలపాటి శివశంకర శాస్త్రి

శ్లో ॥ జంభారీతీభ కుంబోద్భవ మివ దధ తస్సాంద్ర సింధూర రేణుం
రక్తాస్సిక్తా ఇతే ఘౌ రుదయతటీ ధాతు ధారా ద్రవస్య
ఆయాంత్యా తుల్యకాలం కమల వనరుచేవారుణావో విభూత్యై
భూయాసుర్భాస యంతో భువన మభినవా భానవో భానవీయాః"

ముల్లోకాలను ప్రకాశింప జేస్తున్న భానుని కిరణాలు మీ అందరి సంపదలకు కారణమగుగాక!

**భారతీయ సంప్రదాయంలో సూర్యభగవానుని స్థానం అద్వితీయం. సూర్యభగవానుడు మనకు ప్రత్యక్ష దైవం. సకల జగత్తుకూ కర్మసాక్షి. సాక్షాత్ భగవత్ స్వరూపుడు సూర్యభగవానుడు. సమస్త విశ్వచలనానికి ఆయన మూలశక్తి. నమస్కార ప్రియుడైన భాస్కరుడు ఐశ్వర్య ప్రదాత మాత్రమే కాదు, ఆపదలను నివారించేవాడు. సమస్త జీవులకు ఆత్మ సూర్యుడే. అందుకే ఆయన ఆరోగ్యప్రదాతగా కీర్తి గడించాడు. చర్మ, నేత్ర, హృద్రోగాల నివారణకు, సూర్యారాధన శ్రేష్ఠమైనది.**

'మఖ' నక్షత్రంతో కూడిన పూర్ణిమ గల మాసం మాఘమాసం. 'అఘం' అనగా పాపం. పాపం నుండి తొలగించే మాసం కనుక మాఘమాసం అని అంటారు. శ్రీ లక్ష్మీనారాయణులకు, ఉమామహేశ్వరులకు ఎంతో ప్రీతిపాత్రమైన మాసం. ఈ మాసంలోనే శ్రీపంచమి, రథసప్తమి, మహాశివరాత్రి, భీష్మాష్టమి మొదలైన పండుగలు వస్తాయి.

**"యః కర్తా జగతాం భర్తా సంహర్తా మహసాం నిధిః**
**ప్రణమామి తమాదిత్యం బహిరం తస్తమోపహమ్"**

లోకములకు కర్త, ప్రభువు, సంహారకుడు అగువాడు, కాంతులకు నిధియగువాడు, వెలుపలి చీకట్లను బాపువాడు

నగు సూర్యభగవానునికి ప్రణామము. తిథులననుసరించి వచ్చే పండుగలలో రథసప్తమి ఒకటి. ఈరోజున సూర్యుడు భూమికి దర్శనమిచ్చాడని శాస్త్రోక్తి. గ్రహాలకి అధిపతి, లోకబాంధవుడు, ప్రత్యక్ష నారాయణుడు సూర్యభగవానుడు ప్రభవ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘమాసం శుద్ధపక్షం సప్తమీ తిథి నాడు ఆదివారంతో కూడిన అశ్వినీ నక్షత్రంలో జన్మించాడు. సూర్యభగవానుడి జన్మదినమైన ఈనాటి తెల్లవారు ఝామున ఆకాశంలో నక్షత్రాలు రథాకారంలో ఉండటం వలన రథసప్తమి అనేపేరు వచ్చినట్లు శాస్త్ర వచనం. సూర్యగ్రహణం వలె రథసప్తమి పరమ పవిత్రమైనదని అంటారు.

"క్రియాత్మకః కాలః". కాలం క్రియాత్మకం. సూర్యుడు కాలాత్మ అని ఋగ్వేదం చెబుతోంది. కాలం సమస్త జీవకోటి జీవనగతి గమనాలను నిర్దేశించే మహేంద్రకాలం. కాలం అన్నింటికీ అతీతమైనది. జీవరాశికి ప్రకృతి ప్రసాదించిన వరం కాలం.

**"ఉదయే బ్రాహ్మణీ రూపం మధ్యాహ్నేతు మహేశ్వరః**
**సాయంకాలే స్వయం విష్ణుః త్రిమూర్తిశ్చ దివాకరః"**

సూర్యభగవానుడు త్రిమూర్తి స్వరూపుడు. ఉదయ కాలాన బ్రహ్మస్వరూపునిగా, మధ్యాహ్నం మహేశ్వరరూపంగా, సాయంసంధ్యలో విష్ణుస్వరూపునిగా ఉండి ప్రతిరోజూ త్రిమూర్తి స్వరూపంగా ఉంటూ ప్రపంచాన్ని నడిపిస్తున్నాడు. మన దేశంలో వేదకాలం నుండి సూర్యారాధన ఉంది. భారతీయులకు సూర్యుడు ప్రత్యక్షదైవం. ఆయన ఉదయించూ తూర్పుదిక్కు మనకు పరమ పవిత్రమైనది. అందుకే మన సంప్రదాయంలో ఉదయం స్నానానంతరం ఆదిత్యునికి అర్ఘ్య ప్రదానం చేస్తుంటాము.

సూర్యభగవానునికి ఇష్టమైన రథసప్తమి రోజున తెల్లవారు జాముననే స్నానం చేస్తే, సూర్యగ్రహణ సమయంలో చేసే స్నానంతో సమానమని పెద్దలు చెబుతుంటారు. ఈ రోజున చెరువులో లేక ఏటిలో లేక కాలువలో లేక సముద్రమునందు స్నానం చేయాలి. అవేమీ అందుబాటులో లేనప్పుడు కనీసం బావినీళ్ళతోనైనా స్నానం చేయాలంటారు. ఏడు జిల్లేడు ఆకులను, ఏడు చిక్కుడు ఆకులను తలపై పెట్టుకొని తలస్నానం చేయాలి. ప్రాతఃకాలమున స్నానము ఆచరించునప్పుడు ఈ క్రింది మంత్రములను చదవాలి.

**శ్లో ॥ "యద్యజ్జన్మ కృతం పాపం మయాజన్మ సప్తమ**
**తన్మేరోగంచ శోకంచ మాకరీహంతు సప్తమి**
**ఏతజ్జన్మ కృతం పాపం యజ్జన్మాం తరార్జితమ్**
**మనోవాక్కాయజం చ యచజ్ఞాతా జ్ఞాతేచ యేపునః**
**ఇతి సప్త విధం పాపం స్నానాన్మే సప్త సప్తికే**
**సప్త వ్యాధి సమాయుక్తం హరిమాకరి సప్తమి"**

జన్మ జన్మాంతరాలలో మనో వాక్కాయలతో తెలిసీ, తెలియక చేసిన సప్తవిధ పాపాలవల్ల ఏర్పడిన రోగం, శోకం మున్నగునవన్నీ ఓ శుభప్రదమైన సప్తమీ; నిన్ను స్మరిస్తూ చేసే స్నానంతో నశించుగాక! అని ప్రార్థిస్తూ సూర్యునికి ఎదురుగా నిలబడి

**"సప్త సప్తి వహప్రీత సప్తలోక ప్రదీపన**
**సప్తమీ సహితో దేవ గృహాణార్ఘ్యం దివాకర"**

అంటూ సూర్యునికి అర్ఘ్యం ఇవ్వడం వలన జన్మ జన్మాంతర శోక, రోగ రూపమైన పాపాలు, త్రికరణముల చేత తెలిసీ తెలియక చేసిన పాపాలు నశిస్తాయి. అనంతరం శిరసు మీద దీపమును పెట్టుకొని ఒక చెరుకుగడను తీసుకొని నిశ్చలముగా ఉన్న నీటిని కదిలిస్తూ

**"నమస్తే రుద్రరూపాయ రసానాం పతయే నమః**
**వరుణాయ నమస్తే హరివాస నమోస్తుతే"**

అనే మంత్రాన్ని చదువుతూ దీపాన్ని జలమునందు విడిచి పెట్టాలి. ఇలా చేయడం వల్ల జాతకంలో సూర్యగ్రహ దోషాలేమైనా ఉంటే తొలగిపోతాయి. స్నానానంతరం ఇంటికి వచ్చి పూజామందిరంలో గానీ, పూజ చేయదలచుకున్న చోట ఏర్పాటు చేసుకున్న మండపంలో గానీ బియ్యపు పిండితో అష్టదళ పద్మం చిత్రించి, దానిపై బియ్యం పోసి కలశం ఏర్పాటు చేసుకోవాలి. కలశం ముందువైపు శ్రీ సూర్యనారాయణుని చిన్న ప్రతిమను గానీ, వెనుకవైపున చిత్రపటాన్ని గానీ ఏర్పాటు చేసుకోవాలి. అలాగే కలశం లోనికి పవిత్రమైన నదులలోని నీటిని పోసి, మామిడాకులను వేసి రవిక గుడ్డతో త్రికోణాకారంలో అమర్చాలి. కలశానికి చందనం రాసి కుంకుమను అలంకరించాలి. కలశము ముందు భాగాన తమలపాకులను వేసి పసుపుతో చేసిన గణపతి ప్రతిమను ఏర్పాటు చేసుకొని గణపతిని అష్టోత్తరాలతో పూజించాలి. శ్రీ సూర్యనారాయణుని షోడశోపచారాలు, అష్టోత్తరాలతో పూజించాలి. అనంతరం తులసికోట దగ్గర రథం ముగ్గు వేసి దానిపై గానీ, సమీపాన గానీ ఇటుకలతో నలుచదరంగా పేర్చి ఆవుపేడతో చేసిన పిడకలను అమర్చి అగ్నిని ప్రజ్వరిల్లచేసి దానిపై కొత్తపాత్రలో కొత్తబియ్యం, ఆవుపాలు పోసి పొంగలిని తయారు చేసి సూర్యునికి సమర్పించాలి. చిక్కుడు కాయలను పందిరిగా చేసి పుల్లలతో గుచ్చి రథాన్ని తయారుచేసి ముగ్గులో పెట్టాలి. 15 చిక్కుడు కాయలను ఆకులను పరచి పాయసాన్ని ఉంచి, అగ్నిహోత్రునికి, తులసికి, సూర్యునికి నివేదన చేయాలి. హారతినివ్వాలి.

సూర్యుడు జగతికి చేసే మహోపకారాలను వివిధరకాలుగా ప్రస్తుతించారు. వెలుగుకి కిరణాలను ప్రసరించేవాడు, ప్రాణ శక్తుల్ని చైతన్యవంతం చేసేవాడు, నీటిలోని రసాన్ని స్వీకరించి తిరిగి అందించేవాడు, ఆకాశంలో సంచరించేవాడు, లోకాన్ని సృష్టించేవాడు, ఆదిదేవుడు, సనాతనుడు, ప్రాణుల్ని నిత్యకర్మలు అనుష్ఠించడానికి ప్రేరేపించేవాడు, ఇవే కాకుండా సూర్యుడు లోకానికి అందించే సేవల ఆధారంగా ఆయనను వివిధ పేర్లతో

కొలిచారు. ప్రముఖంగా మనకు ద్వాదశాదిత్యులు అనే మాట వినిపిస్తుంటుంది. సంవత్సరానికి పన్నెండు నెలలు. ఒక్కొక్క నెలలో సూర్యుణ్ణి ఒక్కో పేరుతో పిలవాలని జ్యోతిష్య శాస్త్ర నిపుణులు పేర్కొన్నారు. మిత్ర, రవి, సూర్య, భాను, ఖగ, పూష, హిరణ్యగర్భ, మరీచి, ఆదిత్య, సవిత, అర్క, భాస్కరుడనే వారు ద్వాదశాదిత్యులు. ద్వాదశాదిత్యుల నామాలను ప్రతిరోజూ ఉదయం స్నానానంతరం సూర్యునికి ఎదురుగా నిలబడి పఠించిన సకల శుభాలు కలిగి ఆరోగ్యం కుదుటబడుతుంది.

సూర్యుడు ఆరోగ్య ప్రదాత. ''ఆరోగ్యం భాస్కరాదిచ్ఛాద్'' అనే నానుడి మనకు సుపరిచయమే. శ్రీకృష్ణుని కుమారుడైన సాంబునికి కుష్టువ్యాధి వచ్చినప్పుడు సూర్యశతకాన్ని (స్తోత్రాన్ని) పఠించడం వల్ల అతని వ్యాధి నయమైంది. ఆదిత్యహృదయాన్ని చిత్తశుద్ధితో నలబది రోజులు పఠించిన ఆదిత్యరూపంలో వాత, పిత్త రోగాల్ని నయం చేస్తాడు. భాస్కరుని కృప వల్ల సంపూర్ణ ఆరోగ్యవంతులవుతారు. సూర్యోదయ సమయాన సూర్యునికి ఎదురుగా నిలబడి ముమ్మారు అర్ఘ్యమిచ్చిన ఎటువంటి అనారోగ్యమూ దరి చేరదు. సూర్యనమస్కారం వల్ల శరీరము దృఢతరమవుతుంది. సూర్యారాధన వల్ల ఆరోగ్యం, తేజస్సు, బలం కలుగుతుందని సామవేదం, జ్ఞానము సిద్ధిస్తుందని కృష్ణ యజుర్వేదం వల్ల తెలుస్తోంది. మరియు గ్రహ దోష నివారణ జరుగుతుంది. సమస్త వ్యాధులు, శోకాలు నశించి సుఖసంపదలు చేకూరుతాయని శాస్త్రోక్తి.



సూర్యభగవానుడు సర్వవిద్యా స్వరూపుడు. మరియు విద్యాప్రదాత. రామభక్తుడైన ఆంజనేయుడు సూర్యభగవానుని వెంట తిరిగి సమస్త విద్యలు, నవ వ్యాకరణాలు అభ్యసించాడు. శ్రీరాముడు రావణాసురుని జయించడానికి ఆదిత్య పారాయణ చేసి విజయాన్ని సాధించాడు. హనుమంతునికే కాక యాజ్ఞవల్క్యునికి బ్రహ్మవిద్య, చాక్షుష్మతీ విద్య సూర్యానుగ్రహం వలన లభించాయి.

**"సప్త యుంజన్తి రథమేక చక్ర మేకో అశ్వో వహతి సప్తనామా**
**త్రినాభి చక్రమజిర మనర్వం యత్రేనామా విశ్వభువనాదితస్థుః"**

అని కాలాత్మ అయిన సూర్యుని రథాన్ని గురించి వివరించారు ఋషులు. ఆయన రథంలోని భాగాలన్నీ సంవత్సరంలోని విభాగాలుగా వర్ణితమయ్యాయి. సూర్యరథ చక్రానికి మధ్యనున్న నాభి పగలు, ప్రాతఃకాలం, సంగమకాలం, మధ్యాహ్న సాయంకాలాలు, పంచాయుధాలు. ఆరు ఋతువులు చక్రంలోని ఆకులు, ఉత్తర దక్షిణాయనాలు బండి తొట్టి. ముహూర్తాల వంటివి అన్నీ ఇతర భాగాలు. నిమిషాలు పగ్గాలు. ధర్మమే ధ్వజం. అర్థం కామం అనే రెండు ఇరుసులు గాయత్రి, త్రిష్టుప్పు, అనుష్టుప్పు, జగతి, పంక్తి, బృహతి, ఉష్ణిక్కు అనే ఏడు ఛందస్సులు గుర్రాలు. అందుకే సూర్యుని సప్తాశ్వరథుడని అంటారు. సూర్యరథానికి సారథి అనూరుడు. రథం ముందు చక్రాలు సూర్యునికి, వెనుక చక్రాలు చంద్రునికి ప్రతిరూపాలని ఋషి వాక్కు.

ప్రత్యక్ష దైవం, జీవకోటి కర్మసాక్షి, ఆరోగ్యప్రదాత, ఆత్మీయ స్ఫూర్తి విధాత అయిన సూర్యనారాయణ మూర్తికి సంబంధించిన వ్రతాన్ని ఆచరించే విధానం తెలియజేయాల్సిందిగా ధర్మరాజు శ్రీకృష్ణుని ప్రార్థించగా, శ్రీకృష్ణుడు రథసప్తమీ వ్రతాన్ని ఆచరించే పద్ధతిని తెలియజేస్తూ ఒక కథను ఇలా వివరించాడు.

పూర్వము కాంభోజము అను దేశాన్ని యశోవర్మముడు అనే రాజు పరిపాలించేవాడు. అతనికి చాలాకాలము వరకు సంతానము కలుగలేదు. ముదిమి ప్రాప్తిస్తున్న సమయంలో ఆ రాజునకు ఒక కుమారుడు కలిగాడు. కుమారుడు జన్మించాడన్న సంతోషానికి ఆ రాజు నోచుకోలేదు. దానికి కారణం ఆ సంతానం నిత్యం అనారోగ్యంతో బాధపడుతూ ఉండటమే.

కుమారుని అనారోగ్యాన్ని చూసి రాజు కుమిలిపోతుండేవాడు. ఒకరోజు త్రికాల కోవిదులను పిలిపించి, తగిన రీతిలో సన్మానించి వారితో ఇలా అన్నాడు. "త్రికాల కోవిదులారా! నిరంతరం నా కుమారుడి అనారోగ్యం నన్ను కలచివేస్తోంది. అతని బాధను నేను చూడలేకపోతున్నాను. దీనికి ఏదైనా కారణమున్నదా? ఉన్నచో అది ఏమిటి? దయచేసి తెలుపగలరు" అన్నాడు.

రాజు ప్రశ్నలకు సమాధానంగా త్రికాల కోవిదులు ఇలా అన్నారు. "రాజా! పూర్వజన్మలో అతడు వైశ్యుడు. పరమ లోభి. దానధర్మాలు ఏనాడూ చేసి ఎరుగడు. అవసాన దశలో ఎవరో ఆచరిస్తున్న రథ సప్తమి వ్రతాన్ని చూసిన కారణంగా ఈ జన్మలో నీ కుమారుడిగా పుట్టాడు. పరమ లోభత్వ కారణంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు" అన్నారు.

త్రికాల కోవిదుల మాటలు విన్న రాజు వారిని ప్రార్థిస్తూ ఇలా అన్నాడు. మీరు సర్వజ్ఞులు. దయచేసి నా కుమారుడు అనారోగ్యం బారి నుండి విముక్తుడయ్యేటట్లుగా ఏమి చేయాలో తెలియజేయండి అన్నాడు. అప్పుడు త్రికాల కోవిదులు ఇలా సమాధానమిచ్చారు. నీ కుమారుడు 'రథసప్తమి' వ్రతాన్ని ఆచరించాలి. దానివలన సూర్యభగవానుని అనుగ్రహానికి పాత్రుడై పాపాలు నశించి నిరోగి అవుతాడు. ఆ వ్రతాన్ని ఆచరించే విధానమును చెపుతాము – శ్రద్ధగా వినుము. మాఘశుద్ధ షష్ఠినాడు తెల్ల నువ్వులపిండితో నలుగుపెట్టుకొని నది మున్నగు జలాశయములలో స్నానమాచరించాలి. పిదప సూర్య దేవాలయమునకు వెళ్ళి పూజలు చేయాలి. అతిథులను పూజించి భోజనం పెట్టాలి. ఆ రోజు ఆహార పదార్థాలలో నూనె లేకుండా చూసుకొని ఆహారాన్ని భుజించాలి. రాత్రి సమయంలో భోజనం చేయరాదు. శక్త్యానుసారం బంగారంతో కాని, రాగితో కాని రథాన్ని, ప్రతిమను చేయించి బ్రాహ్మణునకు దానమివ్వాలి. ఈ వ్రతాన్ని శ్రద్ధా భక్తులతో ఆచరించినవారికి సర్వ రోగాల నుండి విముక్తి, పుత్ర పౌత్రాభివృద్ధి, పుణ్యలోకం మున్నగునవి తప్పక ప్రాప్తిస్తాయి. త్రికాల కోవిదులు వివరించిన వ్రత విధానాన్ని విని వ్రతాన్ని నియమ నిష్ఠలతో తన కుమారుని చేత రాజు చేయించాడు. తత్ఫలితంగా రాకుమారుడు సంపూర్ణ ఆరోగ్యవంతుడయ్యాడు.

కన్పించే దైవంగా, కనికరించే దివ్యశక్తిగా, కిరణ సంస్పర్శనంతో ఆరోగ్యాన్ని, ఆహ్లాదాన్ని, ఆనందాన్ని అనుగ్రహిస్తూ మానసిక, శారీరక రుగ్మతలను దూరం చేస్తూ, ప్రకృతిని మానవాళిని ప్రఫుల్లం గావించే సూర్యనారాయణున్ని సర్వులకు ఆయురారోగ్య ఐశ్వర్యాలను ప్రసాదింపచేయమని వేడుకుందాం. పూజించి తరిద్దాం.

**"సూర్యనారాయణం దేవం సర్వలోక ప్రకాశకమ్**
**జ్యోతిర్మయ స్వరూపం తం భానిధిం ప్రణమామ్యహమ్"**
**"సర్వేజనా స్సుఖినోభవంతు"**

దైవసేవ

భక్తి మార్గాలు తొమ్మిదిగా మహాభక్తుడైన ప్రహ్లాదుడు గురుకులంలోని తన సహాధ్యాయులకు వివరించాడు. అవి ఏమనగా శ్రవణం – కీర్తనం – స్మరణం – సేవనం – అర్చన – వందనం – దాస్యం – సఖ్యం – ఆత్మనివేదనం.

1. శ్రవణం – భగవంతుని లీలావిశేషాలు వినటం.
2. స్మరణం – దేవుని రూపం, నామం సదా స్మరించటం.
3. కీర్తనం – దేవుని నామాలు, స్తోత్రాలు కీర్తించటం, పఠించటం.
4. సేవనం – భగవంతునినే కాక ఆయన భక్తులను కూడా అత్యధిక భక్తులను సేవించటం.
5. అర్చనం – దేవుని రూపాలుగా ఉండే ప్రతిమలను, చిత్రాలను విశేష ఉపచారాలతో సేవించటం.
6. వందనం – భగవంతునితో పాటు ఆయన భక్తులకు కూడా నమస్కారం చేయటం.
7. దాస్యం – దైవాన్ని తన యజమానిగా భావించి అత్యంత శ్రద్ధతో ప్రతినిత్యం దాసునిగా ఉండటం.
8. సఖ్యం – కేవలం దైవానికి దాసుడిగా ఉండటమే కాక తక్కిన సమయంలో ఆయనతో స్నేహంగా ఉండటం.
9. ఆత్మనివేదనం – యథాశక్తి తాను కృషి చేస్తూ ఫలితాలు దేవునిపై ఉంచి ఆయనను శరణు వేడటం.

ఈ తొమ్మిది మార్గాలలో ఏదైనా ఒకటి కాని, అన్నీ కాని మిక్కిలి శ్రద్ధాసక్తులతో అభ్యసిస్తూ సర్వం నారాయణంగా భావించి తాను కేవలం కారణమాత్రుడుగా ఉండాలి.

పై తొమ్మిది మార్గాలు దేనికదే శ్రేష్ఠంగా భావించాలి. కాని వాటిలో ఒకటి లేదా రెండిటినైనా మరింత నిష్ఠతో సాగించాలి. ఆవిధంగా కాకుండా స్వలాభాపేక్షతో భక్తిమార్గం అనుసరిస్తే అది నిష్ప్రయోజనమవుతుంది.

అదీగాక నిత్యకృత్యంగా పూజలు, ప్రార్థనలు చేస్తుంటే భక్తిభావం పెరుగుతుంది అనుకోవటం కేవలం భ్రమే అవుతుంది. అలాగే ప్రతి వ్యక్తిలోనూ ఒక లోపం ఉండటం సహజం. అందుకోసం దయ, దానం, దమము అనేవి ప్రతి మానవుడు తన కర్తవ్యంగా భావిస్తేనే మనస్సు తేలికవటమే కాక కేవలం పూజా విధులతో దైవకార్యాలను ఆచరించటం వలననే కాక అంకితభావం, సేవాభావం మొదలగునవి అవసరం అని గ్రహించాలి. భగవద్ధ్యానం, తోటివారందరినీ భగవంతులుగా భావించటం చేస్తుంటే జీవనం పావనం అవుతుంది. భక్తిభావం హెచ్చిన కొలదీ దేవదేవుడే నాకు దిక్కు అనే భావం ప్రచారమై భగవదన్యం ఏదీ కాదని తెలుస్తుంది.

క్లుప్తంగా చెప్పాలంటే భగవంతుని మనం సంపూర్ణంగా అర్చన చేస్తే అది మన భక్తిని సార్థకం చేస్తుంది.

ఓం నమో నారాయణాయ

# దైవ చింతితులకు దేహచింతనలేల?

– కూర్మాచలం శంకరస్వామి

**"దైవ చింతితులకు**
**దైవ కరుణ యున్న దారి దొరుకు**
**దైవ చింతితులకు దేహ చింతనలేల**
**శంకరునిది పలుకు శంక వలదు"**

ఈ చరాచర జగత్తు పరమాత్మ స్వరూపమని, ఈ జగతిని నడిపించువాడు ఆ పరమాత్మయేనని వేదాలు ఘోషిస్తున్నాయి. శాస్త్రం సాంకేతికంగా ఎంత అభివృద్ధి చెందినా, రాకెట్ల ద్వారా మానవులు గ్రహాంతర సీమల గమనాలను కనుగొన్నా చావూ పుట్టుకల నుండి తప్పించుకోలేకపోతున్నాడన్నది అక్షర సత్యం. కనుక భగవంతుడున్నాడన్నది సత్యం. అతడు ఈ లోకాన్ని అనుక్షణం పరిరక్షిస్తున్నాడన్నది పరమ సత్యం.

**ఇందుగలడందులేడని**
**సందేహము వలదు చక్రి సర్వోపగతుం**
**డెందెందు వెదకి చూసిన**
**నందందే కలడు దానవాగ్రీన్ వింటెన్**

అని ప్రహ్లాదుడు తన తండ్రియైన హిరణ్యకశిపునితో పలికిన పలుకులను బట్టి భగవంతుడు ఒకచోట ఏమిటి, అన్నిచోట్ల ఉన్నాడని, అతడు సర్వాంతర్యామి కనుక విశ్వమంతా వ్యాపించి యున్నాడని, ఎక్కడ వెదికి చూచినా అక్కడ ప్రత్యక్షమవుతాడని, దానిలో ఇసుమంత కూడా సందేహింపవవలసిన అవసరం లేదని తెలుస్తోంది. అలాంటి దైవంపై నిరంతరం చింతన గలిగిన వారికి నశ్వరమైన దేహము (శరీరం)పై వ్యామోహం ఉండదు.

భక్త ప్రహ్లాదుడు దైవ చింతనాపరుడు. లేచింది మొదలు నిద్రించు వరకూ హరినామ స్మరణ తప్ప అన్యమెరుగడు. ఏ పని చేసినా హరినామ స్మరణతోనే ప్రారంభించేవాడు. అతడు తన దేహంపై వ్యామోహమును ప్రదర్శించలేదు. తండ్రియైన హిరణ్యకశిపుడు అత్యంత క్రూరంగా ప్రహ్లాదుని దేహాన్ని పాములతో కరిపించినా, ఏనుగులతో తొక్కించినా, శూలాలతో పొడిపించినా, కొండలమీది నుండి పడవేసినా, చివరికి సముద్రంలోకి తోసివేసినా, మరెన్నో హింసలకు గురిచేసినా అతడు తన దేహం కొరకు చింతించలేదు. చివరకు అతని దైవ చింతన గెలిచింది. దైత్యుడైన హిరణ్యకశిపుడు మరణించాడు. ఎందుకంటే అతడు తన భుజబల పరాక్రమమే శాశ్వతమనుకున్నాడు.

కుచేలుడు కూడా అంతే. అతడు ఏనాడూ దైవ చింతన తప్ప దేహముపై వ్యామోహము చూపలేదు. పేదరికంతో ఎన్నో బాధలు పడినా తన శరీరం, కట్టుకున్న వస్త్రాలు జీర్ణమైనా అతడు తన దైవచింతనను ఏనాడూ వీడలేదు. భిక్ష కొరకు ప్రతిరోజూ ఐదు గడపలు మాత్రమే తిరిగేవాడు. భిక్ష దొరికినప్పుడూ, దొరకనప్పుడూ అంతా దైవకృపగానే భావించేవాడు. రాజులను కీర్తిస్తే సకల భోగాలు లభిస్తాయని తెలిసినా ఆ శ్రీకృష్ణుని తప్ప ఇతరులను కీర్తించలేదు. కాని భక్తవత్సలుడైన ఆ శ్రీకృష్ణుడే కుచేలుణ్ణి తన వద్దకు రప్పించుకుని హంసతూలికా తల్పంపై కూర్చుండబెట్టుకుని, ఆ పరమాత్ముడే స్వయంగా అతనికి పాద ప్రక్షాళన గావించి సకల భోగాలను ప్రసాదించాడు.

ఇలాంటి దైవ చింతితుల చరిత్రలు కృత, త్రేత, ద్వాపర యుగాల్లోనూ, అష్టాదశ పురాణాల్లోనూ మనకు ఎన్నో కనిపిస్తాయి.

ఆయా యుగాల్లోనే కాదు, కలియుగంలో కూడా దైవ చింతితుల చరిత్రలు కోకొల్లలు. ఆదిగురువు శంకరాచార్యులు, భగవద్రామానుజులు, తులసీదాసు, పురందరదాసు, త్యాగయ్య, క్షేత్రయ్య, అన్నమయ్య, రామదాసు, తరిగొండ వేంగమాంబ తమ కీర్తనల ద్వారా నిత్యం దైవచింతనలతో దైవభక్తిని ప్రచారం చేసి ముక్తిని పొందారు. వారు ఏనాడూ దేహంపై వ్యామోహం ప్రదర్శించలేదు. కాబట్టే వారి పేర్లు చిరస్మరణీయాలు అయ్యాయి.

దేహం అస్థిరం కాని ఆత్మ స్థిరమైనది యని భగవద్గీత రెండవ అధ్యాయంలో స్వయంగా భగవంతుడే అర్జునునితో చెప్పిన శ్లోకాలను బట్టి చూస్తే ఈ దేహాలు ఎప్పటికైనా నశించిపోతాయని, వాటికోసం అంగలార్చడం అవివేకమని తెలుస్తుంది.

ఈమధ్య కాలంలో దైవచింతితులమనే పేరుతో దొంగ స్వాములూ, దొంగ బాబాలు, దొంగ మఠాలు ఎక్కువగా ఏర్పడి ప్రజలను అనేక తప్పుడు మార్గాలలో ప్రయాణించేలా ప్రయత్నిస్తున్నారు. తుచ్ఛమైన దేహవాంఛల కోసం దైవత్వానికే సవాలు విసురుతున్నారు. అలాంటివారు ఎప్పటికైనా కాలగర్భంలో కలవక తప్పదు.

శరీరం మాద్యం ఖలు ధర్మసాధనమ్ అంటుంది కుమారసంభవం. అనగా ధర్మకార్యాలు చేయడానికి శరీరం ఒక దివ్య సాధనం. అలాంటి శరీరంపై వ్యామోహం పెంచుకోవడం మూర్ఖత్వమే. కనుక దేహ చింతనలు మాని దైవచింతన వైపు అడుగులు పడినప్పుడే ఆ పరమాత్ముని అనుగ్రహం లభిస్తుంది.



# రంతిదేవుడు

- మందరపు
వి.జి.శంకరాచారి

**పూర్వకాలంలో రంతిదేవుడు అనే రాజు రంతి పురాన్ని (ప్రస్తుతం ఇది చంబల్ ప్రాంతంలోని ఆధునిక రణతంబూరుగా పిలువబడుచున్నది. ఇది రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలు మూడూ కలిసే ప్రాంతంలో ఉంది) ప్రజానురంజకంగా పరిపాలించేవాడు. ప్రజలయొక్క యోగక్షేమాలకే ఎక్కువగా ప్రాధాన్యత ఇచ్చేవాడు. అంతేకాదు తన రాజ్యంలో ఎవరూ ఆకలితో అలమటించకూడదని అందరికీ ఏదో ఒక విధంగా రాజ్యంలో పని కల్పించి తమకు తాముగా జీవించే అవకాశాన్ని కల్పించేవాడు. ప్రజలు రంతిదేవుడి పరిపాలనకు, అతడి యొక్క సమర్థమైన నాయకత్వానికి జోహార్లు అర్పించుకుంటూ రామరాజ్యంలో నివసిస్తున్నామని భావించేవారు.**

రంతిదేవుడు గొప్ప విష్ణుభక్తుడు. భక్తిసామ్రాజ్యంలో అతడిది ఎప్పుడూ తొలిమెట్టే. అంతేకాదు అరిషడ్వర్గాలను జయించిన జితేంద్రియుడు. గొప్ప దానశీలి. ఎవరు ఏది అడిగినా కాదనకుండా ఇచ్చేవాడు. ఇతడి యొక్క దానగుణం ఒక శిబి చక్రవర్తి, బలి చక్రవర్తి, దాన కర్ణుడికి ఏమాత్రం తీసిపోదు.

రంతిదేవుడు నిరంతరం దానధర్మాలతో జీవించేవాడు. అతడి భావాలను గౌరవించే సహధర్మచారిణి, పుత్రులు ఉండటం అతడి అదృష్టం. రంతిదేవుడు ఎప్పుడూ తన గురించి, తన కుటుంబం గురించి ఆలోచించకుండా విచ్చలవిడిగా దానం చేయడం వలన అతడి ఐశ్వర్యం రోజు రోజుకీ తరిగిపోసాగింది. అయినా సరే ఉన్నంతలో కాదనక ఎవరు ఏది అడిగినా దానం చేసేవాడు. మనకు ఇష్టమొచ్చిన దానిని ఎదుటివారికి ఇవ్వడం దానంగా చెప్పబడదు. ఎవరు తమ యొక్క అవసరం ఏమిటో చెప్పి ఆ అవసరాన్ని తీర్చమని కోరినప్పుడు దానిని ఇవ్వడం దానం అనిపించుకుంటుంది. అందుకే రంతిదేవుడు ఎవరి అవసరం ఏమిటో తెలుసుకుని దాని ప్రకారం దానం చేసేవాడు.

రంతిదేవుడు అపరిమితంగా దానం చేయడం వలన ఐశ్వర్యంతో పాటు రాజ్యాన్ని కూడా పోగొట్టుకుని కుటుంబంతో సహా అడవుల పాలయ్యాడు. ఆ అరణ్యంలో తినడానికి ఏమీ దొరకక 48 రోజుల పాటు కుటుంబమంతా పస్తులున్నారు.

చివరకు 49వ రోజు వారికి తినడానికి కొంత ఆహారం దొరికింది. ఆరోజు భార్యాపుత్రులతో కలిసి ఆహారం తిందామని అనుకున్నంతలో వారి దగ్గరకు ఒక సద్బ్రాహ్మణుడు వచ్చి... ''అయ్యా! నేను గత పది రోజులుగా తినడానికి ఆహారము లేక పస్తులుంటున్నాను. కళ్ళు తిరుగుతున్నాయి. ప్రాణాలు పోతాయేమోనన్న భయంగా ఉంది'' అన్నాడు.

వెంటనే రంతిదేవుడు తన దగ్గరయున్న ఆహారంలో కొంతభాగం ఆ బ్రాహ్మడికిచ్చి వాడి ప్రాణములు నిలబెట్టాడు.

రంతిదేవుడు ఇచ్చిన ఆహారాన్ని తిని ఆనందంగా వెళ్ళిపోయాడా బాపడు. అతడు వెళ్ళిన వెంటనే మిగిలిన ఆహారాన్ని తిందామని అనుకున్నంతలో ఒక శూద్రుడు రంతిదేవుడి దగ్గరకు వచ్చి ''బాబూ! చాలా ఆకలిగా ఉంది. తినడానికి ఏమైనా ఉంటే తనకిచ్చి ప్రాణాలు నిలబెట్టమని'' బేలగా అడిగాడు.

అంత రంతిదేవుడు కరిగిపోయాడు. మరియొక ఆలోచన లేకుండా తను తిందామనుకున్న ఆహారములో మరికొంత అతడికిచ్చి వాడి ప్రాణాలు కూడా నిలబెట్టాడు.

చివరికి మిగిలిన కొంచెం అన్నం తిని... మంచినీరు తాగుదామని అనుకున్న సమయంలో ఒక ఛండాలుడు రెండు శునకములతో రంతిదేవుని దగ్గరకు వచ్చి ''తండ్రీ! గత నాలుగు రోజులుగా తినడానికి తిండి లేదు. తాగడానికి కనీసం నీరైనా దొరకలేదు. ఈ కారణం వలన నేను, నాతోపాటు ఈ మూగ జీవాలు మల మల మాడిపోతున్నాయి. అమితమైన దాహంతో



మా నోళ్ళు పిడచకట్టుకు పోతున్నాయి. ముందుగా మా ఆకలిని తీర్చి, దాహార్తిని బాపవయ్యా'' అన్నాడు వినయంగా.

వెంటనే రంతిదేవుడు తను తిందామనుకున్న ఆహారాన్ని, మంచినీటిని ఆ ఛండాలునికి సంతోషంగా సమర్పించాడు. ఆ ఛండాలుడు వాటిని సంతోషంగా స్వీకరించి వెళ్ళిపోయాడు.

రంతిదేవుడితో పాటు అతడి భార్య కూడా ఎంతో ఉత్తమురాలు. పిల్లలు కూడా తండ్రి చెప్పినట్లు ఆలకించే ఉత్తమ సంతానం. అప్పుడు రంతిదేవుడు తాము తిందామని అనుకున్న ఆహారాన్ని ఇతరులకి ఇచ్చినా సరే ఏవిధంగానూ నిందించలేదు వారు. అందుకే రంతిదేవుడు వారిని మెచ్చుకుంటూ ''దేవీ! నీవు ఉత్తమ ఇల్లాలివి. నా సంతానం ఉత్తమ సంతానం. అందుకే ఈ నలభై ఎనిమిది రోజులూ ఆహారం లేక పస్తులున్నా సరే నన్ను పల్లెత్తుమాట అనలేదు సరికదా.. మనం తినడానికి దొరికిన ఆహారాన్ని ఇతరులకి పంచిపెడుతున్నప్పుడు కూడా మీరు అభ్యంతరం చెప్పలేదు. నా వ్యక్తిత్వాన్ని కించపరచలేదు. ఇందుకు మీకు నా కృతజ్ఞతలు'' అన్నాడు.

''మనం తినడం ముఖ్యం కాదు... ఉన్నంతలో ఇతరులకి ఇవ్వడమే ప్రధానం. ఆ శ్రీహరి ఈరోజు నలుగురి ఆకలిని తీర్చే అవకాశం మనకిచ్చినందుకు ఆ దేవదేవుడికి ముందుగా కృతజ్ఞతలు తెలుపుకుందాం. ఉన్నంతలో సంతృప్తి పడటం... ఎదుటివారు ఏది అడిగితే దానిని ఇవ్వడం మన ధర్మం. ఈ ధర్మమే మనల్ని ఉత్తమస్థితులకు చేర్చేది'' అని చెబుతున్నంతలో రంతిదేవుడికి త్రిమూర్తులు ప్రత్యక్షమయ్యారు.

స్థితికర్త విష్ణుమూర్తి రంతిదేవుడితో ''భక్తాగ్రేసరా! నీవు నా భక్తుడవని తెలుసు. నిన్ను పరీక్షించదలచి మేమే బిచ్చగాళ్ళుగా నీ దగ్గరకు వచ్చాము. సంకట స్థితిలో కూడా నీ దగ్గరకు వచ్చి అడిగినవారికి లేదనకుండా ఇచ్చే నీ దానగుణం గొప్పది. నీ వ్యక్తిత్వంతో త్రిమూర్తులను సంతృప్తి పరచినందుకు నీకు ఏ వరం కావాలో కోరుకో అనుగ్రహిస్తాను'' అని పలికెను.


అందుకు రంతిదేవుడు ''స్థితికారకా! ఈ సమస్త సంపదలు, ఐశ్వర్యం ఎప్పటికైనా నశించేవే. ఎప్పుడూ నశించని విష్ణుభక్తిని జీవించినంతకాలం నాలో నిబిడీకృతమై యున్న దానగుణమనే శీలసంపద ఏనాడూ చెదిరిపోకుండా ఉండేటట్లు చేయి తండ్రీ'' అని కోరాడు.

''రంతిదేవా! నీ యొక్క కోరికను అనుగ్రహిస్తున్నాను. అంతేకాదు.. నీవు పోగొట్టుకున్న ఐశ్వర్యాన్ని... రాజ్యలక్ష్మిని తిరిగి అనుగ్రహిస్తున్నాను. ప్రజానురంజకంగా పరిపాలన చేసి తుదకు ముక్తుడవై నాలో ఐక్యమవుదువు గాక'' అంటూ వరాన్ని అనుగ్రహించాడు.

తదనంతర కాలంలో విష్ణుభక్తితో ఓలలాడిన రంతిదేవుడు చివరికి విష్ణులోకం చేరుకున్నాడు.

★★★

ధారావాహికం



# మహాభారతంలోని మహోపాఖ్యానాలు

- డా॥ పులిగడ్డ విజయలక్ష్మి

## లుబ్ధ కపోతాలు

సూతమహర్షి సరస్వతీ ప్రార్థన చేస్తూ వేదిక వద్దకు వచ్చాడు. శౌనకాది మునులందరూ లేచి నమస్కరించారు. ఆశీర్వదిస్తూ అందరివైపు పరిశీలనగా చూశాడు సూతమహర్షి. సూతమహర్షి వేదికనలంకరించగానే అందరూ ఆసీనులైనారు. వెంటనే ఆయన ''నాయనలారా! ఈరోజు శరణు కోరి వచ్చినవారిని అతిథి మర్యాదతో సత్కరించిన వారికి కలిగే పుణ్యం గురించిన ఒక కథ చెబుతాను వినండి. ఆ పుణ్యం అంతా ఇంతా కాదు. ఒకవేళ ఆ వ్యక్తి అడగకపోయినా తమ ఇంటికి వచ్చినవారిని ఆదరించి, కావలసినవి ఇవ్వటం మరింత పుణ్యాన్ని ప్రసాదిస్తుంది. ఆ విషయం బోధపడే ఒక పావురం ప్రవర్తన గురించి ఇప్పుడు చెప్పుకుందాం. పావురం ఏమిటి అతిథి మర్యాద ఏమిటి అనుకుంటున్నారా! పశు పక్ష్యాదులు కూడా సత్ప్రవర్తనతో, ధర్మబద్ధంగా నడుచుకుంటూ ఉంటాయి. అవి మానవులకు ఆదర్శంగా కూడా ఉంటాయనుకోండి. ఇక, అసలు కథలోనికి వద్దాం'' అని చెప్పటం ప్రారంభించాడు మహర్షి. మునులు ఆసక్తితో ఆయన చెబుతున్న దానిని వినసాగారు.

''ఒక ఊరిలో ఒక బోయ పాపకార్యాలు చేస్తూ జీవనం సాగిస్తూ ఉండేవాడు. అడవిలో తిరుగుతూ పక్షులను చంపి, వాటి మాంసాన్ని ఆహారంగా చేసుకొని బ్రతకటమే గాక, తన తిండికి సరిపోగా మిగిలిన వాటిని అమ్ముకొంటూ – అదే తన బ్రతుకుదెరువుగా మసలుతుండేవాడు. అలా చరిస్తూ ఉండగా ఒకనాడు పెద్ద గాలివాన రావడంతో అడవంతా తడిసి, నీళ్ళు ప్రవహించసాగాయి. అడవిలో ఉన్న జీవులన్నీ నశించాయి. అదాంతా చూసిన లుబ్ధకుడు (బోయవాడు) హడలిపోయి, తిరిగి తిరిగి ఒక మెట్టప్రాంతం చేరాడు. ఆ గట్టునానుకొని ఒక పెద్ద వృక్షం ఉంది. ఆ చెట్టు శాఖోపశాఖలు చుట్టూ చాలా ప్రదేశాన్ని ఆక్రమించి ఉండటంతో బోయవాడు కొంత ఊరట చెందినవాడై, అక్కడే ఉన్న ఒక పెద్ద రాతిమీదకు చేరుకొన్నాడు. అంతలోకి వానే కాకుండా చీకటి ముంచుకొచ్చింది. ఈ రాత్రికి ఇల్లు చేరలేనని తలచినవాడై, ఆ రాతి మీదే నిద్రిద్దామనుకొని పడుకొన్నాడు. నిద్ర రాలేదు సరికదా బోయవాడు చలికి గజగజ

వణికిపోతూ భయగ్రస్తుడై అటూ ఇటూ చూసినా అతనికి సురక్షిత ప్రాంతం ఏదీ కనపడలేదు. భయ భక్తులు తరుముకొనిరాగా 'ఈ అడవిలో ఉన్న సమస్త భూతగణాలను కొలుస్తాను. కరుణతో మీరందరూ నన్ను రక్షించండి. నేను పదే పదే మిమ్మల్ని ప్రార్థిస్తున్నాను. నా మొఱ ఆలకించండి. ఇదే మీకందరికీ నమస్కరిస్తున్నాను' అని సాష్టాంగ నమస్కారం చేశాడు ఆ బోయవాడు. కొంతసేపటికి అలసిపోయి ఉన్న బోయ నిద్రపోయాడు.

బోయ ఆశ్రయించిన చెట్టు తొర్రలో నివసిస్తున్న ఒక పావురం ఇదంతా చూసింది. తన భార్య ఇంకా గూటికి రాలేదే అని బాధపడింది. ఇంత పెద్ద వానలో ఎక్కడ ఉందో, ఎలా ఉందో అని దిగులుపడసాగింది. నేను లేకుండా నా భార్య ఒక్కతే ఎలా ఉండగలుగుతుంది? ఉండలేదే! నా సతి లేకపోతే నేను బ్రతకగలనా? అసంభవం. భర్త పట్ల అత్యధికమైన అనురాగం కలిగి ఉన్న సద్గుణవతి అయిన భార్యే భర్తకు ఇహలోక సుఖాలను, ముక్తిని కూడా లభింపచేస్తుంది గదా! అటువంటి శీలవతి అయిన నా భార్య ఎలా ఉందో, దురదృష్టవశాత్తూ ఈ పెనువానలో పడి మృతి చెందలేదు గదా? ఆమె లేని నా గూడు పాడుబడిపోయినట్లున్నది. ఇప్పుడు నేనేమి చేయగలను? ఎక్కడని వెదకగలను? నా బాధ ఎవరు తీరుస్తారు?'' అని బాధపడుతున్న మాటలన్నీ ఆ మగపావురం వ్యధను బోయవాడి వలలో చిక్కుకొని ఉన్న అతని భార్య అయిన ఆడ పావురం విని ఎంతో సంతోషించింది. తనమీద తన భర్తకెంత గొప్ప ప్రేమ ఉన్నదని ఆలోచిస్తూ మరింత మురిసిపోయింది.

**"పతిమదికి నింత యెక్కిన**
**యతివగదా పుణ్యవతి! ప్రియాలాపము లీ**
**గతి వినగాంచితి జన్మము**
**కృతకృత్యంబయ్యె నాకు! గెలిచితి జమునిన్"**

**-311 ప – తృతీయాశ్వాసము – శాంతిపర్వము – శ్రీమదాంధ్ర మహాభారతము – తిక్కన**

''భర్త మనసుకు ఇంత చక్కగా నచ్చిన భార్య గదా పుణ్యవతి. నా పతి నోటి నుంచి నన్ను గురించిన ఇన్ని ప్రియమైన పలుకులు విన్న నా జన్మము నిజంగా సార్థకమైంది. నేను నిజంగా అదృష్టవంతురాలిని. భార్య సద్గుణవతి అని మెచ్చుకొన్న భర్తలు ఎంతమంది స్త్రీలకు దొరుకుతారు? యమధర్మరాజును గెలిచాను గా!'' అని ఆ పెంటి మనసులో ఎంతగానో సంతృప్తి చెందింది.

'తాను బోయవాని వలలో చిక్కుకోబడి ఉన్నానని తెలిపి, విధి నిర్ణయానికి బాధపడవలసిన పనిలేదు, ఏ నిముషానికి ఏం జరగాలో అది జరుగుతుంది, ఏదీ మన చేతిలో లేదు గదా!'' అని మగపావురానికి వినపడేటట్లు చెప్పింది ఆ ఆడపావురం. ఇంకా ఏమి చెప్పిందో వినండి మునులారా! అంటూ క్షణకాలం చెప్పటం ఆపాడు సూతమహర్షి.

> అన్నా! నీవు బాగా అలసిపోయినట్లు కనిపిస్తున్నావు. మా ఇంటికి అతిథిగా వచ్చావు. నీకు ఆతిథ్యం ఇవ్వటం నా ధర్మం. ఏమాత్రం ఆలసించకుండా నీకు ఏమి కావాలో అది సమకూర్చడం నా విధి. కనుక నన్ను ఏం చేయమంటావో, ఏమివ్వమంటావో చెప్పవలసిందిగా కోరుతున్నాను. దయచేసి నీకేమి కావాలో తెలుపు స్వామీ!

''ఆశ్రితులను ఎలా కాపాడాలో, ఏవిధంగా ఆదరించాలో చెబుతూ మగనికి ధర్మమార్గాన్ని బోధించిన ఆడపావురం ధన్యజీవనే చెప్పాలి అని సూతుడనగానే ఒక ముని లేచి – ''ఏ ధర్మం ఉపదేశించింది గురుదేవా! వినాలని కుతూహలంగా ఉంది'' అని అడిగి కూర్చున్నాడు. సూతుడు మళ్ళీ చెప్పటం మొదలుపెట్టాడు.

**"శరణము సొచ్చినందగఁ బ్రసన్నతగైకొని రక్షణంబు సా**
**దరముగ చేయుటత్యధిక ధర్మముగా బుధకోటిసెప్పు; నీ**
**వరసి మహోర్మి వీని శరణాగతు నోపిన భంగి నా పదం**
**బొరయకయుండజేయుముప్రభూతపుసీతునకొంకువోయెడున్"**

**-313 ప – తృతీయాశ్వాసము - శాంతిపర్వము – శ్రీమదాంధ్ర మహాభారతము – తిక్కన**

''నాథా! ఆ బోయ అడిగినా; అడగకపోయినా; మనల్ని ఆశ్రయించి ఉన్నాడు. మన నివాసం వద్దే ఉన్న శరణాగతుడు. ఎందుకంటే చూడు. ఇంత పెద్ద గాలివానలో చిక్కుకుపోయి, తిండీ తిప్పలు లేక విపరీతమైన చలికి అవయవాలు కొంకర్లు పోతుంటే వణికిపోతున్నాడు. పండితులు – శరణు కోరినవారిని దయతో ఆదరించి రక్షించటం మహాపుణ్యమని చెప్పారు. ఆ మాటలు నీకు గుర్తున్నాయా? ఒక్క పుణ్యమే కాదు, అది అత్యధిక ధర్మమని కూడా సెలవిచ్చారు. గృహస్థ ధర్మమైన అతిథి సేవ చేయటం నీ కర్తవ్యం గదా! ఈ బోయ మిక్కిలి బాధలో ఉన్నాడు. పైగా నిన్ను శరణు కోరి ఇక్కడే ఉన్నాడనుకో. అతని ఆర్తిని చూసి, అతడు ఆపదపాలు కాకుండా నీకు చేతనయినంత సహాయం చెయి. నీ రక్షణలో ఆ బోయవాడు సుఖంగా ఉండేటట్లు చేయడం నీ బాధ్యతగా గ్రహించు'' అని మృదువుగా చెప్పిన భార్య మాటలు మగపావురం చెవిన బడ్డాయి. అంతవరకూ పెంటి ఏమైందో అని

బాధపడ్డ మగపావురం భార్య చేసిన ధర్మబోధకు సంతోషించి శోకాన్ని వదిలివేశాడు. తన కర్తవ్యాన్ని గుర్తు చేసుకొన్నాడు. బోయవాడిపట్ల జాలివహించాడు. బోయని చూసి మానవభాషలో తన జాతి గురించి (పావురాన్నని) ముందుగా చెప్పి అతనిని సేద తీర్చాడు. ''అన్నా! నీవు బాగా అలసిపోయినట్లు కనిపిస్తున్నావు. మా ఇంటికి అతిథిగా వచ్చావు. నీకు ఆతిథ్యం ఇవ్వటం నా ధర్మం. ఏమాత్రం ఆలసించకుండా నీకు ఏమి కావాలో అది సమకూర్చడం నా విధి. కనుక నన్ను ఏం చేయమంటావో, ఏమివ్వమంటావో చెప్పవలసిందిగా కోరుతున్నాను. దయచేసి నీకేమి కావాలో తెలుపు స్వామీ!'' అని అడిగింది మగపావురం భార్య మాటలు మదిలో మెదులుతుండగా.

పక్షులను చంపి తినే ఆ బోయవాడికి, ఆ కఠినాత్ముడికి – పావురం అన్న మాటలు ఎంతో సంతోషాన్ని కలిగించాయి. హృదయం ఉప్పొంగిపోయింది. వెంటనే ఆ పక్షి వైపు చూశాడు.

''పక్షిరాజా! నీ మాటలు నాకు చాలా ఆనందం కలిగించాయి. ఈ గాలివానకు నా శరీరం ఎలా వణికిపోతోందో చూడు! ప్రతి అవయవం ఎంతో తీపు పెడుతోంది. భరించలేని ఈ నొప్పి పోగొట్టు''. బోయ మాటలకు పావరం జాలిపడింది. ఎండుపుల్లలు ఉండే చోటుకు వెళ్ళి వాటిని ముక్కుకు కఱచుకొని తెచ్చి గుట్టగా పోసింది. దగ్గరలో ఉన్న పల్లెకు వెళ్ళి అగ్గి తెచ్చి ఆ పుల్లలకు అంటించింది. బోయతో – ''అయ్యా! ఈ మంటతో చలి కాచుకో. వెచ్చగా ఉంటుంది. నీ బాధ తొలగిపోతుంది'' అని ప్రేమగా చెప్పింది. బోయవాడు మెల్లగా అవయవాలనన్నిటినీ కాచుకొని చలి పోగొట్టుకొన్నాడు. అంతటితో ఆగక, ''ఓ పక్షీంద్రా! బాగా ఆకలిగా ఉంది. ఆకలి పోగొట్టవా? ఏదైనా సరే పెట్టు. ఈ బాధ కూడా భరించలేకుండా ఉన్నాను. నీవు జాలిగల దానివి. నన్నర్థం చేసుకొని నీవు ఏదైనా తెచ్చి పెడతావని అనుకొంటున్నాను'' అని దీనంగా అడుగుతున్న బోయవాడివైపు చూసింది పావురం. అతడి శరీరం వెచ్చనైనందుకు, అతనిలో సంతోషం వెల్లివిరిసినందుకు పావురం కూడా తన ప్రయత్నం సఫలమైనందుకు తృప్తి పడింది. కాని అతనికి ఆహారం కావాలంటే ఎక్కడనుంచి తేగలనని బాధపడింది. పావురానికి అతిథి కోరిక తీర్చడానికి ఉపాయమే దొరకలేదు.

''అయ్యా! పక్షులకు ఆహారాన్ని కూడబెట్టుకోవడం తెలియదు. ఆకలికి – అప్పుడు ఏది దొరికితే దానిని తిని కడుపు నింపుకుంటాము. నిన్ను చూస్తే బాగా అలసిపోయి ఉన్నావు. నీవు ఆకలితో అలమటిస్తున్నావని తెలుస్తోంది. అతిథిగా నిన్ను సంతృప్తి పరచటం నా విధి. నా శరీరాన్ని ఆహారంగా ఇస్తాను. అనుమానించక స్వీకరించు'' అని చెప్పి పావురం అక్కడే ఉన్న అగ్నికి ముమ్మారు ప్రదక్షిణం చేసింది.

**"అని పలికి యగ్ని వల గొని**
**తనదేహము దానిలోన తడయక యిడినం**
**గని బోయ విస్మయంబున**
**మనమూనగ కొంతసేపు మ్రాన్పడియుండెన్"**

**-323 ప – తృతీయాశ్వాసము – శాంతిపర్వము – శ్రీమదాంధ్ర మహాభారతము – తిక్కన**

ఏమాత్రం జంకూ గొంకూ లేక, క్షణం కూడా ఆలస్యం చేయకుండా మంటలలో పడి అతిథి కోసం ఆహుతయింది. అది చూసిన బోయవాడు క్రూరుడైనా, తన కళ్ళముందు జరిగిన ఘటనకు తట్టుకోలేక దిగ్భ్రమ చెందాడు. కొంతసేపు కొయ్యబారిపోయాడు. మరికొంతసేపటికి తేరుకొని తన జీవిత విధానానికి వేదన చెందాడు. ''ప్రపంచంలో ఇటువంటి సాహసం చేసే వాళ్ళెవరైనా ఉన్నారా? ఈవిధంగా ధర్మాచరణ కోసం ప్రాణత్యాగం చేసేవారెవరైనా ఉన్నారా? నామీద కేవలం జాలితో తనను తాను అగ్నికర్పించుకుంది. అతిథి సత్కారం ఇలా కూడా ఉంటుందా? నేను ఎటువంటివాడిని! ఇంతకాలం క్రూరచర్యలతో, హింసాత్మకమైన నడవడికతో లోకనింద పొందానే! ఆలోచించి చూస్తే నా కోరిక ఆ పక్షికి ఇంత ఆపద కలిగిస్తుందా? కొంచెమైనా జాలి లేకుండా హింసతో కూడిన పనులు ఇక నేను చేయజాలను. లోకులు నన్ను ఘోర కిరాతకుడని నిందిస్తుంటే వినలేను. ఈ పావురం నాలో తెలివిని నింపింది. ప్రాణ పరిత్యాగం చేసి ఈ పిట్ట నాలో మంచి అంటే ఏమిటో తెలియజేసింది. నిజంగా నాకీ పావురమే గురువు'' అని అనుకొన్న బోయ తన జీవిత విధానాన్నే మార్చుకొన్నాడు. చెడు వదిలి మంచిగా జీవించటం అలవర్చుకొన్నాడు. అంతకంతకు బోయవాడిలో వైరాగ్యం పెరిగిపోసాగింది. అతనిలో అవే ఆలోచనలు ఒకదాని తరువాత మరొకటి సాగుతూ పెనవేసుకుపోయాయి. ప్రతిరోజూ అదే మాట.

> **"ఈ పావురం తన భార్యను, ఇంటిని వదలుకొని, కడకు తన జీవితాన్నే వదులుకొని మంటల్లో దూకి గొప్ప ఆత్మత్యాగిగా నిరూపించుకొంది. నేను కూడా అదే సాహసంతో పాపాలకు నిలయమైన ఈ శరీరాన్ని వదిలివేస్తాను. అలాచేస్తే ఇంతకాలం నేను చేసిన పాపాలన్నీ పటాపంచలౌతాయి. పుణ్యుడిగా నిలబడగలుగుతాను."**

అదే పాట. ''ఈ పావురం తన భార్యను, ఇంటిని వదలుకొని, కడకు తన జీవితాన్నే వదులుకొని మంటల్లో దూకి గొప్ప ఆత్మత్యాగిగా నిరూపించుకొంది. నేను కూడా అదే సాహసంతో పాపాలకు నిలయమైన ఈ శరీరాన్ని వదిలివేస్తాను. అలాచేస్తే ఇంతకాలం నేను చేసిన పాపాలన్నీ పటాపంచలౌతాయి. పుణ్యుడిగా నిలబడగలుగుతాను'' అని అనుకొని వైరాగ్యభావంతో ఒక నిర్ణయానికి వచ్చాడు బోయవాడు. ఆ ఆలోచనతో అతడు ఊరట చెందాడు. ధనం మీద కోర్కె లేనివాడై వలలో ఉన్న పిట్టలనన్నిటినీ బయటకు వదిలివేశాడు. అవన్నీ ఎగిరిపోవటం చూసి తృప్తితో ఊపిరి పీల్చాడు. పిట్టలను పట్టుకొనే సాధనాలను (పనిముట్లను) వలను అక్కడే వుంచి తాను కోరుకున్న జీవితంలోని నియమ నిబంధనలను పాటిస్తూ అడవిలో తిరగసాగాడు. ఎప్పుడైతే బోయవాడు వలలోని పిట్టలనన్నిటినీ బయటకు యథేచ్ఛగా వెళ్ళమని వదిలివేశాడో, అప్పుడు బయటపడ్డ పెంటి తన నాథుడు అగ్నిలో పడి దేహత్యాగం చేసినందుకు ఎంతగానో విలపించింది. గొంతు బొంగురుపోగా, కన్నీరు కారుతుండగా, పతికి తన యందున్న ప్రేమభావాన్ని పదే పదే తలచుకొంటూ తన దీనావస్థకు ఏమి చేయలేక దిక్కులు చూస్తూ కొంతసేపుండిపోయింది.

నాథా! నాకు ఆకలి వేస్తే తట్టుకోలేకపోయేవాడివి. ఎంత ఆలస్యమయినా, ఆకలి ఎక్కువైనా కూడా నేను తిన్న తరువాతే నీవు తినేవాడివి. నేను కష్టపడితే ఓర్చుకోలేకపోయేవాడివి. అంతటి అనురాగమూర్తివైన నీవు నన్ను వదిలి అగ్నిలో దూకటానికి ఎలా సాహసం చేయగలిగావు? నేనేమైపోతానని అనుకొన్నావు? నన్ను అడవికి అప్పజెప్పి నీవు వెళ్ళిపోవటం ధర్మమేనా? మనిద్దరి క్రీడలు, వలపు గొప్పతనం ఎలా మరిచిపోగలిగావు? అవన్నీ తలచుకొంటూ ఉంటే నా హృదయం బ్రద్దలౌతోంది. నీవు లేని నేను ఎలా ఉండగలననుకొన్నావు? నేను మాత్రం నిన్ను వదిలి బ్రతకలేను సుమా! మనం విహరించిన సుందర ప్రదేశాలు కళ్ళముందు కదలాడుతున్నాయనుకో. ఒకటా, రెండా, మనం పర్యటించిన ప్రదేశాలు వందల కొలదీ ఉన్నాయి. ఎన్నని తలపోయాను.

చిగురుటాకులతో, రకరకాల పూలతో దట్టంగా ఉండే పూలపొదలు, కొండ కాలువల నుంచి వీచే చల్లని గాలులతో ఆహ్వానించే కాలువగట్లు, మామిడి మొదలైన వివిధ రకాలైన వృక్షాలతో ఒప్పే తోటలు, ఇంపు గూర్చే పరిమళాలు విరజిమ్మే లతలున్న వనాలు, కనువిందు చేసే పద్మాలతో నిండివున్న నదీతీర ప్రాంతాలు — మన క్రీడలకు ఆటపట్టు గదా! ప్రణయైక మూర్తివై నన్నానందింపజేసిన నీ మృదూక్తులు, శృంగార చర్యలు నేను ఎలా మరవగలను? నీవు లేని నేను ఎలా బ్రతకగలను? నా వశం కాదు జీవించటం. నేను కూడా ప్రాణాలు వదిలి, ఇప్పుడే నిన్ను చేరుకుంటాను.

**"తేని యను మరణమునఁ దన**
**మేను విడిచినట్టి కాంత మేలి పదవికిం**
**దాను నతండును నరిగి య**
**నూన స్థిర సుఖములందుచుండుట వింధున్"**

**-334 ప – తృతీయాశ్వాసము – శాంతిపర్వము – శ్రీమదాంధ్ర మహాభారతము – తిక్కన**

పతితో పాటు సహగమనం చేసి మరణించిన కాంత (స్త్రీ), భర్తతో పాటు ఉత్తమగతులు (స్వర్గసౌఖ్యాదులు) పొందుతుందని, సతీపతులిరువురు అనంత సౌఖ్యాలనుభవిస్తారని మహాత్ములు చెప్పగా విన్నాను''. ఆ మాట తనకెంతో బాగా నచ్చిందిగా భావిస్తూ, వెంటనే అగ్నిని ప్రజ్వలింపచేసింది పెంటి. భర్తను తలచుకొంటూ, హృదయం ఉప్పొంగిపోతుండగా, అగ్గి చుట్టూ మూడుసార్లు ప్రదక్షిణం చేసి, పతిని చేరుకొంటాను గదా అన్న ఆనందంతో అగ్నిలోకి ఒక్క దూకు దూకింది ఆ ఆడ పావురం.

దేవతలు చుట్టూతా ఉండగా, కాంతులీనుతున్న చక్కని విమానం మీద దేవతామూర్తిగా వెలుగొందుతున్న భర్తను చూసింది పెంటి. రత్నాభరణాలు ధరించి అందాలొలికిస్తున్న సుందరాకారంతో ప్రకాశిస్తున్న పతిని చూసి మురిసిపోయి ఆతనిని కలిసింది. పెంటికూడా సౌందర్యమూర్తిగా, అప్సరసలు అభినందిస్తుండగా, దైవత్వాన్ని పొందింది. ఈవిధంగా దేవతాలోకానికి పోయి, అక్కడ సకల సౌఖ్యాలు అనుభవిస్తున్న పావురాల జంట విషయం, సుగుణవంతుడిగా, ధర్మవర్తనుడిగా, పుణ్యచింతనతో జీవిస్తున్న బోయవాడికి అప్పుడే తెలిసింది.

**"ఏనును నిట్ల గుదు" ననుచు**
**నూనిన కౌతూహలమున నుల్లము వొదలన్**
**మేనెల్ల ముండ్లు సింపగ**
**కానతటిసి గళిత రక్త కలితాకృతియై"**

**-339 ప – తృతీయాశ్వాసము – శాంతిపర్వము – శ్రీమదాంధ్ర మహాభారతము – తిక్కన**

''ఆ పావురాల జంటలాగే నేను కూడా మంటల్లో పడి మరణిస్తే, నేనూ దేవలోకానికి వెళ్ళి అన్ని సుఖాలతో హాయిగా ఉండవచ్చు గదా! '' అని అనుకొన్నాడు ఆ బోయవాడు. ఆ ఆలోచనతో అతడి హృదయం ఉప్పొంగిపోయింది. ఎక్కడైనా అగ్ని కనిపిస్తుందా? అని అడవంతా తిరగసాగాడు. దానితో శరీరమంతా ముళ్ళు గుచ్చుకొని రక్తం కారింది. శరీరమంతా రక్తమయం కాగా, తిరగగా తిరగగా ఆ అడవిలో ఒకచోట మంటలు కనిపించాయి. దానితో సంతోషంతో పొంగిపోయాడు. ఈలోగా ఆ మంటలు అడవి అంతా నిండిపోయాయి. మంటల్లో పడి ప్రాణం విడిచాడు. అతని సత్ప్రవర్తనకు, ఆత్మత్యాగానికి దేవతా రూపాన్ని పొందాడు బోయవాడు'' అని చెప్పి సూతమహర్షి మునులందరివైపు చూశాడు.

''మునులారా! ఈ కథలో విశేషమేమిటంటే — సద్భావనతో ఆత్మత్యాగం చేస్తే సత్ఫలితమే దక్కుతుందని. అంతేకాదు, భార్యా

భర్తల అనురాగ మహత్వానికి, శరణాగత రక్షణ సామర్థ్యానికి ఈ పావురాల కథ చక్కని నిదర్శనం. శరణుకోరినవాడు ఎటువంటి వాడైనా – క్రూరుడైనా, పాపాత్ముడైనా, ఇంకే నేరస్తుడైనా – వాడిని రక్షించటం ధర్మబద్ధమని అందరూ తెలుసుకొని మసలాలి. శరణు కోరినవాడిని తృప్తి పరచి, సంతోషింపచేయటమే ఇందులోని నీతి. రేపు మరొక నీతికథ చెప్పుకుందాం'' అని చెప్పి సూతుడు లేవడంతో ఆయనతో సహా మునులందరూ ఆశ్రమోన్ముఖులైనారు.

## కుర్కురోపాఖ్యానము

మంచినీతిని బోధించే కథను చెబుతానని క్రితం రోజు సూతమహర్షి చెప్పడంతో ముందుగా వచ్చి ఆసీనులైనారు శౌనకాది మునులంతా. సూతమహర్షి కూడా వచ్చి వేదికనలంకరించటంతో మునులందరూ లేచి నమస్కరించి, వినమ్రులై కూర్చున్నారు. మునులారా! ఈరోజు ఒక కుక్క చేసిన అకృత్యం ఎంత దారుణానికి దారి తీసిందో చెబుతాను. ఒక మహాముని అత్యంత దీక్షతో తపస్సు చేసి, ఆశ్రమాన్ని ఏర్పాటు చేసుకొన్నాడు. ఆ ముని శ్రేష్ఠుడు తన తపోమహిమ వల్ల అనేక శక్తులను సంపాదించాడు. సకల జీవరాశులను కరుణామయుడై వాటికి కావలసిన ఆహారాది సమస్త అవసరాలు తీర్చేవాడు. ఆయన తపస్సిద్ధి అంతటిది. ఆయన మహిమ వల్ల క్రూర జంతువులూ, సాధు జంతువులూ అన్నీ కలిసిమెలిసి జీవిస్తూ వైరభావం లేకుండా ఆశ్రమం చుట్టూ తిరగడమే కాకుండా, ఆశ్రమ పరిసరాల్లో జీవనం సాగిస్తుండేవి. ఆ జంతువులలో ఒక కుర్కురం (కుక్క) మహర్షి పట్ల భక్తిభావంతో సదా కొలుస్తుండేది. మహర్షి ఎక్కడకు వెళితే అక్కడకు ఆయన వెంబడి కుక్క కూడా వెడుతూ ఉండేది. ఒక్క ముక్కలో ఆయన ఎక్కడ ఉంటే అదీ అక్కడే ఉండేది. కుక్కకు మునితో ఉన్న సాన్నిహిత్యం చూసి భరించలేకపోయింది ఒక పెద్దపులి. ఒకనాడు ఆ కుక్క మీద వైరభావంతో పెద్దపులి కబళించటానికి మీదికి వచ్చేసరికి భయంతో కుక్క పరిగెత్తి వెళ్ళి మహర్షి వెనక దాక్కుంది. భయంతో శరణుకోరి తన వద్దకు వచ్చిన కుక్కను చూసి జాలిపడ్డాడు మునీశ్వరుడు. వెంటనే ఆ కుక్కను బలసంపన్నమైన పెద్దపులిగా మార్చాడు. పులిగా మార్చబడిన కుక్క తనమీదకు వచ్చిన పులితో యుద్ధం చేయబోయింది. దాని భయంకరరూపం చూసి మొదటి పులి పారిపోయింది. ఆ ముని మహత్తు ఎంత గొప్పదో చూడండి'' అన్న సూతునితో 'తరవాత ఏం జరిగింది స్వామీ! మళ్ళీ ఆ పులిగా ఉన్న దానిని, కుక్కగా మార్చాడా ఆ మహర్షి!'' అని అడిగారు మునులు.

> దూరంగా ఉండి కుక్క ఘనతనంతా చూస్తున్న ఒక శరభమృగం వేగంగా వచ్చి ఆ క్రొత్త సింహం మీద పడబోయింది. శరభమృగం ధాటికి విస్మయం చెందిన కుక్క (సింహం) ను చూసి, కుక్కను మహోగ్రరూపం గల శరభంగా మార్చాడు. మహోత్సాహంతో ఈ శరభం ఆ శరభాన్ని వెనక్కి పారిపోయేటట్లు చేసింది.

"తరువాత ఎంత తమాషా జరిగిందో చూడండి'' అంటూ చెప్పసాగాడు సూతమహర్షి.

**"అట్లు బెబ్బులి వచ్చి యడరిన బెబ్బులిగా**
**చేసి గెలిపించె కరుణమెఱయ**
**నొక మత్తకరి చూచి యోటమై నొదిగిన**
**ఉద్ధత కరిఁ జేసి యొసగె జయము**
**సింహంబుదెస భీతిచెడి పాఱుతెంచిన**
**ఘన సింహముగఁజేసి గర్వమిచ్చె**
**శరభంబు ధాటికి చకితమైన నుదగ్ర**
**శరంభంబు జేసి యుత్సాహి చేసె**
**నిట్లు దివసక్రమంబున నెక్కుడైన**
**సత్త్వముగ చేయగా కుక్క శరభభావ**
**మండితంబయి తిరుగుచునుండి పూర్వ**
**వాసనా నీచమగు మనోవర్తనమున"**

**-93 ప – తృతీయాశ్వాసము – శాంతిపర్వము – శ్రీమదాంధ్ర మహాభారతము – తిక్కన**

"ఎప్పుడైతే కుక్క క్రూరమృగమైన పెద్దపులిగా మారి – అసలు పులిని తరిమికొట్టిందో, అది చూసిన ఒక మదపుటేనుగు తాత్కాలిక పులిని వెంటాడింది. అది చూసిన మునిసత్తముడు ఆ పులిని మరింత బలంతో ఎదిరించగల మదపుటేనుగుగా మార్చి దానిని సంతోషింపచేశాడు. మహర్షి వాత్సల్యంతో కుక్క మదపుటేనుగును నిర్జించింది. ఇదంతా గమనించిన సింహం – ఆ ఏనుగు మీదికి చంపటానికి వచ్చేటప్పటికి, ఆ కుక్క (ఏనుగాకారంలో ఉన్నది) భయంతో పారిపోతుంటే ముని మరింత ఉత్సాహంతో ఆ కుక్క (ఏనుగును) మీద పడిన సింహం కన్నా పరాక్రమంతో ప్రకాశించే గొప్ప సింహంగా మార్చేసరికి ఆ కుక్క (ఏనుగు) తన మీదకురికిన సింహాన్ని – ఓడించి పారిపోయేటట్లు చేసి గర్వించింది.

మునులారా! కథ అంతటితో ఆగలేదు'' అన్న సూతుని పలుకులను వింటూ ఆయనను ఆశ్చర్యంగా చూశారు ఇంకా ఏం జరుగుతుందా అని ఆలోచిస్తూ శౌనకాదులు.

"దూరంగా ఉండి కుక్క ఘనతనంతా చూస్తున్న ఒక శరభమృగం వేగంగా వచ్చి ఆ క్రొత్త సింహం మీద

ముందుగా తమను ఆశ్రయించిన వాళ్ళెటువంటివారో చూసి, వారి యోగ్యతను బట్టి వారిని ఉత్తమ స్థాయిలోకి తీసుకొని రావచ్చో, రాకూడదో అన్నది ప్రతివారూ నిర్ణయించుకోవాలి. నీచానికి ఒడిగడితే — అటువంటివారిని ముందున్న విధంగానే ఉంచాలని గ్రహించాలి.

పడబోయింది. శరభమృగం ధాటికి విస్మయం చెందిన కుక్క (సింహం) ను చూసి, కుక్కను మహోగ్రరూపం గల శరభంగా మార్చాడు. మహోత్సాహంతో ఈ శరభం ఆ శరభాన్ని వెనక్కి పారిపోయేటట్లు చేసింది. ఈవిధంగా ఆ మహాతపస్సంపన్నుడు, ఘటనా ఘటన సమర్థుడు అయిన మహర్షి — కుక్కను మహాబలవంతమైన మృగంగా చేసేసరికి ఆ కుక్క శరభమృగంగా అడవి అంతా రాజభావంతో తిరగసాగింది. అయినా, దాని ముందటి స్వభావమైన నీచత్వాన్ని మరచిపోలేదు. అడవిలోని మృగాలన్నింటిలోను పరాక్రమోపేతమైన శరభమృగంగా జీవిస్తున్నా, జాతి లక్షణమైన కుక్కబుద్ధితో ఆలోచించి, ఒక నిర్ణయానికి వచ్చింది.

**"నను గని యొండు సత్త్వము మనంబున బెగ్గిలి పాఱునప్పు డి**
**మ్ముని వరుడిట్ల పోలెఁగృప మొక్కలమై శరభంబుఁగాఁగ చే**
**యునొ తగ దాని నట్లయిన నుద్ధతి నాకుఁ జరింప లేదు గా**
**వున నితనిన్ వధింతు వెరవున్ బలమున్ సరి నుల్ల సిల్లగన్"**

**-95 ప – తృతీయాశ్వాసము – శాంతిపర్వము – శ్రీమదాంధ్ర మహాభారతము – తిక్కన**

"ఇంత బలాఢ్యునైన నన్ను చూసి ఏ జంతువైనా భయపడి పారిపోతుంటే దయగల ఈ ముని నన్ను చేసినట్లే మరే జంతువునైనా మరే జంతువునైనా నాకంటే బలం కల దానినిగా చేయనైనా చేస్తాడు. కాబట్టి ఆయన ఆవిధంగా చేయకుండా ఉండేటట్లు చేయాలంటే ఏదో ఒకటి చేయాలి. నాకన్న బలమున్న జంతువు ఈ అడవిలో ఉంటే నా గర్వం అణగారిపోయినట్లే. నా శక్తీ, పరువూ క్షీణించినట్లే. కనుక నాకన్న మిన్నగా మరొక శరభం ఉండకూడదు. అందుచేత నా బలాన్నీ, ఉపాయాన్నీ కలబోసి ఈ మహర్షిని సంహరిస్తాను. తనకంత ఉపకారం చేశాడని కూడా ఆలోచించకుండా మేలు చేసినవాడికే కీడు తలపోసింది శరభరూపంలో ఉన్న ఆ కుక్క" అని సూతమహర్షి అనటంతో మునులందరూ ఒక్కుమ్మడిగా "అయితే గురుదేవా! మహాత్ముడైన ఆ మహర్షి సత్తముడిని, నీచబుద్ధి గల ఆ కుక్క వెంటనే — శరభం గదా — చంపేసిందా" అని అడగడంతో ఒక చిరునవ్వు నవ్వాడు సూతమహర్షి. "ఇక్కడ మరో వింత జరిగింది. వినండి మరి" అని చెప్పసాగాడు సూతుడు.

**"అను విచారంబు దివ్య బోధాఢ్యుడైన**
**యమ్మునీశ్వరుడెఱిఁగి 'యీయధమజాతి**
**యున్నతస్థితి యెఱుగునే? మున్నపోలె**
**కుక్కయయి యుండుగా! కన్న కుక్క యయ్యె"**

**-96 ప- తృతీయాశ్వాసము – శాంతిపర్వము – శ్రీమదాంధ్ర మహాభారతము – తిక్కన**

కుక్క తనకు తాను చాలా తెలివిగలదాన ననుకొంది. అందుకే మునిని చంపి, తాను అడవిలో అన్నిటికన్నా ఎక్కువ బలంతో ఉండే మృగంగా శాశ్వతంగా సంచరించగలుగుతానని భావించింది. కాని మహర్షి దివ్యదృష్టి గలవాడు. తపోబల సంపన్నుడు. కుక్క తాను చేసిన పనికిరాని ఆలోచన, తన ప్రాణానికే ముప్పు కలిగించే అని తెలుసుకోక గర్వించినందుకు తగిన ఫలమనుభవించింది. మహర్షి దివ్యదృష్టితో — కుక్క చెడు మనసును తెలుసుకున్నాడు. బుద్ధిలేని, నీచస్వభావం కల కుక్క ఉన్నత స్వభావం గల వారిలా ఆలోచించగలుగుతుందా? సత్ప్రవర్తనతో మెలుగుతుందా? అసంభవం కనుక ఇది మొదటి రూపమైన కుక్క రూపాన్నే పొందుగాక!" అని మునీంద్రుడు పలకడంతో — శరభంగా ఉన్న కుక్క మునుపటి రూపమైన కుక్క రూపాన్ని పొందింది" అని సూత మహర్షి చెప్పడంతో అందరూ ఆనందంతో కరతాళ ధ్వనులు చేశారు.

"నమ్మినవారు, మేలుపొందినవారు, ఆధారపడినవారు కూడా స్వార్థానికి లోబడి ఆశ్రయమిచ్చినవారినే హతమార్చగలరని, అటువంటి వారితో జాగ్రత్తగా మెలగాలని, అర్హత లేనివారికి ఆశ్రయమివ్వరాదని, ఆశ్రయమిచ్చినా అధికులుగా చేయరాదని తెలుసుకోవాలి గదండీ. విశ్వాసానికి మారుపేరయిన కుక్కే నమ్మకద్రోహం చేసింది. కేవలం ద్రోహమే కాదు — చంపడానికే తలపడింది. మనతోనే నమ్మకంగా ఉంటూనే వెనుక గోతులు తవ్వేవారు, మనలోనే మసలుతూ మనకే ద్రోహం చేసేవారు ఉంటారని మానవులందరూ గ్రహించాలని ఈ కథ తెలుపుతోంది గదండీ" అని మునులందరూ తమ అభిప్రాయాలను చెప్పారు.

"అవును నాయనలారా! ముందుగా తమను ఆశ్రయించిన వాళ్ళెటువంటివారో చూసి, వారి యోగ్యతను బట్టి వారిని ఉత్తమ స్థాయిలోకి తీసుకొని రావచ్చో, రాకూడదో అన్నది ప్రతివారూ నిర్ణయించుకోవాలి. నీచానికి ఒడిగడితే — అటువంటివారిని ముందున్న విధంగానే ఉంచాలని గ్రహించాలి" అని చెబుతూ సూతమహర్షి ఆసనం మీదనుండి లేచాడు. ఇక ఆశ్రమానికి వెళదామంటూ మునులందరూ గురువుగారిని అనుసరిస్తూ అడుగులు వేశారు.

**(సశేషం)**

**సకల విద్యాస్వరూపిణి, సకల వాఙ్మయానికీ మూల కారకురాలు, భాష, లిపి, కళలకు అధిదేవత సరస్వతీమాత. పలుకుతేనెల బంగరు తల్లి వేదాలకు జనయిత్రి. వీణాపుస్తక ధారిణి అయిన ఆ తల్లి దయ ఉంటే వెర్రిబాగులవాడు వేదవేదాంగ పారంగతుడు అవుతాడు. మూర్ఖుడు మహావిద్వాంసుడుగా మారిపోతాడు. ఆమెను తృణీకరిస్తే మహాపండితుడు కూడా వివేక శూన్యునిగా మారి సర్వం పోగొట్టుకుంటాడు. అందుకే ఆ చల్లనితల్లి కరుణ అందరికీ అవసరం. ఎవరైనా సరే తమకు గాని, తమ హితులు, సన్నిహితులు, పుత్రులు, బంధుమిత్రులకు పాండిత్యం లభించాలన్నా, కోరిన కోరికలు నెరవేరాలన్నా, ఉన్నతవిద్యాప్రాప్తి, ఉన్నతోద్యోగం, పదోన్నతి లభించాలన్నా ఈ క్రిందివిధంగా వ్రతాచరణ చేసి సత్ఫలితాలు పొందవచ్చు. ఈ వ్రతానికి మాఘమాసం లేదా శ్రావణమాసం శ్రేష్ఠమైనవి.**



# శ్రీపంచమి

**- డా|| మరుదాడు అహల్యాదేవి**

**వ్రతాచరణ:** వసంతపంచమి లేదా ఏదైనా శుక్లపక్ష పంచమి లేదా పూర్ణిమ తిథిన ఉదయంపూట స్నానాదికాలు ముగించుకుని శుచి అయి, గణపతిని పూజించి, కలశంలో దేవిని ఆవాహన చేయాలి. విద్యాదాయిని సరస్వతీదేవి ప్రతిమ లేదా చిత్రపటానికి తెల్లనిపూలు, అక్షతలు, మంచిగంధం, తెల్లని నగలు అలంకరించి షోడశోపచారాలతో పూజించి, పాయసం నివేదించాలి. పూజానంతరం ఆ పాయసాన్ని ప్రసాదంగా భుజించి అందరికీ పంచిపెట్టాలి. ఈవిధంగా ఐదు వారాలు చేయాలి. ఆఖరివారం నాడు ఐదుగురు బాలలను అమ్మవారి ప్రతిరూపాలుగా భావించి, నూతన వస్త్రాలు కట్టబెట్టి, పలకా బలపాలు లేదా పుస్తకం, కలం ఇచ్చి సంవత్సరం పాటు వారి చదువుకు అయ్యే ఖర్చును భరించాలి.

సరస్వతీదేవికి తెలుపురంగు ప్రీతికరం కాబట్టి ఆమెను తెల్లనిపూలు, తెల్లని పట్టువస్త్రంతో అలంకరించి, పెరుగు, వెన్న, వరిపేలాలు, తెల్లనువ్వులతో చేసిన లడ్డు, చెరుకురసం, బెల్లం, తేనె, పాలకోవా, చక్కెర, కొబ్బరికాయ, రేగుపళ్ళు వంటి వాటిని నివేదిస్తే సరస్వతీదేవి ప్రసన్నురాలై కోరిన కోరికలు తీరుస్తుందని శాస్త్రోక్తి. ఈ ఆధునిక యుగంలో సమస్తానికీ మూలకారణం విద్య ఒక్కటే. చక్కటి విద్య కారణంగానే పిల్లలు సభ్య మానవులై, మంచి జీవితాన్ని గడపగలుగుతారు. భాషాజ్ఞానం, వాక్పటుత్వం, వాక్చాతుర్యం ద్వారానే వారు ఇతరులపై తమదైన ముద్ర వేయగలుగుతారు. పవిత్రంగా మనస్ఫూర్తిగా నిర్మలమైన మనస్సుతో అమ్మను ఆరాధిస్తే చాలు ఆ చదువుల తల్లి ప్రసన్నమై కోరిన విద్యలను ప్రసాదిస్తుంది.

సరస్వతీదేవి ఆవిర్భవించిన మాఘశుద్ధ పంచమి రోజున పుస్తకాది రూపాలలో విగ్రహంలో ఆవాహన చేసి పూజిస్తే మంచిది. విశేష అర్చన, పూజ, వ్రతోత్సవాలు చేస్తే ఆమె అనుగ్రహం కలుగుతుంది.

# శుభప్రదాయిని రథసప్తమి

– చిల్లర సీతారామారావు

సర్వ దేవకుడు, అధిక తేజోవంతుడు, తన కిరణముల చేత లోకములను కాపాడుచున్నవాడు, నక్షత్రముల సముదాయమునకు అధిపతి, పగటికి అధిపతి, పుటము వేయబడిన బంగారము యొక్క కాంతి వంటి కాంతి గలవాడు, కర్మసాక్షి అయిన సూర్యభగవానుని అర్చించు నిమిత్తము ఏర్పడిన శుభపర్వము రథసప్తమి పర్వము. సూర్యభగవానుడు రథముపై పయనము గావిస్తూ దక్షిణాయనము నుండి ఉత్తరాయణమునకు మాఘశుద్ధ సప్తమి నాటికి చేరుకుంటాడు. ఆ శుభ సందర్భమును పురస్కరించుకుని మాఘశుద్ధ సప్తమి నాడు రథసప్తమి పర్వమును జరుపుకోవడం వేదకాలము నుండి వస్తున్నది.

ఉపాసనా మార్గములు ఆరు. అందులో సూర్యోపాసన ఒకటి. 'ఆరోగ్యం భాస్కరాధిచ్ఛేత్' అనగా ఆరోగ్యం కోసం సూర్యభగవానుడిని ఉపాసించాలి. మయూరుడు అను ఒక సంస్కృత కవి దీర్ఘవ్యాధితో బాధపడుతూ సూర్యుడి పేరుమీద మయూర శతకం రచించాడు. సూర్యభగవానుడి అనుగ్రహముతో రోగ విముక్తుడయ్యాడు. శ్రీకృష్ణుడి తనయుడు సాంబుడు. అతడికి మిక్కిలి అహంకారము. ఆ అహంకారముతో దూర్వాసుడిని అవమానించగా ఆయన కుపితుడై కుష్టువ్యాధిన పడమని శాపమిస్తాడు. శాపవిమోచన కోసం పరితపిస్తుండగా, శ్రీకృష్ణుడు సూర్యుడిని ఆరాధిస్తే శాపవిమోచనం కలుగుతుందని సాంబుడికి సలహా ఇస్తాడు. శ్రీకృష్ణుడి సలహానుసరించి సాంబుడు సూర్యభగవానుడిని భక్తి శ్రద్ధలతో ఆరాధిస్తాడు. సూర్యభగవానుడి అనుగ్రహంతో రోగ విముక్తుడవుతాడు. తన కిరణాల ద్వారా సమస్త ఆరోగ్యాన్ని ప్రసాదించే సూర్యభగవానుని రథసప్తమి నాడు భక్తిశ్రద్ధలతో ఆరాధిస్తారు.

రథసప్తమి నాడు వేకువ జామునే లేచి దంతధావనాది క్రియలు ముగించుకోవాలి. స్నానమాచరించే సమయంలో ఈ క్రింది మంత్రమును పఠిస్తూ స్నానము చేయాలి.

**శ్లో ॥ "యద్యజ్జన్మ కృతం పాపం మయా జన్మ సప్త మ**
**తన్మే రోగంచ శోకంచ మాకరీహంతు సప్తమీ"**

ఆ విధముగా మంత్రమును పఠిస్తూ స్నానము చేసినట్లయితే ఏడు జన్మాంతరాలలో ఏడు విధాలుగా ఆర్జించిన సమస్త పాపములన్నీ నశించిపోతాయి. స్నానము చేయునప్పుడు ఏడు జిల్లేడు ఆకులను గాని, రేగి ఆకులను గాని, రెండు రకాల ఆకులను గాని శిరస్సుపై పెట్టుకొనాలని భవిష్యోత్తర పురాణము తెలియజేయుచున్నది. జిల్లేడు ఆకులను తలపై నిడుకొని స్నానము ద్వారా వాటిని జారవిడువటం వలన కామ క్రోధాది గుణములు వదిలిపోతాయని, రేగు ఆకులను, రేగు పళ్ళను స్నానము ద్వారా వాటిని జారవిడవటం వలన సమస్త పీడలు



వదిలిపోతాయని శాస్త్రోక్తి. స్నానానంతరం సూర్యభగవానునికి అర్ఘ్యమును ఇవ్వాలి. అర్ఘ్యము అంటే ఏమిటో ఈ క్రింది శ్లోకము ద్వారా తెలియుచున్నది.

**శ్లో ॥ "అఖిలాఘ ప్రశమనాత్ ధనపుత్ర వివర్ధనాత్**
**అనర్ఘ ఫల దానాచ్చ అర్ఘ్యమిత్యభి ధీయతే"**

సర్వ పాపములను పోగొట్టునది, ధన, సంతాన వృద్ధిని చేయునది, అమూల్యమైన ఫలములను అందజేయు దానిని అర్ఘ్యము అని అంటారు. అర్ఘ్యములు ఎనిమిది రకములు. వీటిని అష్టాంగార్ఘ్యములు అంటారు.

**శ్లో ॥ "సప్త సప్తి వహ ప్రీత సప్తలోక ప్రదీపన**
**సప్తమీసహితో దేవ గృహాణార్ఘ్యం దివాకర"**

అర్ఘ్యము సమర్పించిన తరువాత సూర్య భగవానునకు నైవేద్యమును సమర్పించాలి. ధనుర్మాసమున గోమయముతో చేసిన పిడకల దాలి మీద ఆవుపాలతో పొంగలిని చేసి నైవేద్యము పెట్టాలి. (దాలి అనగా పాలు మున్నగు వాటిని కాచుటకు నిప్పు చేర్చిన పిడకల ప్రోగు). చిక్కుడు కాయలతో చేసిన రథమును చేసి, వెదురు పుల్లలతో దానిమీద చిక్కుడు ఆకులు పరచి నైవేద్యమును సమర్పించాలి. చిక్కుడు కాయలతో చేసిన రథమును సూర్య రథము అని పిలుస్తారు. నైవేద్యము

పెట్టడానికి వేడి పొంగలి చిక్కుడు ఆకు మీద వేసి చల్లార్చడం చేత ఆకులో ఉండే పసరు, ఆర్ద్రత పొంగలికి ఎక్కి ఒక విధమైన రసాయనిక మార్పు వస్తుంది. ఆ పదార్థ సేవనం ఆరోగ్య వర్ధకం అవుతుంది. తిలలతోను, పిండితోను చేసిన అపూపములచే సూర్యభగవానుడిని పూజించి బ్రాహ్మణాదులకు దానమివ్వాలి. శక్త్యానుసారం రాగి లేదా మట్టిపాత్ర యందు నెయ్యి, బెల్లములతో కూడిన తిలపిష్టములనుంచాలి. ఆ పాత్రయందు బంగారు కర్ణాభరణమునుంచాలి. శక్తి లేనిచో తిల పిష్టముతో చేసిన కర్ణాభరణమును ఉంచాలి. ఆ పాత్రను ఎర్రని వస్త్రముతో కప్పి, చందన పుష్పాదులతో, ధూపముతో పూజించాలి.

**శ్లో ॥ "ఆదిత్యస్య ప్రసాదేన ప్రాతః స్నానఫలేనచ**
**దుష్ట దౌర్భాగ్య దుఃఖఘ్నం మయాదత్తంతు తాలకమ్"**

అను మంత్రమును పఠిస్తూ సద్బ్రాహ్మణునకు పూజించిన పాత్రను దానముగా ఇవ్వాలి.

మాఘ శుద్ధ సప్తమి నాడు 'రథసప్తమి' అను వ్రతమును ఆచరిస్తారు. ఈ వ్రతమునకు సంబంధించిన ఒక కథ భవిష్యత్పురాణము నందు వివరించబడింది. ఈ కథను శ్రీకృష్ణుడు ధర్మరాజుకు వివరించాడు.

పూర్వము కాంభోజము అనే నగరాన్ని పరిపాలించే యశోవర్తనుడు అనే రాజు ప్రజానురంజకముగా పరిపాలించెడివాడు. అతడికి చాలాకాలము వరకు సంతానము కలగలేదు. అదృష్టవశాత్తు ముదిమి వయసులో అతనికి సంతానము కలిగింది. సంతానము కలిగిందన్న ఆనందమును అతడు ఏనాడూ అనుభవించలేదు. దానికి కారణం తనయుడు సతతం రోగముల చేత పీడింపబడుతూ దుఃఖముతో విలవిలలాడుతూ ఉండటమే. ఒకసారి త్రికాల పండితులు రాజుగారి దర్శనము కొరకు వచ్చారు. వారికి ఆతిథ్యమొసగిన తరువాత వారిని ఇలా ప్రశ్నించాడు. మహానుభావులారా! నా కొడుకు అనారోగ్యముతో బాధలనుభవిస్తున్నాడు. దానికి కారణం తెలియజేయవలసిందిగా ప్రార్థిస్తున్నాను. త్రికాల పండితులు రాజుగారి ప్రశ్నకు సమాధానమిస్తూ ఇలా అన్నారు.

రాజా! నీ తనయుడు పూర్వజన్మముల పాపఫలితమును అనుభవిస్తున్నాడు. అతడు పూర్వజన్మలో ఒక వైశ్యుడు. పరమ లోభి. దానధర్మములు ఏనాడూ చేసినవాడు కాదు. అదృష్టవశాత్తు అవసాన సమీప దశలో ఎవరో ఆచరిస్తున్న 'రథసప్తమి' వ్రతమును చూశాడు. తత్ఫలితముగా అతడు ఈ జన్మలో నీ కుమారుడుగా జన్మించాడు. లోభత్వ కారణముగా ఈ జన్మలో అనారోగ్యముతో బాధలనుభవిస్తున్నాడు. త్రికాల పండితుల సమాధానమును విని రాజుగారు దీనముగా వారిని వేడుకున్నాడు. మహాత్ములారా! మీరు త్రికాలవేదులు. మీకు సర్వమూ విదితమే. దయచేసి నా కుమారుడు అనారోగ్యము నుండి విముక్తుడవడానికి ఏమి చేయాలో తెలియజేయండి. మీరు చెప్పినట్లు నేను ఆచరిస్తాను అన్నాడు. అప్పుడు త్రికాల పండితులు ఇలా అన్నారు. నీ తనయుడు ఆరోగ్యవంతుడు కావాలంటే ఒక్కటే మార్గమున్నది. నీ కుమారుడి చేత రథసప్తమి వ్రతమును ఆచరింపచేయాలి. దానివలన సూర్యభగవానుడు సంతృప్తి చెందుతాడు. ఆయన అనుగ్రహముతో నీ కుమారుడు రోగమునుండి విముక్తుడై స్వస్థతను పొందుతాడు. ఇప్పుడు రథసప్తమి వ్రతమును ఎలా ఆచరించాలో చెబుతాము విను. మాఘశుద్ధ షష్ఠి నాడు ఏకభుక్తము ఉండాలి. సప్తమినాడు వేకువజాముననే లేవాలి. తలమీద దీపపు ప్రమిదను ఉంచుకుని నదీతీరమునకు వెళ్ళాలి. ఒక చెరుకుగడతో నిశ్చలముగా ఉన్న నీటిని కదిలించి దీపాన్ని జలమునందు విడవాలి. తలమీద జిల్లేడు ఆకులు, రేగుపండ్లు పెట్టుకుని స్నానము చేయాలి. పిదప సూర్యమందిరమునకు వెళ్ళి పూజలు చేయాలి. బ్రాహ్మణులకు దానధర్మములు చేయాలి. భక్తి శ్రద్ధలతో వ్రతమును ఆచరించాలి అన్నారు. త్రికాల పండితులు చెప్పిన విధముగా తనయుడి చేత రథసప్తమి వ్రతమును చేయించాడు రాజు. తత్ఫలితముగా రాజకుమారుడు సంపూర్ణ ఆరోగ్యవంతుడయ్యాడు. స్త్రీలు 'రథసప్తమి నోము'' అను పేరుతో నోమును ఆచరిస్తారు. రథసప్తమి నాడు స్త్రీలు వేకువజాముననే లేచి స్నానాదికములు పూర్తి గావించుకుంటారు. సూర్యదేవాలయమునకు వెళ్ళి సూర్యుని దర్శించుకొని –

**శ్లో ॥ "ప్రాతర్నమామి తరణిం తనువాన్మనోభిః**
**బ్రహ్మేంద్ర పూర్వక సురైర్నుతమర్చితంచ**
**దృష్టి ప్రమోదన వినిగ్రహ హేతుభూతమ్**
**త్రైలోక్య పాలనపరం త్రిగుణాత్మకంచ"**

''బ్రహ్మేంద్రాదులచే నుతులు, అర్చనలు పొందువాడు, అతివృష్టి, అనావృష్టులకు కారణమైనవాడు, సత్త్వరజస్తమో గుణాత్మకుడు, ముల్లోకములకు వెలుగు నొసగి పాలించువాడునగు సూర్యదేవుని గురించి ప్రాతఃకాలమున త్రికరణశుద్ధిగా నమస్కరిస్తున్నాను'' అని ప్రార్థిస్తారు. పన్నెండు మంది ముత్తయిదువలను పిలిచి పంచభక్ష్య పరమాన్నములతో భోజనం పెట్టాలి. వాయనములు ఇవ్వాలి. భక్తి శ్రద్ధలతో నోము నోచినవారికి దీర్ఘాయువు ప్రాప్తిస్తుంది. సంపదలు రెట్టింపు అవుతాయి. కలకాలం సుమంగళిగా జీవిస్తారు. సత్సంతానము కలుగుతుంది. రోగములనుండి ఉపశమనము కలుగుతుంది.

**శ్లో ॥ "యః కర్తా జగతాం భర్తా సంహర్తా మహసాం నిధిః**
**ప్రణమామి తమాదిత్యం బహిరంత స్తమోపహమ్"**

లోకములకు కర్త, ప్రభువు, సంహారకుడు, శాంతులకు నిధి, వెలుపలి లోపలి చీకట్లను బాపువాడునగు సూర్యభగవానునకు ప్రణామము.

**"ఆదిత్యం జగదీశమచ్యుతమజం త్రైలోక్య చూడామణిం**
**భక్తాఽభీష్ట వరప్రదం దినమణిం మార్తాణ్డ మాద్యం శుభమ్"**

# శ్రీ వేంకటేశ సహస్ర నామావళి

సేకరణ : కె.వి.రాఘవాచార్యులు

## 293. అభీర దృష్ట దౌర్జన్యాయ నమః

గొల్లవారిచే చూపబడిన చిలిపితనము గలవాడు కృష్ణుడు.

గొల్లవారు చూచినట్టి దౌర్జన్యము చేసినవాడగు శ్రీకృష్ణునిగ జన్మించిన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

## 294. నీల పద్మనిభాననాయ నమః

నల్లని పద్మమునకు (నల్ల కలువకు) సమానమైన ముఖము కలవాడు కృష్ణుడు.

నీల పద్మముతో సమానమైన ముఖము గల్గిన కృష్ణునిగ జన్మించిన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

## 295. మాతృదర్శిత విశ్వాఽఽస్యాయ నమః

తల్లియగు యశోదకు తన నోట విశ్వమునంతటినీ చూపించినవాడు కృష్ణుడు.

ఒకనాడు బలభద్ర ప్రముఖులైన గోపకుమారులు కృష్ణుడు మన్ను దినెనని చెప్పినంత యశోద మన్నేటికి భక్షించెను అన్నా మన్నేల మరి పదార్థము లేదే? అని అడిగిన తల్లికి నెఱదంట యైన కొడుకు కృష్ణుడు

**"అమ్మా! మన్నుదినంగ నే శిశువనో యాకొంటినో వెర్రినో**
**నమ్మం జూడకు వీరి మాటలు మది న్నన్నీవు కొట్టంగ వీ**
**రి మ్మార్గమ్ము ఘటించి చెప్పెదరు కాదేనిన్ మదీయాస్య గొం**
**ధమ్మాఘ్రాణము సేసి నా వచనముల్ దప్పైన దండింపవే ||** భాగ. 10 – పూర్వ – 337

అని పలికి నెయ్యంబున తల్లి నియ్య కొలిపి, క్రీడా మనుజ బాలకుండైన విష్ణువు తన నోరు దెరచి ముఖంబు చూపిన

**కం || ఆ లలితాంగి కనుం గొనె**
**బాలుని ముఖమందు జలధి పర్వత వన భూ**
**గోళ శిఖి తరణి శశి ది**
**క్పాలాది కరండమైన బ్రహ్మాండంబున్ ||** భాగ. 10 – పూర్వ- 339

యశోద కృష్ణుని నోట బ్రహ్మాండమును చూచి కలయో వైష్ణవ మాయయో అని దిగ్భ్రాంతి చెందింది.


తల్లి యశోదకు తన నోట బ్రహ్మాండమును చూపించిన కృష్ణునిగ జన్మించిన విష్ణుదేవుని అర్చామూర్తియగు వేంకటేశునకు నమస్కారము.

## 296. ఉలూఖల నిబంధనాయ నమః

తల్లి యశోదచే రోటికి కట్టబడినవాడు కృష్ణుడు. యశోద బాలకృష్ణుని చిలిపి చేష్టలకు, వెన్న దొంగిలించి భక్షించుటను సహింపలేక

"లాలన యున్న బహు దోషము.... బాలురకును తాడనంబ పథ్యంబరయన్" (10–365) అని నిశ్చయించుకొని ఒకనాడు వెన్నదొంగ కృష్ణుని "పట్టుకొనన్ నాకు గాక పరులకు వశమే" (10–373) అని తలంచి కృష్ణుని పట్టుకొని ఒక రోలుకు కట్టివేయ సమకట్టింది.

**వినా వేంకటేశం న నాథో న నాథః**
**సదా వేంకటేశం స్మరామి స్మరామి**





**అన్ని నామాలూ నీవే అయిన**
**ఓ వేంకటేశా! నీకు నమస్కారము**

**కం ||ఆ లలన గట్టె రోలన్**
**లీలన్ నవనీత చౌర్య లీలుం బ్రియ వా**
**గ్జాలున్ బరి విస్మిత గో**
**పాలున్ ముక్తా లలామ ఫాలున్ బాలున్ ||** భాగ, 10 – పూర్వ – 377

తల్లి యశోదచే రోటికి కట్టబడిన కృష్ణుడు భక్త పరతంత్రుడై విలసిల్లినాడు. నాటినుండి కృష్ణుడు దామోదరుడు అను పేరుతో పిలువబడినాడు.

తల్లిచే రోటికి కట్టబడిన కృష్ణునిగా జన్మించిన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

## 297. నలకూబర శాపాంతాయ నమః

– నలకూబర మణిగ్రీవులకు శాపాంతము కలిగించిన కృష్ణునకు నమస్కారము.

నలకూబర మణిగ్రీవులు కుబేరుని పుత్రులు. వివస్త్రలై స్నానము చేయుచుండిన వారిని చూచి నారదుడు కోపించి వారిని మద్దిచెట్లు కండు అని శపించినాడు. వారు మద్దిచెట్లుగా మారి నందుని ఇంటి ఆవరణలో ఉన్నారు. కృష్ణుడు యశోద తనను కట్టివేసిన రోటిని ఆ మద్దిచెట్ల మధ్యకు లాగుకుంటూ వాటి మధ్యకు రాగా ఆ మద్దిచెట్లు పెల్లగిల్లి పడినందున నలకూబర మణిగ్రీవులకు శాపవిముక్తి కలిగించినాడు. వారు కృష్ణునికి నమస్కరించి, స్తుతించి స్వస్థానమునకు వెళ్ళినారు.

నలకూబర మణిగ్రీవులకు నారదుని శాపము నుండి విమోచన కలిగించిన కృష్ణునిగా జన్మించిన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

ఈ ఘట్టమును పోతన భాగవతములో రమణీయముగా వర్ణించినాడు.

**కం || బాలుడు రోలడ్డము దివ**
**మూలంబులు పెకలి విటపములు విరిగి మహా**
**లీలధ్వని గూలెను శా**
**పాలస్య వివర్జనములు యమళార్జునముల్ ||** భాగ. 10 – పూర్వ – 400

బాలుడగు కృష్ణుడు రోలు అడ్డముగా మద్దిచెట్ల మధ్యకు లాగగా మూలములు పెకలి ఆ మద్దిచెట్లు పెద్ద ధ్వని చేయుచు నేల కూలినవి. ఆ రెండు మద్దిచెట్లు శాపము వదిలించుకొన్నవి. ఆ చెట్లు నలకూబర మణిగ్రీవులుగా మారి భక్త లోక పాలకుడైన కృష్ణునకు మ్రొక్కి లేచి నమస్కరించి ఇట్లు స్తుతించారు.

**కం || బాలుడవె నీవు పరుడవ**
**నాలంబుడ వధిక యోగి వాద్యుడవు తను**
**స్థూలా కృతి యగు విశ్వము**
**నీలీలా రూపమండ్రు నిపుణులు కృష్ణా! || - 402**

కృష్ణా! నీవు బాలుడవె. నీవు పరమాత్ముడవు. అవలంబుడవు. గొప్పయోగివి. పురాతనుడవు. స్థూలా కృతిలో నున్న ఈ విశ్వమంతయు నీ రూపమే అని విద్వాంసులు చెప్పుచున్నారు అని కీర్తించిన నలకూబర మణిగ్రీవుల చూచి రోటితో కట్టబడియున్న కృష్ణుడు నారదుని శాపము చేత నన్ను చూడగలిగినారు. నాపై మీకు స్థిరముగా వుంటుంది. మీ స్వస్థానములకు పోయి సుఖముగ నుండుడని చెప్పినాడు. వారు కృష్ణుని వద్ద సెలవు గైకొని వెళ్ళినారు.

ధారావాహికం



# రామాయణ రత్నాకరం

– రాళ్ళబండి శ్రీనివాసన్

**గత సంచిక తరువాయి**

“రామా నేను ధర్మాన్ని అతిక్రమించాను. అయినా నన్ను క్షమించానని ఒక్కమాట చెప్పు. నన్ను రక్షించు. నేను చనిపోతున్నాను. నాకు దుఃఖం లేదు. నా భార్య, నా బంధువుల చింత లేదు నాకు. నా కొడుకు అంగదుడు. వాడు బుద్ధిమంతుడు. గుణంతుడు. వానికి అంగదాలు (భుజకీర్తులు) ఇష్టం. అందుకు బంగారు అంగదములు చేయించాను. అల్లారు ముద్దుగా పెంచాను. నేను లోకపోతే – నీరు ఇంకిన చెరువులా ఎండిపోతాడు. వాడు మహాబలవంతుడు. వాడంటే నాకు ఇష్టం. పసివాడు. రామా! వాణ్ణి కాపాడు. వాడు నీవాడు అనుకో. సుగ్రీవునిలా చూసుకో. నీకు భరతుడెంతో, లక్ష్మణుడెంతో అంగదుడూ అంతే అనుకో. నా భార్య తార. సుగ్రీవుని పట్ల తప్పులు చేసింది. ఆమెను సుగ్రీవుడు అవమానించరాదు. సుగ్రీవుడు నీ అధీనంలో ఉన్నాడు. నీవు చెప్పినట్లు నడుస్తాడు. రాజ్యాన్ని పాలిస్తాడు.

రామా! నీ మహిమ చెప్పింది తార. యుద్ధానికి పోవద్దని చెప్పింది. నీతో మరణం పొందాలి. అదొక భాగ్యంగా భావించాను. వచ్చాను. తమ్మునితో యుద్ధం చేశాను” ఆగిపోయాడు వాలి. రాముణ్ణే చూస్తున్నాడు.

విన్నాడు రాముడు. జ్ఞానోదయమైన వాలిని చూశాడు. మృదు వచనాలు పలికాడు. అవి ధర్మ సమ్మతాలు. ఊరడింపు మాటలు. “వానరా! నీ భార్య కోసం, కొడుకు కోసం విచారపడకు. చింతించకు. నీ శిక్ష పట్ల ఆలోచించకు. మా ధర్మం స్థిరం. నీకు పాపము అంటదు. నీవు పాప రహితుడవు. నీవు ఇపుడు ధర్మిష్ఠుడవు. వానరోత్తమా! శోకం మోహం భయం వదిలిపెట్టు. చిత్రమైంది విధి. దాన్ని దాటలేం. అంగదుని గూర్చి దిగులుపడకు. సుగ్రీవుడు, నేను అంగదుణ్ణి ప్రేమతో చూస్తాం’.

రాముని మాటలు విన్నాడు. బాణపు దెబ్బ తీవ్రతరమైంది. ఏమీ మాట్లాడలేకపోయాడు. క్రమంగా స్పృహ కోల్పోయాడు.

సుగ్రీవుడు వాలి భార్యని అనుభవిస్తాడు. అది దోషం కాదా అని ప్రశ్న. వానరజాతిలో కొన్ని నియమాలున్నాయి. భర్త బతికి వుండగా అతని భార్యని రమించరాదు. ఇపుడు వాలి లేదు. పోయాడు. సుగ్రీవుడు తారతో కూడినా దోషం కాదు.

రాముడు బాణం వేశాడు. వాలి నేలకూలాడు. వార్త కిష్కింధ చేరింది. అంతఃపురంలోని తారకి తెల్సింది. వినింది విషాద వార్త. భయభ్రాంత అయింది. అంగదుణ్ణి రమ్మంది. గబగబా నడిచింది. అనుసరించాడు అంగదుడామెని.

వాలి కిందపడ్డాడు. మహాపరాక్రమశాలి, బలశాలి అయిన రాముణ్ణి చూశారు. భయపడ్డారు వానరులు. వెనక్కి తిరిగారు. పరుగులు తీశారు. పట్టణం వైపు వస్తున్నారు వానరులు. తారకు ఎదురుపడ్డారు. చూసింది వాళ్ళని. అంటోంది "వాలి చనిపోయాడా? ఎందుకు వదిలిపెట్టారు? ఎందుకు ఇలా పరిగెడుతున్నారు?" ఆమె గొంతులో ఆత్రుత.

అంటున్నారు వానరులు. "దేవీ! వాలి రాళ్ళు విసిరాడు. చెట్లు విసిరాడు. అన్నింటినీ అడ్డుకున్నాడు రాముడు. అతని బాణాలు అమోఘం. రామబాణానికి కింద పడ్డాడు. మన బలగాలన్నీ చెల్లాచెదరైనాయి. నీ కొడుకు అంగదుని కాపాడుకో. అతణ్ణి పట్టాభిషిక్తుణ్ణి చేయాలి. కోట తలుపులు మూసివేయాలి. అమ్మా! అలా చేయకపోతే వానరులు పారిపోతారు".

వినింది తార. "వానరోత్తముడు వాలి. మహాత్ముడు వాలి. నా భర్త పోయాడు. ఇక కొడుకుతో ఏం పని? రాజ్యంతో ఏం పని? నా స్వామి పాదాలే పట్టుకుంటాను. నేనూ పోతాను వాలితో".

ఏడ్చింది తార. రెండు చేతులెత్తింది. నెత్తి బాదుకుంది. గుండెలు బాదుకుంది. వాలి వైపు పరుగులు తీసింది. చూసింది భర్తని. చచ్చిన సింహంలా ఉన్నాడు వాలి. వెలసిన మేఘంలా ఉన్నాడు వాలి. ధనుస్సు ఊతగా నిల్చున్నాడు రాముడు. పక్కన లక్ష్మణుడున్నాడు. ఆ పక్కన సుగ్రీవుడున్నాడు. చూసింది ముగ్గురినీ.

## తారా విలాపం

వాలిని సమీపించింది తార. అతని దీనస్థితిని చూసింది. శోకతప్త అయింది. కింద పడింది. తేరుకుంది. "ఆర్యపుత్రా" గట్టిగా అరిచింది. ఎలుగెత్తి ఏడ్చింది. వాలి గర్జిస్తాడు. ఎదుటివారు గడగడలాడతారు. మహాపర్వతాల్ని విసరి వేస్తాడు. వాయువులా మహావేగవంతుడు. ఇంద్రునిలా పరాక్రమవంతుడు. గజరాజులా బలిష్ఠుడు. మొదలు నరికిన చెట్టులా పడి వున్నాడు. గట్టిగా కౌగలించుకుంది వాలిని.

"మహావీరా! వానరేంద్రా! నేను దీనురాలిని. నీ పక్కనే ఉన్నాను. నాతో మాట్లాడవా? నన్ను విడిచిపెట్టావు. ఈ కటిక నేలని కౌగలించుకున్నావు. ఈ భూకాంత నాకన్నా ఎక్కువా? స్వర్గానికి పోతున్నావు కదా. అక్కడ అప్సరసల్ని ఆకర్షిస్తావులే. అక్కడ అందమైన నగరం నిర్మించుకున్నావా? అది కిష్కింధను మించిందేనా? అందుకే కిష్కింధను వదిలేస్తున్నావు. నాథా! నీవు పోయావు. నేను బతికే ఉన్నాను. నా గుండె పగిలిపోలేదు. అది పాషాణం కంటే కఠినమైంది.

సుగ్రీవుని వెడలగొట్టావు. రుమని అపహరించావు. దాని ఫలితం ఇదే. ఇలా అనుభవిస్తున్నవావు. నీకోసం నీ మేలుకోసం ఎన్నో చెప్పాను. ఆనాడు నా మాట వినలేదు. పైగా నన్ను నిందించావు. నీవు ఎవరికీ లొంగేవాడివి కాదు యముడే స్వయంగా వచ్చాడు. ఆ కాలపురుషునికి లొంగిపోయావు. సుగ్రీవునికి ఓడిపోయావు. నాథా! నేనెపుడూ దుఃఖాన్ని ఎరుగను. దైన్యాన్ని ఎరుగను. ఇపుడు వైధవ్యం పొందాను. దుఃఖంతో దైన్యంతో బతకాలి".

పక్కనే ఉన్నాడు అంగదుడు. చూసింది వాణ్ణి. 'నాయనా! అంగదా! నీ తండ్రిని చూడు. ఇంకాయన దర్శనం దుర్లభం. నీవు సుగ్రీవుని కోపతాపాలు భరించాలి. ఎంతటి దురవస్థ ఇది. ప్రాణేశ్వరా! ఇదో నీ గారాల బిడ్డ. ఒక్కసారి చూడు. నన్ను నీ కొడుకుని విడిచిపోతున్నావు".

చేసిన ప్రతిజ్ఞ నెరవేర్చాడు రాముడు. ఋణవిముక్తుడైనాడు. సుగ్రీవా! నీ కోరిక తీరింది. నీ అన్న పోయాడు. ఇక రుమతో సుఖించు. రాజ్యభోగాలనుభవించు.

"స్వామీ! ఇదిగో నీ భార్యలు వచ్చారు ఒక్కసారి చూడు" అలా విలపిస్తోంది తార. వానర స్త్రీలు చూశారు. అందరూ దీనులైనారు. అంగదుని పట్టుకున్నారు. దుఃఖార్తులైనారు. అతి దీనంగా ఏడుస్తోంది తార. ప్రాయోపవేశం చేయాలనుకుంది. అదామె నిశ్చయం కూడా. ఆకాశం నుండి ఒక తార జారింది అన్నట్లుందామె.

## హనుమ – ఓదార్పు

తార దుఃఖాన్ని చూశాడు హనుమంతుడు. ఆమె దైన్యాన్ని చూశాడు. మాటలు విన్నాడు. ఊరడిస్తున్నాడామెని. "దేవీ! మనిషి పాపపుణ్యాలు చేస్తాడు. వాటికి ఫలాలుంటాయి. చనిపోయాక మరుజన్మలో – పరలోకంలో ఎక్కడైనా అనుభవించాలి. తప్పదు. శుభాశుభ కర్మలు ఆత్మని అంటి ఉంటాయి. ఏ లోకం పోయినా వెంటాడుతాయి. ఒక్క పరమపదానికి అవి రాలేవు. వాలిని సుగ్రీవుడు చంపించాడా? లేదు. వాలి చేసిన కర్మ – అతణ్ణి చంపింది. అయితే కర్మ అచేతనం. సుగ్రీవుడు నిమిత్తమాత్రుడు. అమ్మా! ఏడవకు. ఈ శరీరం నీటిబుడగ. అస్థిరం. ఎపుడు పగులుతుందో తెలియదు. ఏ జీవుని కోసం శోకించరాదు. నీకు అన్నీ తెలుసుకదమ్మా. సత్యం తెలుసుకో. ఈ విలాపం మాను. పుణ్యకార్యాలు ఆచరించు. పరలోక సుఖాలు పొందు. అదే తగింది.

అమ్మా! వానరసేన అపారం. కోట్లాది సంఖ్యలో ఉన్నారు. వాలిమీద ఆశలు పెట్టుకున్నారు. అతడు న్యాయంగా రాజ్యపాలన చేశాడు. సర్వజనుల దుఃఖాల్ని పోగొట్టాడు. అందరికీ సుఖాలందించాడు. ఎన్నో ప్రయోజనాలు చేకూర్చాడు. వాళ్ళు తప్పు చేస్తే క్షమించాడు. అంతటివాడు వాలి. అతని

కోసం దుఃఖించకు. పోయినవాళ్ళు తిరిగిరారు. ఉన్నవాళ్ళని కాపాడుకోవాలి. అది మన కర్తవ్యం.

వానర భల్లూకాలకు నీవే రక్షకురాలివి. వానర రాజ్యం నిన్నే నమ్మింది. అంగదుడు పసివాడు. వాడి బాగోగులు – ఆ బాధ్యత నీదే. వాడు నీ రక్షణలో ఉంటాడు. వానర రాజ్యాన్ని పాలిస్తాడు. ఇపుడేం చేయాలో ఆలోచించు. తల్లితండ్రులకు సద్గతి కల్గించాలి. అది సంతానం బాధ్యత. కనుక వాలి ఉత్తరక్రియల్ని ఆచరించాలి. అవి అంగదునితో చేయించు. ప్రేత కార్యాలు ముగిశాక – అంగదుని రాజ్యాభిషిక్తుణ్ణి కావించు. వాడు సింహాసనం అధిష్ఠిస్తాడు. నువ్వు చూస్తావు. నీ మనసుకి అది ఊరట. శాంతి లభిస్తుంది.

విన్నది తార. కాస్త ఊరట చెందింది. అంటోంది 'మారుతీ! అంగదుని లాంటివారు నూర్గురు కొడుకులున్నా – నాకు ప్రయోజనం లేదు. వానరరాజు నా స్వామి గాఢాలింగనాన్ని మించినది లేదు. అంతకంటే పొందతగింది లేదు. కోరతగింది లేదు. వాలి దహన కార్యాలు చేయించేదాన్ని కాదు. దానికి సుగ్రీవుడే సమర్థుడు. ఇకనుండి అన్ని కార్యాలు అతడే చేయాలి. పుత్రునికి తండ్రియే బంధువు. తల్లి కాదు. తండ్రి తరువాత పినతండ్రి వున్నాడు. ఆ సుగ్రీవుడే అంగదుని చూస్తాడు. శ్రేయస్సులందిస్తాడు. వాలి నా ప్రాణనాథుడు. ఈ లోకంలో కాని పరలోకంలో కాని ఆ స్వామిని సేవిస్తాను. అదే నాకు తగింది. శత్రువుతో కొట్టబడ్డాడు వాలి. నేలపై పడివున్నాడు. నేను ప్రాయోపవేశం చేస్తాను. వాలి వెంట వుంటాను'.

రామ సుగ్రీవుల మైత్రి – వాలి వధ – సుగ్రీవునికి భార్యని రాజ్యాన్ని అప్పగించటం – అది రామ ప్రతిజ్ఞ. అంగదుణ్ణి కిష్కింధాధిపతిని చేస్తే – రాముని ప్రతిజ్ఞకు భంగం కదా. ఎందుకు హనుమంతుడు తారతో అలా అన్నాడు. మొదటిసారి హనుమని చూశాడు రాముడు. అతని మాటలు విన్నాడు. అలాంటి దూత అవసరం. ఈ మారుతి మీద ప్రశంసలు కురిపించాడు రాముడు. తారని ఓదార్చాడు హనుమ. ప్రధానంగా ఆమె దుఃఖం పోగొట్టాలి. అంగదుని కోసం బతకాలి. అది ఆంజనేయుని ఉద్దేశం. అందుకే అలా మాట్లాడాడు. లంకలో సీతాదేవితో మాట్లాడిన తీరు – దశగ్రీవునితో మాట్లాడిన తీరు – అద్భుతం. అలాగే తారని ఓదార్చిన తీరు కూడా అద్భుతం. ఆమె ప్రాయోపవేశం చేస్తానంది. చేయలేదు. కారణం అంగదుని కోసమే.

## వాలి మరణం

ఇంతవరకు వాలిలో చలనం లేదు. ఉలుకు పలుకూ లేదు. స్పృహ కోల్పోయాడని చెప్పాలి. ఇపుడు తెలివిలోకి వచ్చాడు. మెల్లగా ఊపిరి తీసుకున్నాడు. కనులు తెరిచి చూశాడు. ఎట్ట ఎదుట అంగదుడు కనపడ్డాడు. తర్వాత చూపు సుగ్రీవుని మీద నిలిచింది. తమ్ముని మీద కోపం లేదు. వైరం లేదు. కన్నుల్లో స్నేహభావం తొణికిసలాడుతోంది. మెల్లగా అంటున్నాడు.

“సుగ్రీవా! నీకు అపకారం చేశాను. కిష్కింధ నుంచి వెడలగొట్టాను. నీ భార్యని అపహరించాను. తప్పు చేశాను. అది నా వ్యామోహం. విధి అలా ఆడించింది. మనం అన్నదమ్ములం. కలిసి మెలిసి బతకాలి. ఆ యోగం లేదు. ఆ అదృష్టం లేదు. వాలి అజేయుడు అనే అఖండకీర్తి అంతరించిపోతోంది. ఇక ఈ సంపద ఈ రాజ్యం నీదే. తీసుకో. ఏలుకో.

తమ్ముడా! ఇది నా అవసాన దశ. చెప్పేది బాగా విను. అంగదుణ్ణి చూడు ఏడుస్తున్నాడు. అల్లారుముద్దుగా పెంచాను. సుఖాలకే అలవాటు పడ్డాడు. పసివాడే కాని బుద్ధిలో ప్రౌఢుడు. అయితే మాయా మర్మం తెలీనివాడు. వాణ్ణి నీ సొంత కొడుకులా చూసుకో. వాడికి ఏ లోటూ రానివ్వకు. పరాక్రమంలో నీతో సమానుడు. యుద్ధంలో ముందుంటాడు. సర్వకార్యాలు నెరవేరుస్తాడు.

ఇదో తార. సుషేణుని కూతురు. అర్థ విషయంలో చతురురాలు. రాగల ఆపదల్ని ముందే పసికట్టకలదు. సర్వ సమర్థురాలు. ఆమె చెప్పినట్లు నడుచుకో. అధర్మంగా ప్రవర్తించకు. రాముడు మన్నించడు. చంపేస్తాడు.

**“ఇమాంచ మాలామ్ ఆధత్స్వ దివాయం సుగ్రీవ కాంచనీం ।**
**ఉదారా శ్రీస్థితా వ్యాస్యాం సంప్రజహ్యాన్మృతే మయి” ॥**

తమ్ముడా! ఇదో కాంచనమాల. ఇది ధరిస్తే సకల సంపదలు చేకూరుతాయి. శ్రేయస్సు సిద్ధిస్తుంది. మృతదేహం మీద వుంటే – దీని ప్రభావం పోతుంది. శక్తి పోతుంది. నా ప్రాణం పోలేదు తీసుకో” – హేమమాల ఇచ్చాడు వాలి. అందుకున్నాడు సుగ్రీవుడు.

వాలిలో సోదర ప్రేమ చూశాడు. అన్నని చంపాను కదా. ఆ భావన మనసులో మెదిలింది. వాలిని జయించాను – అన్న ఆనందం అడుగంటింది. గ్రహణం పట్టిన చంద్రునిలా వున్నాడు. దీనుడైనాడు. కరుడు గట్టిన వైరం సమసిపోయింది.

అంగదుణ్ణి చూశాడు వాలి. పుత్రవాత్సల్యం పొంగింది. 'నాయనా' అన్నాడు. “సుగ్రీవుడు చెప్పినట్లు నడుచుకో. ప్రియానికి పొంగకు. అప్రియానికి కుంగకు. సుఖదుఃఖాలు సమానం అనుకో. నా దగ్గర ఉన్నట్లు వద్దు. పినతండ్రి ముందు ఆటలు సాగవు. అతని శత్రువులతో మాట్లాడకు. ఎక్కువ చనువుగా ఉండకు. అట్లని దూరంగా వుండకు. ఎవరినీ ఎక్కువగా ప్రేమించకు. అట్లని ద్వేషించకు. మధ్యస్థంగా వుండు”.

బాణపు బాధ ఎక్కువైంది. గుడ్లు తేలేశాడు. నోరు తెరుచుకుంది. పండ్లన్నీ బయటపడ్డాయి. ప్రాణం పోయింది.

వానర ప్రముఖులు సేనాపతులు స్త్రీలు వానరులు గట్టిగా ఏడ్చారు. శోక సముద్రంలో మునిగింది తార. పరస్పరం మాట్లాడుకుంటున్నారు. వాలి పరాక్రమం పొగుడుతున్నారు

ఇలా. గోలభుడు ఒక గంధర్వుడు. ఒకరోజు వచ్చాడు. యుద్ధానికి పిలిచాడు. వెళ్ళాడు వాలి. 15 సంవత్సరాలు అహోరాత్రాలు యుద్ధం జరిగింది. గోలభుణ్ణి చంపాడు వాలి. అంతటి పరాక్రమవంతుడు, అంతటి బలశాలి వాలి. ఇపుడు రామబాణానికి హతుడైనాడు. ఎంత విచిత్రం!

భర్తని కౌగలించుకుంది తార. నరికిన చెట్టును అల్లుకున్న తీగెలా వుందామె.

రాక్షసరాజు రావణుడు హనుమంతుని గుద్దాడు. చలించిపోయాడు ఆంజనేయుడు. తేరుకున్నాడు. దెబ్బకు దెబ్బ తీయాలి కదా. హనుమ రావణుని వైపు చూశాడు. అపుడతడు నీలునితో యుద్ధం చేస్తున్నాడు. వేరొకరితో యుద్ధం చేస్తుంటే – మధ్యలో కలగజేసుకోకూడదని మిన్నకున్నాడు మారుతి. చాటునుంచి కాని వెనుక నుంచి కాని కొట్టలేదు హనుమంతుడు. ఆంజనేయుడు ప్రదర్శించిన యుద్ధనీతి అది. వాలి సుగ్రీవుల యుద్ధంలో – రాముడెందుకు – ఆ నీతి పాటించలేదు – అని ప్రశ్న.

ఇక్కడ అవతార ప్రయోజనం విశ్లేషించాలి.

రాముని బలపరాక్రమాలు విన్నది తార. అదే చెప్పింది వాలికి. అందుకు భయపడి వాలి శరణాగతుడైతే – అపుడు వాలిని చంపుతానన్న మాట వ్యర్థమైపోతుంది. సుగ్రీవుడు వ్యథ చెందుతాడు.

తనకంటే బలశాలి వాలి. శరణాగతుడైన విషయం రావణునికి తెలుస్తుంది. అతడూ భయపడతాడు. శరణాగతి చేస్తాడు. అపుడు దేవతలకిచ్చిన మాట భంగమవుతుంది. అవతార ప్రయోజనం సిద్ధించదు.

బంగారుమాల ఇంద్రునిది. దాన్ని వాలికిచ్చాడు. అది ధరించి – యుద్ధానికి పోతే – శత్రువు బలం సన్నగిల్లుతుంది. వాలి బలం పెరుగుతుంది. అది ఆ మాల మహిమ. ఆ విషయం వాల్మీకి ఎక్కడా చెప్పలేదు. కాని కొందరు పెద్దలు ఇలా వ్యాఖ్యానించారు.

రాముడు నరునిగా కాదు నారాయణునిగా ఎదురు నిలిస్తే – ఇంద్రుని మాల పని చేయదు. అపుడు ఇంద్రుణ్ణి అవమానించినట్లు అవుతుంది. అందుకే చెట్ల చాటున వుండి రాముడు బాణం వేశాడు.

ఒకవేళ తార మాట విని అపార వానరసేనతో వాలి వస్తాడు. రామునితో బహిరంగ యుద్ధానికి సిద్ధపడతాడు. పధ్నాలుగు వేల మందిని చంపిన రామునికి వానరసేన ఒక లెక్కలోకి రాదు. దుష్టశిక్షణ శిష్టరక్షణ – అది అవతార ప్రయోజనం. అయితే చాటునుంచి చంపవచ్చు అన్నాడు రాముడు. అది చెట్టు చాటు అని వాల్మీకి స్పష్టంగా చెప్పలేదు.

వాలి పడిపోయాడు. వార్త తారకి తెలిసింది. ఆమెకు ఎదురుగా వానరులు కనిపించారు. రాళ్ళు చెట్లు విసిరబడ్డాయి. రాముడు వాటిని నరికాడు. వాలిని చంపాడు అన్నారు. కాని వాలి సుగ్రీవులు – రామలక్ష్మణ హనుమలు తప్ప – ఆ ప్రదేశంలో వానరులు వున్నట్లు వాల్మీకి చెప్పలేదు. వాలి పడిపోయాక అటుగా వచ్చిన ఒకరిద్దరు వానరులు – ఆ వార్తని చేరవేసి ఉంటారు. ఒకరినుంచి మరొకరికి వార్త అందటంలో సహజంగా అతిశయోక్తులుండవచ్చు. అసత్యాలుండవచ్చు. తమ రాజు పోయాడు గనుక రాజ్యభద్రత కోసం – అలా తారకి చెప్పి వుంటారని మనం భావించాలి.

తను తప్పు చేశానని వాలి ఒప్పుకున్నాడు. అది స్పష్టంగా చెప్పాడు వాల్మీకి. వాలి వధ అన్యాయం అనటానికి మనం ఎవరం? – అని కొందరి విమర్శ.

వాలికి అది అవసాన దశ. కొన్నిక్షణాల్లో ప్రాణం పోతుంది. అతని మనస్సు అంగదుని మీద ఉంది. సుగ్రీవుడు తన కొడుక్కి అన్యాయం చేస్తాడని భయం. తన కొడుకుని కాపాడాలని రాముని కోరాడు. అందుకే తనదే తప్పు అని అంగీకరించాడు వాలి. ఇదొక వాదన.

వాలి 33 ప్రశ్నలు వేశాడు. విడి విడిగా వాటికి సమాధానం చెప్పలేదు రాముడు. సంగ్రహంగా చెప్పాడు. దాంతో తృప్తి చెందాడు వాలి. కాని పాఠకుడు మాత్రం తృప్తి పడలేదు.

షోడశ కళాపూర్ణుడు చంద్రుడు. అతనిలో ఒక అందమైన మచ్చ వుంది. షోడశ కళ్యాణ గుణాభిరాముడు రాముడు. అతనిలో రెండు అందమైన మచ్చలున్నాయి. ఒకటి వాలి వధ. రెండు సీతాదేవి అగ్నిప్రవేశం.

మనుషుల్లో రక్త సంబంధాలు దెబ్బ తింటున్నాయి. అన్నదమ్ములని కాని పరాయివాళ్ళని కాని – బంధాలు అనుబంధాలు తెగిపోతున్నాయి. విదేశీ గాలి మన దేశానికీ పాకింది. ఆధునిక సంస్కృతి పేరిట వావి వరుసల్లేవు. విచ్చలవిడి శృంగారాలు. ఏమైపోతోంది మన భారతీయ సంస్కృతి. ఏ వెలుగులకి కాదు, ఏ చీకట్లోకి ఈ ప్రస్థానమో!

ఎవరైనా ఆదరించారో ప్రేమించారో అది హృదయంలో వుంటుంది. చీదరించారో ద్వేషించారో అది మనసు పొరల్లో వుంటుంది. ప్రేమించినందుకు ప్రతిఫలం – ద్వేషించినందుకు ప్రతీకారం – ఏమీ వుండవు. ఉన్నది చాలు అనుకుంటే అంతా ఆనందమే. లేనిది కావాలనుకుంటే అంతా దుఃఖమే.

## తార ఆవేదన

వాలి ముఖాన్ని ముద్దాడింది తార. 'మహావీరుడా! వీరశయనుడా! నా ప్రాణనాథుడవు నీవు. నన్ను అనాథని చేశావు. నీ మరణం చూశాను. నా హృదయం ఇనుము కంటే కఠినం. అది ముక్కలు కాలేదు. బతికే వున్నాను. ఇది నా దుర్గతి. ఆడది సంతానవతి యైనా ధన ధాన్యాది సంపదలున్నా భర్త లేనిది అయితే – ఆమెని విధవ అంటుంది లోకం. అనాథ అంటుంది.

(సశేషం)

ధారావాహికం



శ్రీ పద్మపురాణాంతర్గత

# శ్రీ వేంకటాచల మాహాత్మ్యము

డా॥ విష్ణుభట్ల గోపాలకృష్ణమూర్తి, 9491579452

## ఆరవ అధ్యాయం

### – తీర్థ మాహాత్మ్యం

**కుమారధార తీర్థం** : ఈ కుమారధార యొక్క మాహాత్మ్యం సాటి లేనిది. దీనితో సమానమైన తీర్థం మరొకటి లేదు. కుమారస్వామికి శక్త్యాయుధాన్ని ప్రసాదించింది ఈ తీర్థంలోనే. ఇది శరణార్థులకు అభయమిస్తుంది.

పూర్వం దేవతలు ప్రార్థించగా త్రిపురాసుర సంహారియైన శంకరుడు కుమారస్వామిని దేవతలకు సేనాపతిగా నియమించాడు. ఆయన దానిని నిర్వహించడానికి తగిన శక్తి సామర్థ్యాలను సంపాదించుటకై శ్రీహరి నుండి ఉపాయమును పొంది త్రిసంధ్యల యందు కుమారధార తీర్థంలో స్నానమాచరిస్తూ, మూడు వేళలా గాయత్రీ మంత్రాన్నసుష్ఠిస్తూ , మూడు కాలాలలోను అనన్య మనస్కుడై దివ్యపుష్పాలతో శ్రీహరిని పూజిస్తూ ఆ కుమారధార తీర్థం సమీపంలో తపస్సు చేశాడు.

శ్రీమహావిష్ణువు అతని తపస్సుకు మెచ్చి అక్కడ ప్రత్యక్షమై కుమారస్వామికి శక్త్యాయుధాన్ని ప్రసాదించి అంతర్ధానమయ్యాడు. కుమారస్వామి శ్రీహరికి నమస్కరించి స్వర్గలోకానికి వెళ్ళాడు. కావున ఈ తీర్థానికి 'కుమారధార' అని ప్రసిద్ధి వచ్చింది. ఇది అనంతమైన ఫలాలనిస్తుంది. ఈ తీర్థ మహిమ విశేషంగా శ్లాఘించబడింది. శుకమహర్షి నెమ్మదిగా నిర్మలోదకములు గల కుమారధార తీర్థాన్ని చేరి ఆ పుణ్య తీర్థంలో స్నానమాచరించాడు.

**పాపనాశన తీర్థం** : ఆ తరువాత శుకమహర్షి పాపనాశన తీర్థానికి వెళ్ళి జితేంద్రియుడై ఆ తీర్థంలో స్నానాదికములు ఆచరించి ఆ తీర్థతీరంలో మూడు రోజులు నివసించాడు. పూర్వం వృత్రాసురుని సంహరించిన ఇంద్రుడు ఈ తీర్థంలో ఒక్కసారి స్నానమాచరించిన మాత్రం చేతనే బ్రహ్మహత్యా పాపం నుండి విముక్తుడై తిరిగి ఇంద్రపదవిని పొందాడు. అటువంటి మహాపాపాలను నశింపచేసే ఈ తీర్థం 'పాపవినాశన'మని ప్రసిద్ధి చెందింది. ఇది దేవతలకు, మానవులకు, పశుపక్ష్యాదులకు కూడా పాపాలను పోగొడుతుంది.

**ఆకాశగంగ తీర్థం** : ఆ తరువాత శుకమహర్షి ఆకాశగంగ తీర్థానికి వెళ్ళి అక్కడ స్నానానుష్ఠాలను ఆచరించాడు. ఆ ఆకాశగంగ సంసార సాగరాన్నుండి దాటుటకు చుక్కాని వంటిది. ఆ నిర్మలోదకాలలో మానవమాత్రులే కాక దేవతాస్త్రీలు, నాగకన్యలు, గంధర్వకాంతలు, కిన్నరాంగనలు, సిద్ధాంగనలు, వైఖానసస్త్రీలు మొదలగు వారంతా కూడా స్నానాలాచరిస్తారు.

**వ్రతతీవర్తని తీర్థం** : ఆ శుకమహర్షి నారాయణగిరి ప్రభావాన్ని, ఆ పర్వతాన్నధిష్ఠించి ఉన్న శ్రీమన్నారాయణుని వైభవాన్ని మనస్సులో తలచుకుంటూ, ఆయన్ని కీర్తిస్తూ ఆశ్చర్యంతో

వ్రతతీవర్తని తీర్థాన్ని సమర్పించి అందులో అఘమర్షణ స్నానం చేసి విష్ణుసూక్తాన్ని జపిస్తూ ఉన్నాడు. ఆ విధంగా శుక యోగీంద్రుడు ఆ తీర్థంలో స్నానం చేస్తూ భగవంతుని ధ్యానిస్తూ ఉండగా అశరీరవాణి 'శుకమహర్షీ! ఈ ప్రదేశం క్షీరసాగరశాయి, శ్రీవత్సలాంఛనుడు, శేషశాయి, అనంతుడు, సమస్త ఫలప్రదాత అయిన శ్రీనివాసునికి నివాసస్థానం.

ఈ పర్వతానికి ఆగ్నేయదిశలో పన్నెండు మైళ్ళ దూరంలో పాపవినాశిని అయిన సువర్ణముఖరీ నదీ తీరమున ఉత్తర దిక్కులో పుణ్యకాననములచే నిండిన పుణ్యప్రదేశములో పద్మసరోవరమనే పవిత్రమైన సరస్సు ఉంది. నీవు వెంటనే అక్కడకు వెళ్ళి ఆ పద్మ సరోవర తీరంలో ఘోరతపస్సు ఆచరించు. అప్పుడు నీ మనస్సు నిశ్చలమై నీ బుద్ధి స్థిరపడుతుంది. సర్వప్రాణులకు సాక్షీభూతుడైన శ్రీమహావిష్ణువు నీకు దర్శనమిస్తాడు' అని జనులందరూ వింటుండగా సాదరంగా పలికింది.

**పద్మసరోవర తీర్థం** : ఆ అశరీరవాణి వాక్కును విని శుకమహర్షి ఆ తీర్థజలము నుండి బయటకు వచ్చి ఆశ్చర్యంతో తనయందు భగవంతునికి కలిగిన కృపను, తన అదృష్టాన్ని తలచుకుంటూ తనను పవిత్రుని చేసే అశరీరవాణి వాక్కులను తలుచుకుంటూ పద్మసరోవరానికి వెళ్ళాడు.

పద్మసరోవరం సత్పురుషుల మనస్సువలె నిర్మలమైనది. వైడూర్యమువలె స్వచ్ఛమైన జలము కలది. వికసించిన పద్మాలతోను, ఎఱ్ఱకలువలతోను, బంగారు పద్మాలతోను, నల్ల కలువలతోను, తెల్ల కలువలతోను, ఎఱ్ఱని పద్మాలతోను నిండి తేనె తాగి మత్తెక్కిన తుమ్మెద పంక్తులతో ప్రకాశిస్తున్నదా పద్మసరోవరం. నీటి పక్షులు అవ్యక్త మధురంగా చేస్తున్న ధ్వనులతో ఆ సరస్సు పరిసరాలు ప్రతిధ్వనిస్తున్నాయి. మొసళ్ళు దానిని ఆక్రమించుట వలన దానిలో దిగుట కష్టశక్యంగా ఉంది. ఆ సరోవరంలో చేపలు పరిభ్రమిస్తున్నాయి. ఆ పరిసరాల్లో తుంగ ముస్తలను వరాహాలు భక్షిస్తున్నాయి.

ఏనుగుల గుంపులు తమ తొండాలతో తామర తూడులను పెళ్ళగిస్తున్నాయి. ఆడులేళ్ళు, వాటి పిల్లలు ఆ పరిసరాలలో సంచరిస్తున్నాయి. ఆ పరిసరవనాల్లో మదోన్మత్తులైన వనచరులు తిరుగుతున్నారు. ఆ సరోవరంలోని నీరు తపస్సు చేస్తున్న ముని పుంగవుల శ్రమను పోగొడుతున్నది. ఆ పద్మసరోవరం శ్రీహరికి ప్రీతిపాత్రమైనది. అటువంటి గొప్ప పద్మసరోవరాన్ని శుకయోగీంద్రుడు దర్శించి, దానిలో స్నాన పానాదులు చేసి తన శ్రమను పోగొట్టుకున్నాడు.

నారదాది మహర్షులు ఆ పద్మసరోవరాన్ని ఈవిధంగా ప్రశంసించారు –

**నారదమహర్షి –**

పద్మసరస్సులో స్నానం చేసినవాళ్ళు ఏడు జన్మలలో చేసిన పాపాన్ని పోగొట్టుకుని లక్ష్మీపతి వలె అపారమైన సంపదలు పొందుతారు.

**వసిష్ఠమహర్షి –**

స్వర్ణముఖీ నది ఒడ్డున పుట్టిన బంగారు పద్మాలు గల ఈ సరస్సులో స్నానం చేసినవాడు కోటి జన్మాలలో చేసిన పాపాన్ని పోగొట్టుకొని సంపదను పొందుతాడు.

**మరీచిమహర్షి –**

సువర్ణముఖరీ తీరంలో ఉన్న పద్మ సరోవరంలో స్నానం చేస్తే మహా పాపాత్ముడైనప్పటికీ ఆ పాపం నుండి ఒక్క క్షణంలో విముక్తుడవుతాడు.

**అత్రి మహర్షి –**

సువర్ణ ముఖరీ తీరంలోని పద్మ సరస్సులో స్నానం చేస్తే సర్వపాపాల నుండి విముక్తులై సంపదను పొందుతారనడంలో సందేహం లేదు.

**అంగీరస మహర్షి –**

రాజ్యాన్ని పోగొట్టుకొన్న రాజు జితేంద్రియుడై నియమంతో ఈ పద్మసరస్సులో నలుబది రోజులు (మండలం) స్నానం చేస్తే ఆ రాజ్యాన్ని సంపదను తిరిగి పొందుతాడు.

**పులస్త్యుడు –**

మంత్రానుష్ఠాన్ని వదలిన భ్రష్టుడైన బ్రాహ్మణుడు ఈ పద్మసరస్సులో మూడు వేళలా స్నానం చేసినచో ఒక్కరోజులోనే పరిశుద్ధుడౌతాడు.

**పులహుడు –**

వంచన చేస్తూ జీవించే వ్యవహార విశారదుడైన (బ్రతకనేర్చిన) వాడు పద్మసరస్సులో స్నానం చేస్తే ధార్మికుడైన రాజవుతాడు.

**క్రతుమహర్షి –**

ఆచారభ్రష్టుడై దేవతలను దూషించేవాడు పద్మసరస్సులో స్నానం చేస్తే పవిత్రుడవుతాడు.

ఈవిధంగా ఆ మహర్షులందరూ పద్మసరోవరాన్ని ప్రశంసించి తమ తమ ఆశ్రమాలకు వెళ్ళారు.

**కపిలతీర్థం – కపిలేశ్వరుడు :**

శుకమహర్షి వేంకటాచలానికి సమీపంలోని నిర్మలమైన కపిలతీర్థమును చేరాడు. ఆ పుణ్యతీర్థంలో మూడు వేళలా స్నానమాచరించి, సంధ్యానుష్ఠానం చేసి, అక్కడ వేంచేసి ఉన్న పరమశివుని పరమానందంతో దర్శించి, ఆయనకు నమస్కరించి, పూజించాడు. మహేశ్వరుడు ఆ కొండ చరియ యందు ఆసీనుడై ఉన్నాడు. ఆయన బాలభానుని వలె ప్రకాశిస్తున్నాడు. ఏకాంతంగా తారకనామాన్ని జపిస్తున్నాడు. పరమేశ్వరుడు పార్వతీ సమేతుడై నల్ల కలువ కాంతితో ప్రకాశిస్తున్నాడు. త్రినేత్రుడు, ఉపనిషత్తులే శరీరముగా కలవాడు అయిన శంకరుడు అగ్నివలె ఎఱ్ఱగా ప్రకాశిస్తున్న జటాజూటంతో విరాజిల్లుతున్నాడు. ఆ జటాజూటంలో గంగను, చంద్రకళను ధరించాడు. సర్పాలను ఆభరణాలుగా ధరించాడు. పులిచర్మాన్ని ఉత్తరీయంగా




వేసుకొన్నాడు. గజచర్మాన్ని ధరించాడు. భయంకరమైన కాలకూట విషాన్ని కంఠనాళంలో బంధించాడు. పరమశివుడు పద్మం వంటి ముఖంతో ప్రకాశిస్తున్నాడు. శుకమహర్షి అటువంటి పరమశివుని దర్శించి, సంతోషంతో ఆయనకు నమస్కరించి, పూజించి, మూడు రోజులు అక్కడే వుండి ఆయన్నే ధ్యానిస్తూ ఆనంద తరంగిత హృదయుడైనాడు.

**స్వామి పుష్కరిణీ తీర్థం :**

**7.1సరస్సు సౌందర్యం** : శుకమహర్షి దట్టమైన అటవీ ప్రాంతంలో సంచరిస్తూ ఆకలి దప్పులను మఱచి ముకుంద చరణారవింద చింతనామృతాన్ని గ్రోలుతూ పరమానందభరితుడై స్వామిపుష్కరిణిని సందర్శించాడు. ఆ పుష్కరిణి నిర్మలోదకంతో, బంగారు పద్మాలతో, ఎఱ్ఱ తామరలతో, తెల్ల కలువలతో, నల్ల కలువలతో వ్యాప్తమై ఉంది. ఆ పుష్ప పరిమళం ఆ ప్రాంతమంతా వ్యాపిస్తున్నది. దానిలో రాజహంసలు విహరిస్తున్నాయి. ఆకాశంలోని నక్షత్రాలు ఆ నీటి తరంగాల్లో ప్రతిబింబిస్తున్నాయి. జలపక్షులు, కలహంసలు అవ్యక్త మధుర ధ్వనులతో ఆ ప్రాంతమంతా మారుమ్రోగుతున్నది. స్వామిపుష్కరిణి చక్కగా కూస్తున్న కొంగలు, కన్నెలేడి పక్షులు, హంసలు, జెగ్గురుపక్షులు, తెల్ల కొక్కెరలు ఇంకా అనేక అడవి పక్షి సమూహాలతో కూడి ఉంది. ఆ పుష్కరిణిలోని తరంగాలు ధ్వనులు చేస్తున్నాయి.

**7.2 . సుందరతీరం** : దాని తీరంలో తమాల వృక్షములు, తిలక వృక్షాలు, పూగ, నారికేళ, పాటల, మొగలి, పున్నాగ, సురపొన్న, పుత్రదీపక వృక్షాలున్నాయి. గజనిమ్మ, సంపెంగ, మామిడి, నిమ్మ, కొండమల్లె, మఱ్ఱి, ఎఱ్ఱమందారం, మొగలి, తెల్లమందారం, హరిచందనం, మోదుగ, అశోక, కల్ప, మద్ది, కడిమి, కరక, మారేడు, చందన, అరటి, దానిమ్మ, మాదీఫల, పెద్దగోరింట, మొల్ల, నిమ్మ, నేరేడు మొదలగు దట్టమైన నీడనిచ్చే చెట్లు ఆ పుష్కరిణీ తీరంలో వ్యాపించి ఉన్నాయి.

పూతీగెల పొదలు, దమనీలతలు, బండి గురివెంద, జాజి, చంద్ర మొదలగు చెట్లు, పూలు-పండ్లతో నిండిన చెట్లు, అడవి మొల్ల జాతి తీగలు, తామరపూలు, విష్ణు పర్ణములు, కృష్ణతులసి, లక్ష్మితులసి, చంద్రకాంత మొక్కలు, గన్నేరు, మంకెన, అల్లం, పసుపు, కర్పూర వృక్షాలు, పనస, దుంపజాతులు, పరిమళము వెదజల్లే పూతీగెలతో ఆ ప్రాంతమంతా వ్యాపించింది. కలువపూలు, తామరపూలలోని తేనెను త్రాగి మత్తెక్కిన తుమ్మెదలతోను, మదించి మధురంగా కూస్తున్న కోకిలలతోను ఆ ప్రదేశమంతా పరమ రమణీయంగా ఉంది. అక్కడ చెట్ల దట్టమైన నీడలు అక్కడకి వచ్చేవారి తాపాన్ని పోగొడుతున్నాయి.

ఆ ప్రాంతమంతా చక్కగా పరిమళిస్తున్న పూతీగెలు అల్లుకొని ఉన్నాయి. పగడ, ఖర్జూర, కొబ్బరిచెట్లు, మొగలిపొదలు, చందనవృక్షాలు, పున్నాగ, అశోక, మోదుగ, వేగిస, సంపంగి, తాపించ, పనస, విప్ప, దేవదారు, నారింజ వృక్షాలతో ఆ ప్రాంతమంతా నిండి వుంది. ఇంకను కొండమల్లె, శిశుపున్నాగ, పోక, అరటి, చక్కెరకేళి చెట్ల సమూహాలతో కూడి ఉంది. పసుపు తోటలు, అల్లపు మళ్ళు, కస్తూరి, అశ్మయోని వృక్షాలు, మల్లెలు, మాలతి, మకరందాన్ని వెదజల్లే మాధవీలతలతోను పరిమళిస్తున్నది. అడవిమొల్లలు, పద్మాలు మొదలగు పూలచెట్లతోను, జాజి పొదలతోను, నందివర్ధనం చెట్లతోను వ్యాప్తమై ఉంది.

దట్టమైన నీడనిస్తూ, చక్కని పరిమళాన్ని వెదజల్లుతున్న సౌగంధిక వృక్షాలతోను (కామంచి చెట్లతోను), నలుదిక్కుల సుగంధ పరిమళాన్ని వెదజల్లుచున్న తులసీవనాలతో శోభిస్తున్నది. అక్కడి పుష్పలతలన్నీ పరిమళాన్ని వెదజల్లుతున్నాయి. ఆ



పరిసర ప్రాంతమంతా ఆ సుగంధ పరిమళం వ్యాపించింది. ఆ పుష్కరిణి చుట్టూ తపస్సు చేస్తున్న యోగి పుంగవులు బాల సూర్యునివలె ప్రకాశిస్తున్నారు. వరాహాలు, సింహాలు, పెద్దపులులు, గజసమూహాలు అక్కడ సంచరిస్తున్నాయి. తెల్లని, నల్లని రంగు కలిగి నివారింప శక్యముకాని కుక్కల గుంపులచే సేవించబడుచున్న భయంకరుడైన క్షేత్రపాలకుడు ఆ ప్రాంతాన్ని పర్యవేక్షిస్తున్నాడు.

**7.3 మహర్షుల ప్రశంస** : ఆ అంజనాద్రిలో శ్రీనివాసునికి సమీపంలో శివపత్నియైన పార్వతీదేవికి పుణ్యపురుషార్థ ఫలాన్ని ప్రసాదించిన పవిత్ర తీర్థం స్వామిపుష్కరిణి. అది త్రిలోకపావని, పుణ్యప్రదాయిని, త్రిపథగామినియైన గంగానదికి జన్మస్థానం. త్రివిక్రమావతారుడైన శ్రీమహావిష్ణువును ఆరాధించుటకై దేవతా ప్రముఖుడైన బ్రహ్మదేవుడు ఈ నీటిని తన కమండలము నందు తీసుకున్నాడు. అటువంటి పుణ్యతీర్థమిది. ఈ పుష్కరిణి తీరంలో దేవతలు, మనుష్యులు, పశుపక్ష్యాదులు కూడా తమ అభీష్ట ఫలాలను పొందుతారు. ఈ పుష్కరిణిలో స్నానము చేసిన బ్రహ్మజ్ఞానులు, అతీంద్రియ ద్రష్టలు, నిర్మల జ్ఞానస్వరూపులు అయిన మహర్షులు ఈ పుష్కరిణి మాహాత్మ్యాన్ని పరస్పరం ఈవిధంగా వర్ణించారు.

**అత్రిమహర్షి** – స్వామిపుష్కరిణిలో స్నానం చేసి ఆ నీటిమధ్యలో నిలచి 'తద్విష్ణోః పరమం పదమ్' అనే మంత్రాన్ని ఒక్కసారి జపించినవాడు పాపరహితుడవుతాడు.

**వ్యాసమహర్షి** – స్వామిపుష్కరిణిలో శ్రద్ధతో స్నానము చేస్తే భ్రూణహత్య పాపం నశించి అభీష్ట సిద్ధి కలుగుతుంది.

**వశిష్ఠమహర్షి** – శ్రీహరిని స్మరిస్తూ స్వామిపుష్కరిణిలో స్నానము చేసినవారికి ఏడు జన్మలలో చేసిన పాపం వెంటనే పోతుంది.

**పరాశర మహర్షి** – స్వామి పుష్కరిణిలో స్నానం చేస్తే నరకాలన్నింటిని దాటి బ్రహ్మ సాయుజ్యాన్ని పొందుతాడు.

**గౌతమమహర్షి** – ఇతర తీర్థంలో స్నానం చేసేటప్పుడు స్వామిపుష్కరిణిని తలచుకొని శ్రీనివాసుని ధ్యానిస్తే అన్ని పాపాల నుండి విముక్తుడవుతాడు.

**భరద్వాజ మహర్షి** – ప్రాతః కాలంలో లేచి బుద్ధిమంతులు నిశ్చల చిత్తంతో స్వామిపుష్కరిణిని స్మరిస్తే పరమపదాన్ని పొందుతారు.

**మనువు** –స్వామిపుష్కరిణీతీర్థజలాన్నిప్రీతితోస్వీకరించేవారు పాపవిముక్తులై సనాతన బ్రహ్మపదాన్ని పొందుతారు.

**యముడు** – స్వామిపుష్కరిణి తీరంలో రాత్రి, పగలు ఉపవాసం ఉండేవారు పరమపదాన్ని పొందుతారు.

**యాజ్ఞవల్క్య మహర్షి** – స్వామిపుష్కరిణి జలాల్లో స్నానం చేసేవారి బాధలన్నీ పోయి, సకలాభీష్టాలను పొందుతారని బ్రహ్మదేవుడు ప్రతిజ్ఞచేసి చెప్పాడు.

**హారీత మహర్షి** – శ్రీహరిని స్మరిస్తూ స్వామిపుష్కరిణిలో స్నానం చేసే మానవులు పాపరహితులై నిద్రాది దోషవర్జితులై శుద్ధ సత్త్వమయమైన పరమపదాన్ని పొందుతారు.

**అంగిరస మహర్షి** – స్వామిపుష్కరిణిలో స్నానం చేసి అక్కడే అనుష్ఠానాదులు నిర్వర్తించేవారికి అనేక జన్మార్జిత పాపరాశి నశిస్తుంది.

**ఉశనసమహర్షి** – ప్రతిరోజు స్వామిపుష్కరిణిని స్మరించేవారు పాప పంకిలము నుండి విడివడి సత్ఫలితాలను పొందుతారు.

**సంవర్త మహర్షి** – సర్వకాల సర్వావస్థలయందు స్వామి పుష్కరిణిని స్మరించేవారు పాపవిదూరులై పరిశుద్ధులవుతారు.

**ఆపస్తంభ మహర్షి** – స్వామిపుష్కరిణిలో స్నానాదికములు నిర్వర్తించేవారు స్తంభమువలె పాతుకొని ఉన్న పాపాల నుండి విముక్తులై పరమపదాన్ని పొందుతారు.

**మరీచిమహర్షి** – పాపాత్ముడైనప్పటికీ నారాయణగిరిలోని స్వామిపుష్కరిణి తీరంలో ఒక్కరోజు ఉన్నట్లైతే అతడు పాపరహితుడౌతాడు.

**మృకండు మహర్షి** – నరసింహాద్రిలో పక్షివాహనుడైన శ్రీహరికి ప్రీతికరమైన స్వామిపుష్కరిణిని సేవించువాడు దేవత్వాన్ని పొందుతాడు.

**పులస్త్య మహర్షి** – వేంకటాద్రిలోని వరాహస్వామికి ప్రీతికరమైన స్వామిపుష్కరిణిలో మూడు పూటలా స్నానం చేసేవాడు సర్వులకు ప్రియుడవుతాడు.

**కాత్యాయన మహర్షి** – నృసింహాద్రిలో ఉన్న శ్రీమహావిష్ణువుకు ప్రీతికరమైన స్వామిపుష్కరిణిని సేవించువాడు మహాత్ముడౌతాడు.

**బృహస్పతి** – అంజనాద్రిలోని పొదరిండ్ల మధ్య ఉన్న స్వామిపుష్కరిణీ తీర్థంలో ఒక్కసారి స్నానం చేసిన మానవుడు కృతకృత్యుడవుతాడు. ఇది సత్యం.

**భృగు మహర్షి** – ఉదయాన్నే లేచి స్వామిపుష్కరిణిని స్మరిస్తూ గోదానం చేసినచో గోహత్యా పాతకం నశిస్తుంది.

**వాల్మీకి మహర్షి** – ఉప పాతకాలు చేసినవాడు ఒక నెల రోజులు స్వామి పుష్కరిణి తీరంలో ఉండి గోదానం చేస్తే పవిత్రుడౌతాడు.

**శంఖలిఖితులు** – స్వామిపుష్కరిణి తీరంలో బుద్ధిమంతులు చేసే శ్రౌత స్మార్త క్రియలు సహస్ర గుణితములౌతాయని బ్రహ్మవేత్తలు చెబుతారు.

**శాతాతప మహర్షి** – స్వామిపుష్కరిణి తీరంలో హవ్యకవ్యాలు సమర్పించేవాడు వడ్డీ వ్యాపారస్తుడు కాని, నాస్తికుడు కాని సత్ఫలితాలను పొందుతాడు.

**బోధాయన మహర్షి** – స్వామిపుష్కరిణి తీరంలో నివసిస్తూ హరిభక్తుడై అశ్వమేధాది యజ్ఞాలు చేసేవాడు సాక్షాత్తు పరమశివుడే అవుతాడు.

**మార్కండేయ మహర్షి** – శ్రీహరికి ఆనందాన్నిచ్చే

నృసింహాద్రిలో నున్న స్వామిపుష్కరిణిని కీర్తించేవాడు ఎన్నటికిని చెడడు.

**మాండవ్య మహర్షి** – వేంకటాద్రిలోని స్వామిపుష్కరిణీ తీరంలో ఉంటూ భగవంతుని ధ్యానించే మానవుడు దేవతలచే పూజింపబడతాడు.

**శాండిల్య మహర్షి** – స్వామిపుష్కరిణీ తీరంలో ఐదువేళలా భగవదారాధన నియమంతో చేసేవాడు జరామరణాల కతీతుడై అప్రాకృత దివ్యదేహాన్ని ధరిస్తాడు.

**కాశ్యప మహర్షి** – భగవంతుని స్మరిస్తూ స్వామిపుష్కరిణిలో స్నానం చేసేవాడు కర్మబంధాల నుండి విముక్తుడై కృతకృత్యుడౌతాడు.

**కణ్వమహర్షి** – స్వామిపుష్కరిణీ తీర్థాన్ని మూడుసార్లు, మూడు దోసిళ్ళు త్రాగినవాడు రాత్రి, పగలు చేసిన పాపాల నుండి వెంటనే విముక్తుడవుతాడు.

**అగస్త్య మహర్షి** – కర్మేంద్రియాలతోను, జ్ఞానేంద్రియాలతోను, మనస్సుతోను తెలిసి చేసిన పాపాలన్నీ స్వామి పుష్కరిణీ స్నానం వలన క్షణంలో పటాపంచలైపోతాయి.

**దుర్వాస మహర్షి** – ఇంద్రియ నిగ్రహంతో స్వామిపుష్కరిణిని కీర్తించేవాడు సనక సనందాదులచే పూజింపబడతాడు.

**విశ్వామిత్ర మహర్షి** – పరమ పవిత్రమైన స్వామిపుష్కరిణీ తీర్థాన్ని తాకినంతనే జ్ఞానము కలిగి శ్రీమహావిష్ణువును దర్శింపగోరుతారు.

**శక్తి మహర్షి** –స్వామిపుష్కరిణీ తీర్థంలో స్నానం చేసేవారు పరమ పావనులై నిత్య విభూతితో దివ్య శరీరాలు ధరిస్తారు.

**శుక మహర్షి** – స్వామి పుష్కరిణి అతి ప్రాచీనమైనది. పుణ్యప్రదమైనది. ఇది దేవతలను, మానవులను, పశుపక్ష్యాదులను కూడా పవిత్రీకరిస్తుంది. ఈ పుష్కరిణిలో పరాత్పరుడైన శ్రీపతి వరాహరూపాన్ని ధరించి శ్రీదేవి భూదేవులతో, శక్తులతో కేళీ విలాసాలతో, చిత్ర విచిత్రాలైన అనేక శృంగ యంత్ర విన్యాసాలతో విశ్వాన్నంతా ఆనందింపజేసే జలక్రీడ జరుపుతుంటాడు.

**శౌనక మహర్షి** – సర్వజన హితకరమైన స్వామిపుష్కరిణిలో స్నానపానాదులు చేసేవారు, దానిని కీర్తించేవారు తాపత్రయము నుండి విముక్తులౌతారు.

**నారదమహర్షి** – స్వామిపుష్కరిణి మాధవునికి ప్రియకారిణి. ఇది పామరుల ప్రాకృత వాంఛలను తొలగిస్తుంది.

**క్రతు మహర్షి** – స్వామిపుష్కరిణి సౌమ్యమైనది. అనేక క్రతువులు చేసి సోమపానం చేసిన స్వయంభువు అయిన బ్రహ్మదేవుడు ఇప్పటికీ ఈ పుణ్యోదకాలలోనే అవభృథ స్నానమాచరిస్తాడు. ఈ నృసింహాద్రిలో లతాగృహాలలో తపస్సు చేసుకొనే సాధుపుంగవులు స్వామిపుష్కరిణిలో స్నానం చేసి సంసార సాగరం నుండి తరించారు. వేదవేద్యులైన బ్రాహ్మణులు, భక్తులు భగవంతుని దర్శింపగోరి ఈ పుష్కరిణిలో స్నానం చేస్తారు.

**సత్యాషాఢ మహర్షి** – సన్యాశ్రమ ధర్మాలను, బ్రహ్మచర్య వ్రతాన్ని ఆచరించేవారికి ఇది ఆశ్రయం. ఇతరులకు ఇది ఐశ్వర్యప్రదం.

**కుండిన మహర్షి** – సింహాద్రి గుహలో ఉన్న స్వామిపుష్కరిణి పుణ్యాత్ములకు, పాపాత్ములకు కూడా సకలాభీష్టాలనిస్తుంది.

**హారీత మహర్షి** – విష్ణువు పాదాల నుండి పుట్టిన స్వామిపుష్కరిణి సకలాపదలను పోగొట్టి సకల సంపదలనిస్తుంది. ఇది సకల సంపదలకు నిలయం.

**జైమిని మహర్షి** – శిరస్సున అంజలి ఘటించి స్వామిపుష్కరిణిలో భగవద్ధ్యానం చేస్తూ తమ అనుష్ఠానములను చేసుకొనేవారు పుణ్యాత్ములు. దీనిలో ఒక్కసారి స్నానం చేస్తే వారు హవ్యకవ్యములకు అర్హులవుతారు. వారు శ్రీహరికి ఎంతో ప్రియులు.

**జాబాలి మహర్షి** – ఇతర తీర్థాలలో స్నానం చేసేటప్పుడు స్వామిపుష్కరిణిని స్మరిస్తే వారు కృతకృత్యులై స్వామిపుష్కరిణీ స్నానఫలాన్ని పొందుతారు.

**బ్రహ్మదేవుడు** – స్వామిపుష్కరిణీ తీర్థంతో భగవదారాధన చేసేవారు ఈ జన్మలోనే విష్ణుత్వాన్ని పొందుతారు.

**సనక మహర్షి** – పరాత్పరుడైన శ్రీనివాసుడు ఈ సరస్సు తీరమున నివసించుట వలన ఇది ధన్యమైనది. దీనిని సేవించేవాడు ఆత్మప్రాప్తిని పొందుతాడు.

**సనందన మహర్షి** – విష్ణువు పాదముల నుండి పుట్టి, బ్రహ్మదేవుని కర స్పర్శచే పవిత్రమై, ఈశ్వరుని జటాజూటములో ఉండుట వలన ఇది పరమ పవిత్రమైనది.

**సనత్కుమార మహర్షి** – చతుర్దశ భువనాలను తనలో స్నానము చేయుట వలన పవిత్రం చేయగల స్వామిపుష్కరిణి ధన్యమైనది. ఇది సర్వఫలదాయిని.

**వామదేవ మహర్షి** – మూడు లోకాలలోను ఉన్న సరస్సులన్నింటికి ఇది రాణి వంటిది. కావున దీనిని స్వామిపుష్కరిణి అన్నారు.

**సనాతన మహర్షి** – ఉదయాన్నే లేచి భక్తితో స్వామిపుష్కరిణిని కీర్తించేవారు పరమపదాన్ని పొందుతారు.

**దేవదర్శన మహర్షి** – జితేంద్రియులైన మహర్షులందరూ ఈ విధంగా కృతకృత్యులై ఆ పుష్కరిణి తీరంలో పుణ్యభూమి యందు నివసించారు. అక్కడ ఒకనాడు చతుర్భుజుడైన శ్రీనివాసుడు లీలగా అనంత, గరుడ, విష్వక్సేనాది దివ్య పరిజనంతో సేవించబడుతూ ప్రత్యక్షమయ్యాడు. ఆ మహర్షులందరూ చతుర్భుజుడు, దివ్యమంగళ విగ్రహుడు, నల్ల అవిసె పూలగుత్తి వంటి కాంతిగల శ్రీనివాసుని సేవిస్తూ ఉన్నారు.

**పాండవ (గోగర్భ) తీరం :**

ఓ దేవల మహర్షీ! ఇంకను నేను చెప్పునది సావధాన చిత్తంతో

విను. ఈ శ్రీనివాసగిరికి తూర్పు దిక్కున స్వామిపుష్కరిణికి సమీపంలో ఒక పవిత్ర తీర్థమున్నది. అది సకల పాపాలను పోగొడుతుంది. దోష రహితమైనది. ఐశ్వర్యప్రదమైనది.

పూర్వం మాయావియైన శ్రీమహావిష్ణువు యొక్క మహామాయకు లోబడి పాండవులు తమ జ్ఞాతులను వధించి ఆ మహాపాతక దోషమును పోగొట్టుకొనుటకై ఆ పాపం ఎలా పోతుందాయని విచారిస్తూ మహా పరాక్రమశాలులైన ఆ పాండవులు దీన మనస్కులై కాళీయుని వలె నల్లని శరీరం గల శ్రీకృష్ణునిచే ప్రేరేపించబడినవారై సంపూర్ణ మనస్కులై నిరుపద్రవమైన పాపరహితమైన ఆ తీర్థంలో స్నానం చేశారు.

ఆ తీర్థం ఒడ్డున మహిషాసుర మర్దినిని పూజించి స్తుతించి ఆ తరువాత శ్రీనివాసుని ఆరాధించారు. అందువల్ల వారు పాపరహితులై, నిర్మలమనస్కులై తిరిగి వెళ్ళారు. శాస్త్రవిధి నెరిగినవారు, నిష్కళంక ప్రజ్ఞాశాలురు, సకలవిధ జ్ఞాన విశారదులు అయిన పాండవులు ఆ తీర్థమునందు స్నానము చేయుట వలన అది పాండవ తీర్థముగా ప్రసిద్ధి చెందింది.

**పుణ్యపుష్కరిణి** :

నృసింహాద్రి లోని పరమ పవిత్రమైన నీలకంఠాశ్రమములో ఒక దివ్య పుష్కరిణి ఉంది. దానిలో వైడూర్యముల వలె నిర్మలమైన నీరు ఉన్నది. బంగారు ఛాయగల తామరపూలు, ఎర్ర కలువలు, నల్లకలువలు దానిలో వికసించి పరిమళాలు వెదజల్లుతున్నాయి. దానిలో పవలు తేలియాడుతున్నాయి. అది చేపలు, మొసళ్ళు, నీటి పక్షులతో నిండి ఉంది. దాని మధ్య భాగంలో నీటి తరంగాలు కనుగుడ్ల వలె నిరంతరం చలిస్తున్నాయి. వికసించిన తెల్లకలువలు, తెల్ల తామరపూలతో ఆ పుష్కరిణి అలంకృతమై ఉంది.

ఆ సరోవర పరిసరాలలో అడవి పక్షులు సంచరిస్తున్నాయి. తుమ్మెదలు పూదేనె త్రాగించి మదించి ఝంకారం చేస్తున్నాయి. అక్కడ మదపుటేనుగుల గండస్థలముల నుండి కారుచున్న మదజలంతో ఆ ప్రాంతమంతా కలుషితమైనప్పటికీ నిర్మలంగా కనబడుతున్నది. అక్కడ తపస్సు చేస్తున్న మహాత్ములైన దేవర్షుల, రాజర్షుల సమూహములతో ఆ పుష్కరిణి పరిసర ప్రాంతమంతా నిండి వుంది. ఆ మహర్షులు నరసింహ మంత్రాన్ని నియమబద్ధంగా జపిస్తున్నారు. వారి సకలావయవములు పరిశుద్ధంగా ఉన్నాయి. అటువంటి విశుద్ధులైన మహాత్ములు విశాలమైన ఆ పుష్కరిణీ తీరంలో కూర్చుని తపస్సు చేస్తున్నారు.

నిష్కళంకుడు, సకలం తానైనవాడు, అన్నిటితో కూడినవాడు, తనను ఆశ్రయించేవారిని రక్షించేవాడు, శ్రీవత్సచిహ్నము గల నారసింహుని అద్భుతమైన మంత్రాన్ని జపిస్తున్నవారితోను, జ్ఞానానంద స్వరూపుడు – జ్ఞాన గమ్యుడు అయిన పరమాత్మను ధ్యానించే జితేంద్రియులైన యోగులతోను కూడినది. బ్రహ్మర్షులచే సదా సేవించబడునది, శ్రీమహావిష్ణువు పాదస్పర్శచే పవిత్రులైన పుణ్యపురుషులతో కూడినది, ప్రాచీనమైనది, సకల పుణ్యాలకు నిలయమైనది, పురుషోత్తమ ప్రాప్తినిచ్చునది, పూర్వజన్మ సుకృతము గలవారికి మాత్రమే లభ్యమగునది. మరొక స్వామి పుష్కరిణియా అనునట్లున్న ఆ పవిత్ర పుష్కరిణి తనను దర్శించుట చేతను, స్పృశించుట చేతను, తన నీటిని పానము చేయుట చేతను, అందరకు సకలాభీష్టములను ప్రసాదిస్తుంది.

## తుంబురు (ఫల్గుణి) తీర్థం : (గరుడ పురాణాంతర్గతం)

**వసిష్ఠుని ఆదేశం :**

పూర్వం పతివ్రతా శిరోమణి అయిన అరుంధతి తాను తపస్సు చేయుటకు అనువైన పుణ్యతీర్థం గురించి వివరించమని తన పతియైన వసిష్ఠ మహర్షిని కోరింది. అప్పుడు వసిష్ఠ మహర్షి “అరుంధతీ! స్వామిపుష్కరిణికి ఉత్తర దిక్కున ఆకాశగంగ తీర్థము విరాజిల్లుతున్నది. దాని మాహాత్మ్యం సాటిలేనిదని విజ్ఞులు చెప్పారు. ఆకాశగంగకు ఉత్తరంగా పాపవినాశనమనే తీర్థరాజమున్నది. దానిలో స్నానమాచరిస్తే అన్ని రకాల పాపాలు నశిస్తాయి. దానికి ఉత్తరంగా ఈశాన్యదిశలో పర్వతారణ్యం మధ్యలో తుంబురు తీర్థమనే ప్రసిద్ధమైన తీర్థమున్నది.

అక్కడ అనేక వృక్ష సమూహాలుంటాయి. సింహాలు, పెద్దపులులు సంచరిస్తుంటాయి. అక్కడి ప్రదేశం ఎత్తు పల్లాలుగా ఉంటుంది. పూర్వం దేవతలు, గంధర్వులు, మునులు గొప్ప తీర్థరాజమైన ఆ తుంబురు తీర్థంలో స్నానమాచరించి కృతార్థులయ్యారని నేను బ్రహ్మదేవుని వలన విన్నాను. కావున నీవు వేంకటాచలమునకు వెళ్ళు. ముందుగా అక్కడ స్వామిపుష్కరిణి తీర్థంలో యథావిధిగా స్నానం చెయ్యి. ఆ తరువాత ఆది వరాహ స్వామిని దర్శించి, ఆయనకు నమస్కరించు. పిమ్మట వేంకటేశ్వరుని దర్శించి, సేవించు.

అనంతరం ఆకాశగంగ తీర్థంలోను, ఆపైన పాపవినాశ తీర్థమందును స్నానమాచరించి తుంబురు తీర్థానికి వెళ్ళు. ఆ పుణ్యతీర్థంలో నిర్మలమైన మనస్సుతో స్నానం చేసి, దాని ఒడ్డున తూర్పుముఖంగా కూర్చుని తపస్సు చెయ్యి” అని వసిష్ఠుడు అరుంధతిని ఆజ్ఞాపించాడు. అరుంధతి వసిష్ఠుని అనుమతిని పొంది తపస్సు చేయుటకై వేంకటాచలమునకు బయలుదేరింది.

**అరుంధతి తపస్సు** :

ఆమె వేంకటాచలమునకు వెళ్ళి ముందుగా ఆ పర్వతమునకు క్రింది భాగంలో ఉన్న కపిలతీర్థంలో స్నానం చేసి, కపిలేశ్వరుని దర్శించి, వేంకటాద్రి నధిరోహించింది. పవిత్రమైన స్వామిపుష్కరిణిలో స్నానమాచరించి భూ వరాహస్వామిని దర్శించి నమస్కరించింది. ఆ తరువాత శ్రీనివాసుని దర్శించి ఆయనకు ప్రణమిల్లి ‘శ్రీహరీ! నన్ను కాపాడు. అనుగ్రహించు. ఓ దయానిధీ! నేను తుంబురు తీర్థానికి వెళ్ళి అక్కడ తపస్సు

చేయబోవుచున్నాను. అక్కడ నీవు లక్ష్మీదేవితో కూడ త్వరలోనే నాకు ప్రత్యక్షం కావాలి' అని ప్రార్థించి, ఆకాశగంగకు, పాపవినాశనమునకు వెళ్ళి ఆ తీర్థాలలో స్నానం చేసి వెంటనే తుంబురు తీర్థాన్ని చేరింది.

పతి మాటను స్మరిస్తూ ఆ తీర్థంలో యథావిధిగా స్నానం చేసి దాని ఒడ్డున తూర్పుముఖంగా కూర్చుని తన భర్త ఉపదేశించిన విష్ణు మంత్రాన్ని జపిస్తూ తపస్సు చేసింది. అప్పుడామెకు 'అనుమతి' అనే చెలికత్తె నిరంతరం పరిచర్యలు చేసింది. ఆవిధంగా అరుంధతి నియమ వ్రతంతో, ఆహారం తీసుకోకుండా పన్నెండు సంవత్సరాలు తపస్సు చేసింది.

**భగవంతుని సాక్షాత్కారం :**

తపోదీక్షలో ఉన్న అరుంధతిని చూసి దేవతలు, గంధర్వులు, మునులు 'ఆశ్చర్యం! ఆశ్చర్యం' అంటూ సంతోషించారు. ఆమె తపస్సుకు మెచ్చి భగవంతుడు ప్రసన్నుడై సాక్షాత్కరించాడు. ఫాల్గుణ పౌర్ణమినాడు సూర్యుడు మీనరాశిలో ఉండగా వేంకటేశ్వరుడు లక్ష్మీసహితుడై అరుంధతికి ప్రత్యక్షమయ్యాడు. అప్పుడు బ్రహ్మాది దేవతలు, వ్యాసాది మహర్షులు, సనక సనందనాది యోగులందరూ విచ్చేశారు. మునిపత్నులు, దేవపత్నులు గుంపులు గుంపులుగా అక్కడికి వచ్చారు.

మహాపతివ్రత అయిన అరుంధతి తన వక్షస్థలంలో లక్ష్మీదేవిని ఆలింగనం చేసుకుని ఉన్న శ్రీనివాసుని, వేంకటేశ్వరుని, శ్రీహరిని దర్శించి, పరమ సంతోషంతో ఆయనకు ప్రణమిల్లింది. తనకు భక్తితో నమస్కరిస్తున్న ఆమెను చూచి దయానిధియైన శ్రీహరి 'ఓ అరుంధతీ! లెమ్ము. నీవు తపస్సు చేసి మిక్కిలి కృశించి ఉన్నావు. నీ అభీష్టాన్ని ప్రసాదిస్తాను. సువ్రతీ వరం కోరుకో' అన్నాడు. భగవంతుడు తనయందు సంప్రీతుడయ్యాడని తెలుసుకొన్న అరుంధతి ఆ అంజనాద్రినాథుని ఈవిధంగా స్తుతించింది.

**భగవంతుని స్తుతి**: భక్తజన బాంధవా! దయానిధీ నన్ను రక్షించు. ఓ వేంకటాచలపతీ! లక్ష్మీనాథా! కేశవా! సర్వలోకవాసులకు ప్రత్యక్ష, పరోక్ష ఫలాలను నీవు తప్ప మరెవరు ప్రసాదిస్తారు? ఇహ పర ఫలప్రదాతవు నీవే.

ఈ జగత్తునకు సకల సౌభాగ్య సంపదలను ప్రసాదించే లక్ష్మీదేవి నీ వక్షస్థలంలో విరాజిల్లుతున్నది. నా పాదపద్మములందు ఉద్భవించిన గంగను పరమశివుడెల్లప్పుడు శిరస్సున ధరిస్తున్నాడు. శ్రీవేంకటాచలంపై నిత్య నివాసం చేసే దేవదేవోత్తముడవైన నీవు తప్ప జీవులకు దృశ్యా దృశ్య కర్మఫలాలను ప్రసాదించే మరొక దైవం కనపడుటలేదు.

వసిష్ఠపత్ని అరుంధతి ఆ శేషశైల శిఖామణిని ఈవిధంగా స్తుతించి ''ప్రభూ! నీవు నా తపస్సు వలన సంప్రీతుడవైతే లోకానికి ఉపకారం జరుగునట్లు తుంబురు తీర్థ మాహాత్మ్యాన్ని తెలియజేయండి'' అని ప్రార్థించగా శ్రీనివాసుడు సకల లోకవాసులు, బ్రహ్మాది దేవతలందరు వినుచుండగా ఇలా చెప్పాడు.

**తుంబురు (ఫల్గుణి) తీర్థం :**

అరుంధతి శ్రీనివాసుని తుంబురతీర్థ వైభవాన్ని చెప్పమని కోరగా శ్రీనివాసుడు ఇలా చెప్పాడు. అరుంధతీ! ఎప్పుడైనా తుంబురు తీర్థంలో స్నానం చేసినవారు నా దయ వలన పాపాలను పోగొట్టుకొని లక్ష్మీకటాక్షానికి పాత్రులౌతారనడంలో సందేహం



లేదు. నేనిక్కడ ప్రత్యక్షమైన ఫాల్గుణ పౌర్ణమి నాడు ఈ తుంబురు తీర్థంలో భక్తితో స్నానం చేసేవారికి కలిగే మహాఫలితాన్ని చెబుతాను విను. సకల తీర్థాలలో స్నానం చేసిన ఫలితం ఈ ఒక్క తీర్థంలో ఆరోజు స్నానం చేసిన వారికి కలుగుతుంది. ఈ తీర్థానికి లోకంలో 'ఫల్గుణి తీర్థం' అనే పేరు ప్రసిద్ధమౌతుంది.

బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, శూద్రులు, స్త్రీలు ఈ తీర్థంలో స్నానం చేయడం వలన వారి పాపాలు నశిస్తాయి. శుభాలు కలుగుతాయి. మనో వాక్కాయ కర్మలచే వారు చేసిన పాపాలన్నీ పూర్తిగా నశిస్తాయి. పురుషులు కాని, స్త్రీలు కాని ఏయే ఫలాలను కోరి ఇక్కడ స్నానం చేస్తారో ఆయా ఫలితాలను తప్పక పొందుతారు. ఇందుకు సందేహం లేదు.

పుత్రులను కోరువారు పుత్రులను, ధనమును కోరువారు ధనమును, ఆరోగ్యాన్ని కోరువారు ఆరోగ్యాన్ని, సంతానాన్ని కోరేవారు సంతానాన్ని పొందుతారు. ఈ తుంబురు (ఫల్గుణి) తీర్థంలో స్నానం చేసేవారికి కష్టాలన్నీ వెంటనే తొలగిపోతాయి. సిద్ధుల హస్తగతమవుతాయి. ఇక్కడ స్నానమాచరించి దానములు చేసేవారికి అనేకరెట్లు ఫలితం కలుగుతుంది.

నాకు ప్రీతితో చందన తాంబూలములను గాని, జలమును గాని సమర్పించేవారు నాకు మిక్కిలి ప్రీతిపాత్రులౌతారు. ఇది ముమ్మాటికీ సత్యమని చెబుతున్నాను. ఓ వరాననా! నీకీ సర్వోత్కృష్టమైన ధర్మాన్ని చెప్పాను. నీవు పతివ్రతా శిరోమణివై సత్సంతానవతివి కమ్ము'' అని శ్రీవేంకటేశ్వరుడు అరుంధతికి వరాన్ని అనుగ్రహించి అంతర్ధానం చెందాడు.

దీనిని నిశ్చల చిత్తంతో, శ్రద్ధాభక్తులతో చదివినా, వినినా, ధ్యానం చేసినా ఘోణ (తుంబురు/ఫల్గుణి) తీర్థంలో స్నానం చేసిన ఫలితాన్ని పొందుతారనడంలో ఎటువంటి సందేహము లేదు.

★★★

ధారావాహికం



# ముకుందమాల

- భువనేశ్వరి మారేపల్లి,
9550241921

**మాద్రాక్షం క్షీణపుణ్యాన్ క్షణమపి భవతో భక్తి హీనాన్ పదాబ్జే**
**మాశ్రౌషం శ్రావ్యబంధం తవ చరిత మపాస్యాన్య దాఖ్యాన జాతమ్ ।**
**మా స్మార్షం మాధవ త్వామపి భువనపతే చేతసాపహ్నువానాన్**
**మా భూవం త్వత్సపర్యా వ్యతికరరహితో జన్మజన్మాన్తరేపి ॥15 ॥**

ఓ లోకనాథా! నీ యొక్క పాదకమలముల యందు క్షణకాలమైనను భక్తిలేని పాపులను నేను చూడను. చెవికి ఇంపైన మీ చరిత్ర తప్ప ఇతరమైనవి వినను. ఓ శ్రియఃపతీ! నిన్ను తిరస్కరించేవారిని నా మనస్సుచేత అయినా కూడా తలవను. జన్మజన్మాన్తరముల యందు నీ కైంకర్యము కలిగి ఉండును గాక!

క్రిందటి శ్లోకంలో వరదా! అన్నట్లే ఇందులో కులశేఖరాళ్వార్లు ఓ మాధవా! అని స్మరిస్తున్నారు.

"మాధవ" అంటే ఏమిటి?

"బాంధవ విశేషమాహ మాతాపితృత్వమ్ శ్రియా సహస్య సూచయతి మాధవః"

అంటే లక్ష్మీదేవితో కలిసి మాతాపితృత్వమ్ అనే అత్యంత సన్నిహితమైన సంబంధం కలవాడని మాధవ అనే పదానికి అర్థం.

మరొక సూచకం కూడా ఉంది."మధు కులోద్భవత్వాద్వా ఇతి మాధవః" అంటే 'సూర్యవంశము నందు రఘువు అనే మహా రాజు వలె, యదుకులమునందు మధువు అనే ప్రసిద్ధమైన మహారాజు కలడు తద్వంశమున జన్మించినందున మాధవుడు అనే రెండవ అర్థం చెప్పుకోవచ్చు.

"మా కి ధవుడు అంటే లక్ష్మీదేవికి వల్లభుడు కాబట్టి మాధవుడు". అలాంటి లక్ష్మీదేవిని పురుష కారంగా కలిగినటువంటి పరమాత్మను కీర్తిస్తున్నారు.

స్వామీ! అనేక ప్రయత్నములు చేసి మంచిస్థితికి వచ్చినవాడైనా కూడా ఒక దుర్మార్గపు ఆలోచనా ప్రవృత్తి కలిగిన వాడి వలలో పడితే హీనస్థితికి పడిపోతాడు. అలాంటి సహవాసము ఎంతటి భక్తి కలవాడైనా చెడిపోవును. మంచివాని సహవాసం వల్ల దుష్టుడు సన్మార్గవర్తను డగుట కష్టం.

ధర్మక్షేత్రమైన కురుక్షేత్రము యొక్క స్పర్శచేత తన పుత్రుల మనసు యుద్ధము నుండి మారినదా అని ధృతరాష్ట్రుడు అడిగితే సంజయుడు నీ పుత్రుల స్పర్శచేత ఆ మహాక్షేత్రము పాడవ్వవలసినదే తప్ప వారి మనసు మారదు అని చెప్పెను.

**"మయి చానన్య యోగేన భక్తి రవ్యభిచారిణీ ।**
**వివిక్త దేశ సేవిత్వ మరతిర్జన సంసది" ॥**

భగవన్మార్గమునకు విరోధులైనవారిని విడవాలని అది ఒక గొప్పసాధనమని చెప్పారు భగవద్గీతలో. దుష్టసహవాసం ఎప్పటికైనా మనల్ని పాడుచేస్తుంది. పరమాత్మ యందు భక్తిలేని

వారిని క్షణమైనా చూడకూడదు. అలాంటి వారు సన్నిహితులైన, చుట్టాలయిన, సుతుడైనను వానిని త్యజించవలెను. హితము చెప్పినా రావణుడు వినలేదు కనుక సోదరుడైన కూడా విభీషణుడు విడిచిపెట్టేసాడు.

ఆత్మోజ్జీవనమునకు తగినవారితో మాత్రమే చేరవలెను. నమ్మాళ్వార్లు తమ ప్రబంధములో "ఆయే యివ్వులగత్తు" అను పాశురములో ఇలా ప్రార్థిస్తారు. స్వామీ! నన్ను శీఘ్రకాలమున తీసుకుని పొమ్ము, ఎందుకంటే ఇంకా కొంతకాలం ఇక్కడే ఉంటే నేను కూడా చెడిపోవుదును.

"ఆయే అనగా అమ్మ అని అర్థం. ఎందుకలా అన్నారంటే తండ్రికి నిగ్రహించడం తెలుసు. అమ్మకు అనుగ్రహించడం మాత్రమే తెలుసు.

అలాగే వినడానికి బాగున్నా శ్రావ్యముగా ఉన్నను భగవత్సంబంధము లేక భాగవత సమ్మతము కాక ఉండవు, ప్రయోజనము లేదు. భువనపతే – స్వామీ నీవు అణువులో అణువై మహత్తునకు మహత్తై ఉండగా లేదని చెప్పేవాడి సాంగత్యం హీనమైనది.

నీకు ఏమి కావాలి అని అడుగుతావేమో? నాలుగు వరములను అడుగుతున్నారు ఏమిటంటే?

**"పాపాత్ముల సాంగత్యం చూడకుండా ఉండడం.**
**పరమాత్మ యొక్క సంబంధం లేని కథలు వినకుండా ఉండడం.**
**పరమాత్మను ద్వేషించే వారిని స్మరింపకుండా ఉండడం.**
**ప్రతి జన్మలోను తన యొక్క కైంకర్యమును కలిగి ఉండడం."**

అనేవి కులశేఖరాళ్వార్లు పరమాత్మకు దగ్గరవుతున్నప్పుడు తగిలే విరోధములను గురించి వాటిని దాటి పరమాత్మను చేరి తరించడం గురించి తెలియజేస్తున్నారు.

భగవంతునితో మనస్సు యోగం చెందినప్పుడు ఆయన్ను అతి సమీపంగా చూడవచ్చు. హృదయ మధ్యంలో చూడవచ్చు. కానీ ఒక ముఖ్య విషయం. ఈ యోగం ఎంత గాఢతరమవుతుందో అంతగా మనస్సు బాహ్య వస్తువుల నుండి వైదొలుగుతుంది. ఇందుకు తార్కాణమే బిల్వమంగళుడు.

పూర్వజన్మలో ఇతడు గొప్ప సన్యాసి. శ్రీకృష్ణుడికి అమితభక్తుడు. శ్రీకృష్ణునితో భావైక్యము పొందినవాడు. సన్యాసిగా వుంటూ ఆయన అనేక భాగవత సప్తాహాలు చేస్తుండేవాడు. ఆ సమయంలో వచ్చిన భక్తులకు కష్టం కలుగకుండా, శ్రీకృష్ణ ప్రసాదాన్ని తయారు చేయించి పంచి పెడుతూ వుండేవాడు. అలాంటి ఒకానొక సమయంలో, సప్తాహం జరుగుతుండగా, మధ్యలో అతడి వద్ద వున్న ధనం అంతా ఖర్చు అయిపోయింది. ఇంకా ధనం కావలసి వచ్చింది. భక్తులను సేవించడానికి ఎక్కడ తనకు సంపద లభిస్తుందా! ఎవరు తనకు ధన సహాయం చేస్తారా! అని దాతల కోసం వెదుకసాగాడు. అలా వెదుకుతూ వెళుతుండగా కొద్దిదూరంలో, యవ్వనంలో 18 వ యేట చనిపోయిన ఒక రాకుమార్తె శరీరాన్ని దహనం చేయడం కనిపించింది. ఆమె తల్లిదండ్రులు, బంధువులు దుఃఖంతో కార్యక్రమం పూర్తి కాకుండానే వెళ్లిపోయారు. ఆమె దేహం మీద ఎంతో విలువైన వజ్రా లతో కూడిన బంగారు నగలు అతడికి కనిపించాయి. అది చూసి అతడిలా అనుకున్నాడు. 'ఈ బాలిక శరీరంతో పాటు ఈ ఆభరణాలు దగ్ధమైతే ఏం ప్రయోజనం? నేను తీసుకుని వీటిని అమ్మగా వచ్చిన ధనంతో కృష్ణ భక్తులను సంతృప్తి పరుస్తాను' అని భావించి ఆమె పార్థివ శరీరంపై చేయి వేయబోయాడా సన్యాసి.

అంతలో సన్యాసి నివ్వెర పోయేటట్లుగా... "ఆగు మహానుభావా! ఇవి నీవు తీసుకోకూడదు. నీకు సంపద కావలసివస్తే, నా తండ్రి ఈ రాజ్యానికి రాజు కాబట్టి, ఆయన వద్దకు వెళ్లి నేను పంపానని చెప్పి ధనం అడుగు. ఆయనకు నమ్మకం కలగడం కోసం, నా శయన మందిరంలో తలగడ వద్ద వున్న పెట్టెలో, అఖండ సంపద వున్నదని చెప్పు. ఆ ధనాన్ని శ్రీకృష్ణుడి భక్తుల కోసం ఉపయోగించు" అని చెప్పింది. ఆ విధం గానే సన్యాసి మహారాజును కలిసి జరిగినదంతా చెప్పాడు. అది విని ఆశ్చర్యపోయిన రాజు చనిపోయిన రాకుమార్తె శయన మందిరం వెతికించాడు. ఆమె చెప్పినట్లుగానే, ఆమె శయనాగారంలో వున్న పెట్టెలో సంపద వుండడం చూసి, సన్యాసి మాటలు నమ్మి, మనఃస్ఫూర్తిగా ఆ సంపదనంతా సన్యాసికి యిచ్చివేశాడు.

సన్యాసి ఆ సొమ్మునంతా భాగవత సప్తాహంలో ఖర్చు చేసాడు. అయినా యింకా ధనం కావలసి వచ్చింది. అప్పుడు మళ్ళీ రాకుమార్తె శవం వద్దకు వెళ్లి, ఆమె వంటిమీద వున్న వజ్రాల కంఠహారాన్ని తీసుకున్నాడు. సన్యాసి అక్కడ నుండి లేస్తుండగానే, రాకుమార్తె ఆత్మ సన్యాసితో... "ఓ సన్యాసీ! నీవు చాలా పెద్ద తప్పు చేసావు. నీవు చేసినది శ్రీకృష్ణ భక్తుల కోసమే అయినా, నీ తప్పును నేను క్షమించలేకపోతున్నాను. నీవు చేసిన యీ పాపానికి మళ్ళీ మానవజన్మ ధరించి, కాముకుడవై, నీతిమాలిన జీవితం అనుభవిస్తావు. ఇదే నా శాపం" అని కోపంగా శపించింది.

తరువాతి జన్మలో ఆ సన్యాసి 'బిల్వమంగళుడిగా' జన్మించి, స్త్రీ లోలుడు అయ్యాడు. ఆ రాకుమారి 'చింతామణి' అనే వేశ్యగా జన్మించింది. ఆమెయే ఆయన గురువుగా చివరకు మోక్షమార్గం చూపించింది. అలా ఆ బిల్వమంగళుడు ఒక బ్రాహ్మణ కుటుంబంలో జన్మించి, చింతామణి అనే వేశ్య యొక్క గాఢమైన ప్రేమలో పడ్డాడు. ఆమెతో తన దేహవాంఛలు తీర్చుకుంటూ, ఆమె లేనిదే బ్రతకలేనని స్థితికి వచ్చాడు. భార్యాబిడ్డలను తృణీకరించాడు. యావదాస్తిని పోగొట్టుకున్నాడు. ఆ సమయంలో, బిల్వమంగళుడు యెంతగా చింతామణి వ్యామోహంలో కొట్టుకుపోయాడంటే, ఒకనాడు అతి పెద్ద తుఫాను వాతావరణంలో, తన తండ్రిగారి శ్రాద్ధకర్మలు ఆచరించీ ఆచరించగానే, చింతామణి పొందుకోరి, విరహం తట్టుకోలేక,

రాత్రివేళ ఆమె యింటికి చేరడానికి బయలుదేరాడు.

ఒకనదినిదాటవలసివచ్చింది.ఆతుఫానులోకొట్టుకువస్తున్న ఒక శవాన్ని, అది శవమని కూడా ఆలోచింపకుండా, దానినే ఆలంబనగా చేసుకుని ఆవలి ఒడ్డుకు వెళ్లి, అక్కడ చింతామణి యింటి ద్వారాలు మూసి వుండడంతో, గోడ ప్రక్కనుండి, ఇంకొక ఆధారంతో అది తాడు అనుకుని, దానితో ఆమె వుండే పై అంతస్తుకు చేరుకున్నాడు. ఆయన గోడ ఎక్కడానికి చేసుకున్న ఆధారం. అది ఒక నల్లత్రాచు. అది కూడా గమనించే స్థితిలో లేడు బిల్వమంగళుడు. ఆ సమయంలో, అంత భయంకర పరిస్థితులలో కూడా కామంతో రగిలిపోతున్న బిల్వమంగళుడిని చూసి చింతామణి "నీవు నా రక్త మాంసాలతో కూడిన యీ దేహం మీద యింత వ్యామోహం పెంచుకున్నావు. నీ ప్రాణాలను లెక్క చేయకుండా, తుఫానులో ఇంత సాహసం చేసి నా పొందు కోసం వచ్చావు. నా మీద చూపిస్తున్న యీ వ్యామోహంలో సహస్రపాలు అయినా, ఆ గోవిందుని మీద చూపించితే, నీకు జన్మ సార్ధకం అవుతుంది. నీవు వెంటనే బృందావనం వెళ్లి ఆ శ్రీకృష్ణుని దర్శించి, అలౌకిక ఆనందం అనుభవించు" అని దిశా నిర్దేశం చేసింది చింతామణి.

ఆ విధంగా బయలుదేరిన బిల్వమంగళుడిలో ఇంకా కామవుపాలు నశించలేదు. దారిలో, తాను బయలుదేరిన లక్ష్యం మర్చిపోయి, ఒక స్త్రీతో తన కామం తీర్చుకున్నాడు. తాను చేసిన పనికి తానే సిగ్గుపడి, యే స్త్రీతో అయితే, ఆయన ఆనందించాడో, ఆమె జడకు పెట్టుకునే పదునైన పరికరంతోనే, తన కళ్ళు ఊడబెరుక్కున్నాడు బిల్వమంగళుడు. ఆ విధంగా, ఇక తన జీవితంలో, మళ్ళీ బాహ్య ఆనందాలపై మనసు మరలకుండా, మాంస నేత్రాలు విసర్జించి, కనులముందు శ్రీకృష్ణుడే కదలాడేటట్లు కఠోర నిర్ణయం తీసుకుని అంధత్వాన్ని తనకు తానుగా ఆహ్వానించాడు.

రాధాకృష్ణుల సేవలో తపించి తరించాడు. రాధాకృష్ణుల లీలలు వర్ణిస్తూ వీణావాదనలో మైమరుస్తుంటే, ఇతర ఏ వాద్యాలు అవసరం లేకుండా పోయేవి.

బృందావనంలో బిల్వమంగళుడికి (లీలాశుకునికి) కృష్ణ పరమాత్మ స్వయంగా, ప్రతిరోజూ ప్రసాదం తినిపించి, సురక్షితమైన ప్రదేశంలోకి తీసుకువెళ్లి వదిలేవాడు. అయితే, ఒకరోజు తనను నడిపిస్తున్న వ్యక్తి మధుర మనోహరంగా వేణువు వాయిస్తుంటే, సర్వం మరచిపోయి వినసాగాడు లీలాశుకుడు.

వెంటనే ఆనందం పట్టలేక, కృష్ణుడి చేయి పట్టుకున్నాడు లీలాశుకుడు ఆప్యాయంగా. ఇక వదలను అన్నట్లు, నీవెవరో నాకు తెలిసిపోయింది అనే భావనతో. లీలామానుష విగ్రహుడైన గోవిందుడు కూడా, ఒక్కసారి లీలాశుకుని హస్తాన్ని స్పృశించి, మధురంగా నవ్వుతూ, అక్కడ నుండి పరుగెత్తుకుని వెళ్ళిపోయాడు.

బిల్వమంగళుడు (లీలాశుకుడు) ఎంతో ఆనందంగా, "గోవిందా! నీవెవరో నాకు తెలిసి పోయిందిలే! నా చేతిని వదిలి నీవు పరుగెత్తినా, నా గుండెలలో నుండి నిన్ను వెళ్లనీయనుగా!" అంటూ ఆయన కీర్తనలు పాడుకుంటూ మురిసిపోసాగాడు. కాలక్రమేణా లీలాశుకుడు ఎన్నో కీర్తనలు సృజించాడు. అన్నింటిలో రాధాకృష్ణుల ప్రేమను ఆవిష్కరించాడు.

**వివిధ మూలాల ఆధారంగా బిల్వమంగళుని చరిత్ర :**

కేరళలోని శుకపురంలో ఎనిమిదవ శతాబ్దంలో ఒక సంపన్న శాస్త్రీయ శైవ బ్రాహ్మణ కుటుంబంలో రామదాసుకు ఏకైక పుత్రునిగా జన్మించిన బిల్వమంగళ అయ్యర్ చిన్నతనంలోనే తండ్రి ప్రోద్బలంతో సకల శాస్త్రాలు చదువుకున్నాడు. కానీ కొంతకాలం తర్వాత చిన్నతనంలోనే తండ్రి మరణించడం వల్ల చెడు సహవాసం వల్లో, అతడికి వయస్సుతో బాటు సహజంగా పెరిగే అరిషడ్రిపుల ఒత్తిడుల వల్లో – వాటిలో ముఖ్యంగా కామానికి దాస్యుడవ్వడం వల్లనో స్త్రీ సాంగత్యానికై ఎక్కువగా చొరవ చూపేవాడట.

అప్పుడు చింతామణి సాంగత్య ప్రభావం వల్లనో లేక దైవనిర్ణయం వల్లనో ఎట్లాగో బృందావనం చేరుకొని బాలకృష్ణుని చూసి అతనితో గడపాలన్న బలమైన వాంఛ కలిగింది. కానీ దారి గానక ఆకలితో అటునిటు తిరుగుండగా ఒక చిన్న కుర్రాడు గోవుల కాపరిగా పరిచయం చేసుకుని పాలిస్తూ అతనికి తోడై అతడి అప్పటి దీనావస్థలో తోడుగా నిలిచి బిల్వమంగళుడి మనస్సుకి ఆతడి సాంగత్యముతో స్వాంతనాన్ని చేకూర్చాడు. మెల్లగా అతని సాంగత్యప్రభావం వల్ల బిల్వమంగళుడి మనసులోని దేహ చింత తీరి చింతామణి స్థానాన్ని ఈ కుర్రాడు క్రమంగా ఆక్రమించి అతడిని విడిచిపెట్టి క్షణమైనా ఉండలేనంతగా మారిపోయాడు.

చింతామణి ఉపిరి పోసి ఉహ నొసగిన బృందావనం చేరుకొని బాలకృష్ణుని చూడాలన్న కాంక్ష రోజు రోజుకి ప్రబలతరమై దానిని ఎట్లా తీర్చుకోవాలో తెలియక తికమక పడుతున్న సమయాన బృందావనం వెళ్లాలనుకుంటున్నావా, నేను నిన్ను బృందావనానికి తీసుకెళ్తానని' ఆ బాలుడు, ఒక కర్ర అంధుడైన బిల్వమంగళుని చేతికిచ్చి దాని రెండవ వైపు అతడు పట్టుకుని నెమ్మదిగా నడిపించుకుంటూ నందబాలుని కథలు చెబుతూ బృందావనానికి తీసికెళ్ళాడట.

శుకపురంలో పుట్టిన బిల్వమంగళుడు శుకమహర్షి భాగవత కథలో వర్ణించినట్లు బాలకృష్ణుని లీలలు మనోహరంగా మధురంగా వర్ణించే ఇచ్ఛ ఉండడంవల్లనే అనుకుంటా 'లీలాశుకుడ'నే పేరుతో 'శ్రీకృష్ణకర్ణామృతమ్' వ్రాశాడు.

**కస్తూరీ తిలకం లలాటఫలకే వక్షస్థలే కౌస్తుభం**
**నాసాగ్రే నవమౌక్తికం కరతలే వేణుం కరే కంకణం**
**సర్వాంగే హరిచందనం చ కలయమ్ కంఠేచ ముక్తావళిం**
**గోపస్త్రీ పరివేష్టితో విజయతే గోపాల చూడామణి**
**(శ్రీకృష్ణకర్ణామృతం - 2- 109)**

అని బిల్వమంగళుడు ఆ ముకుందు మోహన రూపాన్ని శ్రీకృష్ణకర్ణామృతంలో వర్ణించే యత్నం చేశాడు. 'విశాలమైన నుదుటన కస్తూరి తిలకం, వక్షస్థలమున కౌస్తుభమణి, ముక్కు చివరన కొత్త ముత్యం, చేతిలో వేణువు, చేతులకు కంకణాలు, తనువంతా శ్రీచందనం, కంఠములో ముత్యాలహారం, చుట్టూ గోపికలతో ప్రకాశిస్తున్నాడు ఆ గోపాల చూడమణి'.

ఈ శ్లోకం గాన గంధర్వుడైన మహానుభావుడు ఘంటసాల గారి మధుర గాత్రంలో ఆంధ్రదేశమంతటా మారుమోగిన "పాండురంగమహత్యం" సినిమాలోని "జయ కృష్ణా ముకుందా మురారే" అనే పాటలో సమయోచితంగా, సందర్భోచితంగా వాడిన శ్లోకమిది.

**అఙ్గనా మఙ్గనా మన్తరే మాధవో**
**మాధవం మాధవం చాన్తరేణాఙ్గనా ।**
**ఇత్థమాకల్పితే మణ్డలే మధ్యగః.**
**సఞ్జగౌ వేణునా దేవకీనందనః ॥**
**(శ్రీకృష్ణకర్ణామృతం – 2– 35)**

'ఇరువురు స్త్రీలమధ్య మాధవుడు, ఇరు మాధవ రూపులమధ్య ఒక్కొక్క స్త్రీ గుంపులుగా విడి వారందరి నడుమ దేవకీనందనుడు వేరొకడుగా నిలిచి మధురముగా వేణు గానముచేసెను.'

లీలాశుకుడు ఒక గొప్ప వాగ్గేయకారుడు మరియు శ్రీ కృష్ణ కర్ణామృతం రచన చేసిన మహాకవి. ఇతడు ఆంధ్రప్రదేశ్ లోని కృష్ణా జిల్లా శ్రీకాకుళం ప్రాంతంలో నివసించేవాడని ప్రతీతి. ఇతడు రచించిన కృష్ణ కర్ణామృతంలోని శ్లోకాలు గానానికి, నృత్యానికి, అభినయానికి, చిత్రలేఖనానికి, శిల్పానికి ఉపయోగపడే రచనలుగా చెప్పవచ్చును.

శ్రీ కృష్ణకర్ణామృతం మూడు ఆశ్వాసాల భక్తి కావ్యం. మూడింటిలోను 110 చొప్పున శ్లోకాలున్నాయి. మొదటి ఆశ్వాసంలో శ్రీకృష్ణుని సాక్షాత్కారం, రెండవ ఆశ్వాసంలో శ్రీకృష్ణుని వివిధ లీలా విశేషాలు, మూడవ ఆశ్వాసంలో శ్రీకృష్ణుని జీవితంలోని అనేక ఘట్టాలు వర్ణించ బడ్డాయి. దీనిలోని శ్లోకాలను సంగీత సభలలో రాగమాలికలుగా గానం చేయడం పరిపాటి.

"శ్రీకృష్ణకర్ణామృతం" గ్రంథకర్త లీలాశుకుడు. ఈయనకే 'బిల్వమంగళుడు' అనే మరో పేరు కూడా ఉంది. ఈయన ఏ ప్రాంతం వాడో ఏ కాలం వాడో స్పష్టంగా తెలియటం లేదు. అయితే ఈ "శ్రీకృష్ణ కర్ణామృతం" లోని శ్లోకాలు 14వ శతాబ్దం నుంచీ ఇతర గ్రంథాలలోనూ, శాసనాలలోనూ కనబడుతున్నాయి. అందుకని లీలాశుకుడు 11వ శతాబ్ది నుంచీ 14 వ శతాబ్ది మధ్యలో ఉండి ఉంటాడని ఊహిస్తున్నారు. ఈ విధంగా చూస్తే లీలాశుకుడు జయదేవుడి కంటే గూడా ప్రాచీనుడనే చెప్పాలి. ఈ లీలాశుకుడు ఆంధ్రదేశం వాడనీ, వంగదేశం వాడనీ, మలయాళదేశం వాడనీ రకరకాల వాదాలున్నాయి. అయితే కృష్ణభక్తుడైన చైతన్య మహాప్రభువులు ఆంధ్రదేశ యాత్రలో కృష్ణానదీ తీరంలో ఒక గ్రామంలో ఉన్నప్పుడు ఈ కృష్ణకర్ణామృత గానం విని ఆనందభరితుడై దానికి నకలు ప్రతి రాయించుకుని తనతో తీసుకువెళ్ళి వంగదేశంలో ఈ గ్రంథం ప్రాచుర్యంలోకి తెచ్చారని చైతన్య చరితామృతంలో చెప్పబడి ఉంది.

బిల్వమంగళుడి ప్రేమాయుత భక్తికి మెచ్చి కృష్ణుడు తన చేతులతో అతడి కనులపై వ్రాసి అతడికి పూర్వ దృష్టిని ప్రసాదించి ధన్యుడిని చేసాడట. అప్పుడతడు తన నిజనేత్రాలతో ఆ మందస్మిత నీలమేఘశ్యాముడిని, సుగుణధాముడిని, దీనజనోద్ధారుణ్ణి, గాంచి తరించి అమితానందాన్ని అనుభవించాడట.

ఈ గ్రంథంలోని శ్లోకాలన్నీ 'ముక్తక' రూపంలో ఉన్నాయి. అంటే అన్ని శ్లోకాలూ స్వతంత్రంగా సమగ్రమైన అర్థాన్ని అందిస్తాయన్నమాట. కథకోసం, భావంకోసం ముందు వెనకల శ్లోకాలు చూడక్కర్లేదు. ఈ గ్రంథం అద్భుతమైన వేదాంత, సాహిత్య, సంగీత, భక్తి, వ్యాకరణ, ఛందో విషయాల సమాహారమని చెప్పవచ్చు. ఇది కేవలం కర్ణామృతమే కాదు. కరణామృతం. అంతఃకరణామృతం కూడా. ఈ కావ్యంలోని సచేతనాలైన గోవులు, గోపాలురు, గోపికలు మాత్రమే కాకుండా గృహాలు, స్తంభాలు, గజ్జెలు, పూసలు, మణులు, వెన్నముద్దలు, పాలు, పెరుగు, కుండల వంటి జడపదార్థాలు కూడా ఎంతో చైతన్యవంతంగా మన కళ్ళ ఎదుట సాక్షాత్కరించటం మరో విశేషం. కృష్ణుడు, గోకులంలో ఆడుకునే బాలగోపాలునిగానో, గోపకాంతలకు ఆరాధ్యుడైన లోకోత్తర శృంగార పురుషుడిగానో మాత్రమే ఈ కావ్యంలో మనకు దర్శనమిస్తాడు. లీలాశుకుని మధుర రచన 'శ్రీ కృష్ణ కర్ణామృతమ్' ఉత్తమ భక్తి కావ్యంగా సాహితీ లోకంలో నేటికీ భాసిస్తోంది.

హే జగన్నాథా! మాధవా! నీ పాదారవిందములయందు క్షణమైనను భక్తి నిలుపని పుణ్యహీనులను కంటితో చూడను. చెవికింపైన బంధము కలదయినను చరిత్రము తప్ప వేరొక కథాసందర్భమును చెవితో వినను. (ఈ రెండింటిచేత జ్ఞానేంద్రియ నిగ్రహమును సూచించిరి.) మానసికముగా నీ అస్తిత్వమును అంగీకరింపని వారలను (అసత్పురుషులను) నేను స్మరింపను. దీనిచే మనో నిగ్రహము సూచింపబడినది.) జన్మజన్మాంతరములందును నీ కైంకర్యములేని మనుగడను కలిగియుండను. (దీనిచే కర్మేంద్రియ నిగ్రహము సూచింప బడినది.)

బిల్వమంగళుని వలె, భక్తినొసంగమని ప్రార్థించి, కులశేఖరులు ఆ భక్తి కలుగుటకు ప్రతిబంధకముగా ఉండు పాపములను తొలగించుటకై, కర్మేంద్రియ, జ్ఞానేంద్రియ మనస్సులచే సాధింపదగు శమ దమాది సంపత్తిని ఇందు వివరించుచున్నారు.

**ఓం నమో భగవతే వాసుదేవాయనమః**

ధారావాహికం



# ధనుర్విద్యా ప్రవీణుడు, వీరుడు అర్జునుడు

– కౌతా నిర్మల

**గత సంచిక తరువాయి**

ద్వారకానగరంలో అర్జునుడు శ్రీకృష్ణుని భవనంలో కొంతకాలం అతిథిగా ఉన్నాడు. ఆ సమయంలో కిరీటి బలరామకృష్ణుల సోదరి అయిన సుభద్రను చూశాడు. మొదటి చూపులోనే ఆమె పట్ల అతనికి ప్రేమ కలిగింది. సుభద్ర పట్ల రోజురోజుకూ ప్రేమను పెంచుకోసాగాడు. ఆ విషయాన్ని, అర్జునుడి ఆంతర్యాన్ని శ్రీకృష్ణుడు గ్రహించాడు. సాధువు రూపంలో వచ్చిన అర్జునునికి పరిచర్యలు, సేవలు చేయటానికి సుభద్రను నియమించాడు బలరాముడు. ఆ సాధువు అర్జునుడే అని తెలుసుకున్న సుభద్ర మనస్సులో ప్రేమ మరింత పెంపొందింది. అర్జునుని కోరికను తెలుసుకున్న శ్రీకృష్ణుడు తన సోదరిని అర్జునుడు వివాహమాడటానికి అంగీకరిస్తాడు. బలరాముడు సుభద్రను అర్జునునికిచ్చి వివాహం జరిపించటానికి సుముఖంగా లేడన్న విషయాన్ని తెలుసుకున్న శ్రీకృష్ణుడు ఆమెను తీసుకెళ్ళి వివాహం చేసుకోమని అర్జునుడికి సలహా ఇస్తాడు.

సుభద్రను అర్జునుడు అపహరించాడన్న విషయం బలరామునికి తెలియగానే అమిత క్రుద్ధుడయ్యాడు. అర్జునుని చర్యకు మండిపడ్డాడు. అర్జునుని ఎదుట నిలిచి ప్రతిఘటించబోగా శ్రీకృష్ణుడు తన సోదరుని కోపాన్ని శాంతింపచేశాడు. తమ సోదరి సుభద్ర కోరికను తెలిపి, తన సోదరునికి అనేక విధాలుగా నచ్చచెప్పి అతని కోపాన్ని తగ్గించి, సుభద్రా అర్జునుల వివాహానికి బలరాముని సుముఖుడిగా చేశాడు. ద్వారకాపట్టణంలో సుభద్రా అర్జునుల కళ్యాణం వైభవంగా జరిగింది.

ద్వారకా పట్టణంలో ఒక బ్రాహ్మణుడు ఉండేవాడు. అతనికి సంతానం కలిగినా బిడ్డలు దక్కకుండా చనిపోవడంతో, చనిపోయిన పుత్రుడి మృతకళేబరాన్ని తీసుకువచ్చి, రాజద్వారం వద్ద ఉంచి, రోదిస్తూ 'నాకు పుట్టిన ఎనిమిదిమంది సంతానంలో ఒక్కడు కూడా మిగలలేదు. ఇప్పుడు ఈ తొమ్మిదో బిడ్డ కూడా శవమయ్యాడు. రాజు హింసకు, దుశ్చర్యలకు పాల్పడితే, బ్రాహ్మణులను పీడించేవాడు, లోభి అయితే, ఆ రాజ్యంలోని ప్రజలు దారిద్ర్యం, దుఃఖం, కష్టాలతో బాధింపబడతారు' అంటూ గట్టిగా విలపించసాగాడు విప్రుడు అమిత దుఃఖంతో.


ఆ సమయానికి అర్జునుడు రాజద్వారం వద్దకు వచ్చాడు. బాధతో రోదిస్తున్న విప్రుడిని చూశాడు. "బ్రాహ్మణోత్తమా! మీరు ఎందుకు ఇంతగా విలపిస్తున్నారు? మీ చెంతన బాలుని కళేబరమేమిటి? ఈ బిడ్డ అన్యాయంగా మృత్యువుకు గురయ్యాడా? మీకీ పరిస్థితి తెచ్చిందెవరు? మిమ్మల్ని పుత్రశోకం నుంచి, ఆవేదన నుంచి ఊరడించేవారు లేరా? మీ మాటలు నేను విన్నాను. మిమ్మల్ని నేను కాపాడుతాను. మీ బిడ్డలను నేను కాపాడతాను. మీకు మాట ఇస్తున్నాను. మీ సంతానాన్ని నేను కాపాడలేకపోతే నేను ప్రాయోపవేశం చేస్తాను" అని శపథం చేశాడు.

ఆ మాటలకు అసంతృప్తిగా పలికాడా బ్రాహ్మణుడు. "శ్రీకృష్ణుడు, అనిరుద్ధుడు, ప్రద్యుమ్నుడు, సంకర్షణుడు లాంటివారే కాపాడలేకపోయారు. నువ్వేం చేయగలుగుతావు?".

ఆ విప్రుని నిరాశకు, ఆ మాటలకు మనస్సు వికలమవగా తనను తాను సంబాళించుకుంటూ పలికాడు అర్జునుడు. "నేను నువ్వు చెప్పిన వీరులలో ఎవరినీ కాను. నేను శ్రీకృష్ణుడి భక్తుడను. శ్రీకృష్ణుడు స్వయంగా చేయని పనిని ఆయన నాచేత చేయిస్తాడు. నేను ఆయన అనుగ్రహము, శక్తి ద్వారా చేయగలను. నేను అర్జునుడను. గాండీవ ధనుర్ధారిని. నువ్వు ఎటువంటి అనుమానమూ పెట్టుకోవద్దు. మృత్యుదేవతను ఎదిరించి నీ బిడ్డను నేను బ్రతికించి తెచ్చి నీకు అప్పగిస్తాను".

శ్రీకృష్ణుడు అర్జునుడి మాటలు విని, భవిష్యత్తును తలచుకుని మందహాసం చేశాడు. బ్రాహ్మణుని భార్య గర్భవతి అయింది. ప్రసవ సమయం దగ్గరపడుతోందని తెలిసిన అర్జునుడు గాండీవాన్ని ఎక్కుపెట్టి సూతికాగృహం చుట్టూతా బాణాలను సంధించి ఎవరూ లోపలకు ప్రవేశించకుండా బాణాలతో దిగ్బంధం చేశాడు. బ్రాహ్మణుడి భార్యకు పండంటి పుత్రుడు కలిగాడు. ఆ పసికందు క్యార్ క్యార్ మని ఏడుస్తూనే అదృశ్యమయ్యాడు. ఆ విషయం తెలిసిన బ్రాహ్మణుడు దుఃఖిస్తూ కృష్ణుని వద్దకు వచ్చాడు.

"నేను మూర్ఖుడను. అర్జునుడు చెప్పిన మాటలను నమ్మాను. భగవంతుడయిన మీరే నా పుత్రులను రక్షించలేకపోతే, ప్రగల్భాలు పలికిన అతడి మాటలను నేనెలా నమ్మాను? అది నా తెలివితక్కువతనం" బాధగా పలికాడా విప్రుడు.



ఆ బ్రాహ్మణుని మాటలను విన్న అర్జునుడు తనకిది పరీక్షా సమయమనుకున్నాడు. అతడు కృష్ణునితో కాని, ఆ విప్రునితో కాని ఏమీ మాట్లాడకుండా యోగవిద్యను ఉపయోగించి అన్ని లోకాలకూ వెళ్ళాడు. అయితే ఎక్కడా బ్రాహ్మణుని బిడ్డల ఆచూకీ తెలియలేదు. ఎంత అన్వేషించినా ఫలితం దక్కలేదు. తిరిగి భూలోకానికి చేరుకున్నాడు. తాను విప్రునకిచ్చిన మాట ప్రకారం తాను చేయలేకపోయానని బాధపడుతూ అర్జునుడు ప్రాయోపవేశానికి సిద్ధపడ్డాడు. అగ్ని ప్రవేశం చేయబోతుండగా శ్రీకృష్ణుడు అర్జునుని ఆపేశాడు. ''అర్జునా! నీకు సమర్థత లేదని, ఇచ్చిన మాటను నిలబెట్టుకోలేక పోయాననీ కించపడకు. నువ్వు నాతో పద. మరణించిన బ్రాహ్మణుని పుత్రులందరినీ నీకు చూపిస్తాను. ఆ తర్వాత మనమిద్దరం ఎవరన్నదీ సమస్త జగత్తుకూ అర్థమవుతుంది''.

శ్రీకృష్ణుడు అర్జునుని వెంటబెట్టుకుని పడమటి దిశగా పయనించాడు. సప్త సముద్రాలను, సప్తద్వీపాలను, పర్వతాలను దాటి అంధకారంతో ఉన్న ప్రదేశానికి వెళ్ళాడు. ఆ తిమిరాంధకారంలో శ్రీకృష్ణుని రథం ముందుకు సాగలేదు. దివ్యతేజస్సుతో వెలిగే తన సుదర్శన చక్రాన్ని ముందు ఉంచగా, ఆ కాంతిలో తన రథాన్ని ముందుకు నడిపాడు శ్రీకృష్ణుడు. ఆ ప్రదేశాన్ని దాటిన తర్వాత మహాప్రకాశవంతమైన వెలుగు కనబడింది. ఆ కాంతిని చూడలేక అర్జునుడు కళ్ళు మూసుకున్నాడు. అటు పిమ్మట వారిద్దరూ సముద్రంలోకి ప్రవేశించారు. అక్కడ వారికి ధగధగలాడే తేజస్సును కలిగిన ఒక దేవాలయం కనిపించింది. ఆ దేవాలయంలోని స్తంభాలన్నీ బంగారంతో నిర్మితమై ఉన్నాయి. ఆ ఆలయంలో ఆదిశేషుని మీద పవళించిన విష్ణుమూర్తిని దర్శించారు వారిద్దరూ. అష్టసిద్ధులు, శ్రీసుదర్శన చక్రంతో, ఇతర ఆయుధాలు శరీరాకృతిని ధరించి విష్ణుమూర్తిని సేవిస్తున్నాయి. శ్రీకృష్ణుడు అర్జునుడు వినయపూర్వకంగా విష్ణువుకు నమస్కరించారు.

వారి ప్రణామాలు స్వీకరించిన విష్ణుమూర్తి వారితో ఇలా అన్నాడు. ''కృష్ణార్జునులారా! మీరిద్దరూ నర నారాయణులు. మీరు నా ఆత్మస్వరూపులు. మీ ఇద్దరినీ ఇక్కడకు రప్పించాలనే నేను ఆ విప్రుని కుమారులను నా వద్దకు తెప్పించాను. భూలోకంలో మీరు చేయవలసిన కార్యములన్నీ ముగిసిపోయాయి. లోక కళ్యాణార్థం మీరు ఎన్నో పనులు చేశారు. ఇంక మీరు త్వరలో స్వర్గానికి చేరుకోండి''.

అర్జునుడు మరణించిన విప్రకుమారులను శ్రీహరి అనుమతితో సజీవంగా వెంటపెట్టుకుని భూలోకానికి తీసుకువచ్చాడు. ఆ బాలురనందరినీ విప్రునకు అప్పగించి, అతనికి తాను ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నాడు.

ఖాండవ దహన సమయంలో అగ్నిదేవుడు రగిలించిన జ్వాలల నుంచి తప్పించుకోవడానికి మయుడు అనే రాక్షసుడు పారిపోవటానికి ప్రయత్నిస్తున్న సమయాన అగ్నిదేవుడు ఆ దానవుడిని దహించి వేయటానికి అతనిని వెంబడించాడు. అగ్నిదేవునితో పాటు శ్రీకృష్ణుడు కూడా తన సుదర్శన చక్రంతో అతనిని వధించటానికి సిద్ధపడ్డాడు. అపుడు మయుడు తన ఆత్మరక్షణ కోసం అర్జునుని శరణు కోరాడు. అర్జునుడు అతడిని కాపాడతానని అభయమిచ్చాడు. అర్జునుని నుంచి శరణు లభించిన మయుడిని అగ్నిదేవుడు, శ్రీకృష్ణుడు విడిచిపెట్టేశారు. మయుడి ప్రాణాలు అర్జునుడి వల్ల నిలబడ్డాయి. అర్జునుడు తనకు చేసిన ఉపకారానికి బదులుగా ఏదైనా ఉపకారం చేయాలని అనుకుని అర్జునుని కోరుతాడు మయుడు. అప్పుడు అర్జునుడు మయునితో ''నన్ను కాదు భగవంతుడైన శ్రీకృష్ణుని సేవించు. ఆయనను సేవిస్తే నన్ను సేవించినట్లే'' అని చెప్పాడు. మయుడు ఎంతో ప్రావీణ్యత కలిగిన శిల్పి. శ్రీకృష్ణుడు మయుడి చేత ఒక అద్భుతమైన, సుందరమైన భవనాన్ని నిర్మింపచేసి పాండవులకు ప్రసాదించాడు.

ఒకసారి ఇంద్రుడు సభను తీర్చినపుడు అప్సరసలు తమ గాన, నాట్యాలను ప్రదర్శించసాగారు. అర్జునుడు ఊర్వశిని, ఆమె నాట్యాన్ని ఆసక్తిగా చూస్తున్నట్లుగా ఇంద్రుడు గమనించాడు. అప్పుడు ఇంద్రుడు చిత్రసేనునితో చెప్పాడు ''ఊర్వశిని ఈ రాత్రికి అర్జునుని మందిరానికి వెళ్ళమని చెప్పు''. చిత్రసేనుడు ఆ వార్తను ఊర్వశికి చెప్పాడు. ఇంద్రుని సందేశాన్ని అందుకున్న ఊర్వశి అమిత ఆనందపడింది. అర్జునుని మనోహర రూపం, అతని ముఖంలోని తేజస్సును ఊర్వశి మనస్సును ఎంతగానో ఆకట్టుకున్నాయి. చంద్రుడు వెన్నెలను కురిపిస్తుంటే, ఆ కాంతి, చల్లదనం మనస్సును ఉల్లాసపరుస్తూ అలరిస్తుంటే అతిసుందరంగా అలంకరించుకుని ఊర్వశి అర్జునుని ఏకాంతమందిరానికి వెళ్ళింది. తన శయనాగారంలోకి ఒంటరిగా ప్రవేశించిన ఊర్వశిని చూసి అప్రతిభుడయ్యాడు అర్జునుడు.

అర్జునుడు తల దించుకుని గౌరవంగా పలకరించాడామెను. ఊర్వశి ఇంద్రుని సందేశాన్ని వినిపించి, తన కోరికను నెరవేర్చమని వినయంగా, ప్రేమపూర్వకంగా అడుగుతూ అర్జునుని చెంత చేరింది.

**(ఇంకా ఉంది)**

శ్రీకృష్ణ పరమాత్మ ఆనందస్వరూపుడు. ఇష్టమైనవారికి జగన్నాటక సూత్రధారి. గిట్టనివారికి కపటనాటక సూత్రధారి. విలక్షణమైన వైరుధ్యాలతో మాయచేసే గమ్మత్తయిన వ్యక్తిత్వం కాబట్టే కృష్ణుడంటే అంత ఆకర్షణ. ఒకసారి చూస్తే ఇంత ఆకతాయి ఇంకెక్కడా కనిపించడు అనిపిస్తుంది. మరు క్షణంలోనే మన సమస్యలన్నిటికీ పరిష్కారాన్ని తెలిపే గురువు ఆయనే అన్నట్టు కనిపిస్తుంది. గోపబాలురతో ఆడినా పాడినా, గోవర్ధనగిరిని కొనగోటితో ఎత్తినా, భారతాన్ని బాధ్యతగా నడిపించినా ఆయన ప్రతి అడుగూ మానవ జీవితానికి మార్గనిర్దేశనం చేసేదే. అందుకే ఆయన చిన్ని కన్నయ్య.



# వందే కృష్ణం జగద్గురుం

**- శ్రీమతి రావూరి ఇందుమతి**

శ్రీ లామానుష విగ్రహుడు, జగన్నాటక సూత్రధారి, జగత్తునకు గురువు అయిన కన్నయ్య శ్రావణ బహుళ అష్టమి నాడు దేవకీదేవి అష్టమ గర్భమున ప్రవేశించిన జగన్నాథుడు శ్రీకృష్ణపరమాత్ముడు. జన్మిస్తూనే తన నిజరూప సందర్శన భాగ్యాన్ని జననీ జనకులకు కలిగించిన మురళీమోహనుడు. వారికి తన జన్మ కారణాన్ని వారి తక్షణ కర్తవ్యాన్నీ వివరించాడు. నందుని ఇంట నడయాడాడు. యదుకులాన్ని ఉద్ధరించాడు. బృందావనాన్ని ప్రేమతో నింపేశాడు. రేపల్లె రాగం తాళం రాజీవం చేశాడు. మరోవైపు దుష్టశిక్షణ, శిష్టరక్షణ చేసి మానవజాతిని ధర్మపథాన నడిచేలా చేశాడు. మానవుడే మాధవుడిగా ఎదిగి పరిపూర్ణ వ్యకిత్వం అంటే ఇదీ అని రేపటి తరాలకు చాటి చెప్పాడు. ప్రేమతో పిలిచినా, భక్తితో ధ్యానించినా, వైరంతో దూషించినా ఇలా ఏవిధంగా తనను ఆశ్రయించినా మోక్షమిచ్చే కరుణాసాగరుడు కన్నయ్య. జీవితంలో కష్టనష్టాలూ, సుఖదుఃఖాలూ, ఎత్తుపల్లాలూ ప్రతీదీ ఓ భాగమే అంటాడు. వాటన్నింటితో ఆనందాన్ని ఎలా వెతుక్కోవాలో తన జీవన విధానంతో ఆచరించి చూపిన జ్ఞాన సుస్వరూపుడు. గోకులంలో లీలలు చూపినా, యుద్ధం వద్దని రాయబారం నడిపినా, కురుక్షేత్రంలో వివశుడైన అర్జునుడికి గీతోపదేశం చేసినా, ప్రతీదీ ఓ మధుర ఘట్టమే. రేపటి తరానికి ఒక వ్యక్తిత్వ పాఠమే. అందుకే మానవజాతి కృష్ణ తత్వాన్ని వదల్లేకపోతోంది. ఆ ప్రేమతత్వాన్ని మనసా వాచా మననం చేసుకుంటోంది.

"అధరం మధురం నయనం మధురం... మధురాధిపతే అఖిలం మధురం..." అంటూ చిన్ని కన్నయ్య ముగ్ధమనోహర రూపాన్ని ఎంత కీర్తించినా తనివితీరదు. ఒక్క రూపమేనా, నల్లనయ్య, కన్నయ్య, వెన్నదొంగ, గోపాలుడు ఇలా ఆ మాధవుని పేరు తలచినా అలవికాని ఆనందమే. కన్నయ్య అంటేనే అందరి హృదయాలను దోచుకొనే మనసు దొంగ. నిజానికి కృష్ణునికి వశంకాని ప్రాణి ఏదీ లోకంలో లేదు. ప్రేమతో గోపికలూ భయంతో కంసాది దానవులూ బంధుత్వంతో యాదవ పాండవులూ ఇలా ఆ రసరమ్య రూపాన్ని పొందాలని ప్రయత్నించినవారే. తమని తాము అర్పించుకొని తరించినవారే. మార్గాలే వేరు. అందరి గమ్యమూ ఒక్కటే. కృష్ణుడిలో చేరిపోవడం. ఆయన్ను చేరుకోవడం అంటే కృష్ణతత్వాన్ని మన జీవనంలోకి ఆహ్వానించడమే. మన మనసును చైతన్యవంతంగా నిత్యనూతనంగా మహదానందంగా మలచుకోవడమే. జీవితంలో ఎదురైన ప్రతి పనిలో ఆనందాన్ని ఎలా వెతుక్కోవాలో యుగాలనాడే చేసి చూపించాడు ఆ శ్రీకృష్ణపరమాత్మ. బాలుడిగా పారాడుతూనే అమ్మపాలు తాగినంత సులువుగా పూతనను తుదముట్టించాడు. చేతిలో వెన్నముద్దను పెట్టుకున్నంత ఆనందంగా గోవర్ధనగిరిని మోసి గోకులాన్ని, గోపరివారాన్ని రక్షించాడు. పూబంతి విసిరినంత అవలీలగా పరమ రాక్షసుడైన కంసమామ గుండెల మీద పిడిగుద్దులు గుద్ది కంసపాపిని సంహరించాడు.

కాళీయుడి విషపు పడగల మీద కూడా ఆనందతాండవం చేసిన చిద్విలాసుడు. సర్వచరాచర భూతేశుడు, పరమపురుషుడు, జగదీశుడు, పరంధాముడు, జగన్నాటక సూత్రధారి, గోపకులమంతా వారిస్తున్నా కాళీయుని పడగలపైన నాట్యమాడి కాళీయుని మదము నణచివేసిన జగన్నాథుడు ఆ శ్రీకృష్ణ పరమాత్మ. కాళీయుని భార్యలైన నాగాంగనలు శ్రీకృష్ణుని నుతించు నుతులకు దయామయుడైన కన్నయ్య విడిచి ప్రాణములతో ఇటనుండి పొమ్మని దయ తలచాడు. కాళీయుని భార్యలు "మమ్ము బెండ్లి సేయు మా ప్రాణ వల్లభు ప్రాణమిచ్చి కావుము దయానిధీ" అని ప్రార్థింపగా కాళీయునికి అభయమిచ్చి ఆతనిని ఆ మడుగునుండి సజీవముగా పంపివేసెను.

వేలాదిమంది రాజుల సమక్షంలో తనను అగ్రపీఠం మీద కూర్చోపెట్టినా, తన కళ్ళముందే ద్వారకాపట్టణం సంద్రంలో కుంగిపోతున్నా రెండూ కర్మననుసరించి వచ్చిన ఫలితాలే అంటాడు. రెండింటినీ అదే ఆనందంతో స్వీకరిస్తాడు. సమస్యలు తలెత్తినప్పుడు అదే నవ్వు, విజయం తరువాత అదే దరహాసం. ఆ నవ్వే కృష్ణతత్వం. సంసారాన్ని వీడడు. ఏదీ త్యాగం చేయడు. కష్టాలు ఎదురైనప్పుడు కూడా సంతోషంగా ఎలా ఉండాలో తేలికగా చేసి చూపించిన మానసచోరుడు. లీలావినోది. లీలానాటక సూత్రధారి. జగద్గురువు. గోవిందుడు యదుకుల చింతామణి.

జీవితం అంటే ఏమిటి? అని ప్రశ్నించుకునే మానవులకు అది బంధాలతో అల్లుకుంటుందనీ, బాధ్యతలతో నిండి ఉండివుంటుందనీ, శిఖరాలను చూపిస్తుందనీ, లోతుల్లోకి కూడా తోసేస్తుందనీ తెలిపాడు. ఎలా జీవించాలో, జీవితాన్ని ఎలా అందిపుచ్చుకోవాలో ఆచరించి చూపాడు. అందుకే కృష్ణుడి జీవితమంతా మానవాళికి ఓ విలువైన సందేశం. నందనందనుడు నమ్మి చేరినవారిని కాదన్న సందర్భమే లేదు. ఓవైపు ప్రేమను పంచుతూనే మరోవైపు ధర్మాన్ని నిలబెడతాడు. ద్రౌపదిని నిండు సభలో పదుగురెదుట పరాభవించిన సందర్భములో కృష్ణుణ్ణి నమ్మి వేడుకున్నప్పుడు ఆమెకు వలువలనిచ్చి మానసంరక్షణ చేశాడు. తనను నమ్మినందుకు మనిషిగా పూర్ణత్వం ఎలా సాధించాలో మొత్తం మానవజాతికి చెప్పకనే చెప్పాడు. కన్నయ్య దేవుడు కాబట్టి ఆయన జీవితం అంతా ఆనందంగానే సాగిందనుకుంటే పొరపాటే. కృష్ణపరమాత్మ సాక్షాత్తు శ్రీమహావిష్ణువు అవతారమే అయితే అవచ్చు. ఆయనలో దేవతాంశ ఉండి ఉండొచ్చు. కానీ ఇవేవీ దేవకీసుతుడిని దేవుడిగా నిలబెట్టలేదు. కేవలం ఆయనలోని స్థితప్రజ్ఞత, వర్ణించనలవి కాని వ్యక్తిత్వమే గోపాలుణ్ణి, గోవిందుణ్ణి చేశాయి. మానవ రూపంలో జన్మించినప్పటికీ మాధవుడిగా నిలిపాయి. యుగ యుగాలు గడిచినా ఆయన రూపాన్ని మన మనసుల్లో సుస్థిరం చేశాయి.

**నల్లనివాడు పద్మనయనంబులవాఁడు కృపారసంబు పైఁ**
**జల్లెడువాఁడు మౌళి పరిసర్పిత పింఛము వాడు, నవ్వురా**
**జిల్లెడు మోమువాఁడొకఁడు చెల్వల మానధనంబుఁ దెచ్చెనో**
**మల్లియలార! మీ పొదల మాటున లేఁడు గదమ్మ చెప్పరే!**

ఈ పద్యం నాటికీ, నేటికీ ఏనాటికీ కూడా ఆబాల గోపాలాన్ని చదివింపచేస్తుంది ఆయన రూపం. పోతన భాగవతంలో ప్రతి స్కంధం "లలితస్కంధం గృష్ణమూలంగా, మంజులతా శోభితంగా, ఇక్షురస పానంగా మధురాతి మధురంగా" ఉంటుంది. దశమస్కంధం ఎన్నిసార్లయినా చదివింపజేస్తుంది. భాగవతం భక్తి ముక్తి దాయకం. అలాంటి భాగవతంలో కృష్ణతత్వం గోచరిస్తుంది.

శ్రీకృష్ణుడి జీవితం ఆద్యంతం మానవాళిని జాగృతం చేసే గీతాపాఠమే. 'యద్భావం తద్భవతి'గా నిలిచిన పూర్ణజ్ఞాన స్వరూపమే! నిజానికి కృష్ణుడిని అనేకులు అనేక విధాలుగా అర్థం చేసుకున్నారు. అనుభూతి చెందారు. దుర్యోధనుడి మాటల్లో చెప్పాలంటే నవ్వుతూ తిరిగే అసలు సిసలైన మోసగాడు. ఏదైనా చేయగల సమర్థుడు. వయోభేదం లేకుండా ఆడి పాడగల నేర్పరి. కృష్ణుడంటేనే ప్రేమ. కృష్ణుడంటే భక్తి, ముక్తి. కృష్ణుడెక్కడ ఉంటే అక్కడ భక్తి, ముక్తి, ప్రేమ ఉంటాయి.

దుర్యోధనుడికి కృష్ణుడి మీద సరైన అవగాహన లేకపోవడమే కృష్ణునితో వైరం. దుర్యోధనుడు పైవిధంగా తలపోస్తూ కన్నయ్యను తలపోస్తుంటాడు. కృష్ణుడు ప్రేమతో ఎక్కడ ఉన్నా, ఎవరితో ఉన్నా భక్తికి, ప్రేమకు వశుడే. ఇది చిన్ననాటి ప్రేమికురాలు రాధమ్మ

అనుభూతి. దేవదేవుడైన శ్రీకృష్ణుణ్ణి మించిన బలం, బలగం మరొకటి లేదు. ఆయనుండగా వేరే అవసరం రాదు కూడా . ఇదీ అర్జునుడి నమ్మకం. కృష్ణుడు పరిపూర్ణమైన విశ్వంలాంటివాడు. సూర్యచంద్రులు, గ్రహాలు అన్నీ అందులో కన్పిస్తాయి. ఎవరు ఏది కోరుకుంటే, దేన్ని చూడాలనుకుంటే అవే కన్పిస్తాయి కృష్ణరూపములో. కృష్ణతత్వమూ అంతే.

కన్నయ్యకు బంధాలంటే అమితమైన ఇష్టం. అందుకే ఆయన అందరికీ బంధువే. ప్రతి బంధాన్నీ వెన్నముద్దల్లా అపురూపంగా ఒడిసిపట్టుకుంటాడు. బంధుత్వాలను ఎలా కొనసాగించాలో చెప్తాడు. బంధాలు మనకి బంధనాలు కావనీ, ఆయా రూపాల్లో భగవంతుడేననీ గ్రహించుకుంటూ భాగవత సూత్రాన్ని అలవోకగా వివరించాడు. మురళీగాన లోలుడు కదా. ఆ గానం ఎంత మధురమో ఆయన ఉపదేశం అంతే సమ్మోహనం. మురళీమోహనుడు అవతారపురుషుడే అయినా ఆయనకు అమ్మంటే ఎనలేని ప్రేమ.అమితబలశాలి అయినా అమ్మచేతి మూరెడు తాడుకు కట్టబడ్డాడు. అందుకే పోతన తన భాగవతంలో చిన్నికన్నయ్య లీలలను ఇలా వర్ణిస్తుంటాడు.

**చిక్కడు సిరి కౌగిటిలో**
**చిక్కడు సనకాదియోగి చిత్తాబ్జములన్**
**చిక్కడు శృతిలతా కావలి**
**జిక్కెనతండు లీల దల్లిచేతన్ రోలన్!**

యోగులకు తపస్సులకు సైతం అందలేదు. అమ్మవారి బిగి కౌగిటనూ ఇమడలేదు. అటువంటి అనంతాకారుడు అమ్మప్రేమకు బందీ అయ్యాడు జగన్మోహనాకారుడు. అన్న బలరాముడన్నా ఆయనకు అమితమైన మమకారం. అంతకుమించి అన్నగారనిన గురుభావం. మరోవైపు అన్నగా నిలబడి సుభద్రా కళ్యాణాన్ని జరిపించాడు. ద్రౌపదినీ తోబుట్టువుగా భావించి ఆదరించాడు. చీర కొంగు చింపి వేలికి చుట్టినందుకే పరమానందం చెందాడు. అది ఆమె మెట్టినిల్లే. సొంతవాళ్ళే అయినా అయిదుగురు భర్తలు పక్కనే ఉన్నప్పటికీ కష్టకాలంలో ద్రౌపదికి తోడు నిలిచింది కన్నయ్యే. అన్నా అంటూ ఆర్తిగా పిలవగానే చీరలు అందించి ఆమె మాన సంరక్షణ చేశాడు.

భీష్మాచార్యుడు యోధుడు. వరుసకి తాత. భీష్ముడికి కృష్ణుడంటే అమితమైన మమకారం. ఆయనంటే కన్నయ్యకు అదే ప్రేమ. అంతే గౌరవం కూడా. కానీ కౌరవ పక్షాన నిలిచి ఆయనకు (కృష్ణుడికి) వ్యతిరేకంగా పోరాడాడు భీష్ముడు. నేలకొరిగే సమయంలో మాత్రం కృష్ణ సాన్నిధ్యాన్నే కోరుకున్నాడు. యశోదానందనుడు వచ్చేవరకు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని కన్నయ్య కోసం అంపశయ్యపై నుండి ఆయన్ను ప్రతిక్షణం స్మరిస్తూనే ఉన్నాడు.

పీతాంబరధారి, చతుర్భుజుడు, ఆదిపురుషుడు, పరమేశ్వరుడగు హరియందు నిష్కాముడై విశుద్ధంబగు ధ్యాన విశేషముచే నిరస్త దోషుండగుచు ధారణావతి అయిన బుద్ధిని సమర్పించి పరమానందంబు నొంది ప్రకృతివలననైన సృష్టిపరంపరల బరిహారంబు తలంపున మందాకినీ నందనుడు కృష్ణుని ఈవిధంగా స్తుతించుచున్నాడు.

**త్రిజగన్మోహన నీలకాంతిఁ దనువుద్దీపింపఁ బ్రాభాతనీ**
**రజ ప్రభమైన చేలము పయిన్ రంజిల్ల నీలాలక**
**వ్రజ సంయుక్త ముఖారవిందమతి సేవ్యంబై విజృంభింప మా**
**విజయుం జేరెడు వన్నెలాడు మది నావేశించు నెల్లప్పుడున్**

ఇక్కడ భీష్ముడు శ్రీకృష్ణుని అతిలోకముగా స్తుతించాడు. కృష్ణమూర్తి తన కన్నుల కెదుట కన్పించుచున్నను, తాను నిరంతరం ధ్యానించుచున్న యాకృతిని వివిధ కాలములలో వివిధ ప్రదేశాలలో వివిధ భంగిమలలో తాను చూచిన ఆ జగన్మోహనాకృతిని మనోనేత్రము ముందు నిలిపి స్తుతించుట ఇందలి విశేషం. ఇలా భీష్మ స్తవంలో కన్నయ్య త్రిగజన్మోహనాకారుడు, మహానుభావుడు. ఎప్పుడూ తన మదిలో నిలిచిపోవాలని కోరుకుంటాడు.

ఇంక కుంతీదేవి కూడా కృష్ణభక్తురాలే. తన కుమారులను కాపాడినందుకు కృష్ణునికి కృతజ్ఞత చెప్పుకున్నది. యాదవులందు, పాండవులందు తనకు మోహవిచ్ఛేదము చేయమని ప్రార్థించింది.

**యాదవులందుఁ బాండుసుతులయందు నధీశ్వర! నాకు మోహవి**
**చ్ఛేదము సేయుమయ్య ఘనసింధువుఁ జేరెడి గంగభంగి నీ**
**పాద సరోజ చింతనముపై ననిశంబు మదీయబుద్ధి న**
**త్యాదరవృత్తితోఁ గదియునట్లుగఁ జేయగదయ్య యీశ్వరా!**

అంటూ పరిపరి విధాల కృష్ణపరమాత్మను తనకు కష్టాలు ఇంకా ఇమ్మంటూ ప్రార్థిస్తుంది. సుఖాలలో మనకు దైవం కన్పించదు. అందుకే కష్టాలు ఇమ్మంటుంది కన్నయ్యను. పరమహంసలు, నివృత్త రాగద్వేషులు, నిర్మలాత్ములు నైన మునులకు సదృశ్యమానుండయ్యెదవు. మూఢదృక్కులు, కుటుంబములకు మాకు నెట్లు దర్శనీయుండవయ్యెదవు. సంసార సాగరం నుండి తనను బయట పడనీయమంటుంది. శ్రీకృష్ణా! వాసుదేవా! దేవకీనందనా! గోవిందా! నందగోపకుమారా! పంకజనాభా! పద్మమాలికాలంకృతా! పద్మసంకాశ శరణా! పద్మలోచనా! హృషీకేశా! ఈశా! జగదీశా! పాండు తనయులను జతు గృహమునందు జావకుండ, దుర్యోధనుడు పెట్టించిన ఘోర విషంబున భీముణ్ణి కాపాడాడు. ధార్తరాష్ట్రుడు వలువలు వొలవంగ ద్రౌపది ప్రాణ మానములను దలగకుండ కాపాడావు. భీష్ముడు మొదలైన మహావీరులు తన బిడ్డలను సంహరింపకుండా రక్షించావు. ద్రోణుని సుతుడశ్వత్థామ శరవహ్నిలో క్రుంగకుండా యిలా పెక్కుమార్లు రక్షించావు నీరజాక్షా! నన్ను కూడా నిన్ను మరువకుండా మోక్షాన్ని ప్రసాదింపుమని పరి పరి విధాలా వేడుకుంది కుంతీదేవి.

అలాగే స్నేహం విషయానికొస్తే స్నేహం ఎలా చేయాలీ, స్నేహితుడెలా ఉండాలో కృష్ణుని చూసి నేర్చుకోవాలి. తన

చెలికాడైన కుచేలుని ఎలా ఆదుకున్నాడో ఆ తీరు అద్భుతంగా ఉంటుంది. కుచేలుడు నిరుపేద. మరి కన్నయ్య రాజ్యాధినేత. మొహమాటపడుతూ తన వద్దకు వచ్చిన నేస్తాన్ని అడిగి మరీ అటుకుల మూట తీసుకున్నాడు. అడగకపోయినా సకల సౌభాగ్యాలూ ప్రసాదించాడు. స్నేహితుడిని సమాదరించి స్నేహబంధం అన్నింటికీ అతీతమైందని నిరూపించాడు కన్నయ్య.

రాజకీయమంటే ఏమిటో దాన్ని రసవత్తరంగా ఎలా నడపాలో చూపిన రాజకీయ దురంధరుడు కృష్ణ పరమాత్ముడు. ధర్మరక్షణ కోసం ఆ జగన్నాటక సూత్రధారి నెరపిన రాజకీయ చదరంగమే కురుక్షేత్రం. ఆయన చేయని రాజకీయం లేదు. వేయని ఎత్తుగడలు లేవు. కాళీయ మర్దనం నుంచి కురుక్షేత్ర సంగ్రామం వరకు ప్రతీదీ కన్నయ్య ప్రణాళికే. అంతటి రాజనీతిజ్ఞుడు మరొకడుండడు. మహాభారతాన్ని నడపడంలో కీలకపాత్ర కన్నయ్యదే. కౌరవుల దుర్మార్గాన్ని, దుర్బుద్ధిని దెబ్బతీయటానికే తాను పాండవుల పక్షాన చేరాడు. సర్వవేదాంత సారమైన గీతాశాస్త్రాన్ని సర్వమానవాళికీ అందించాడు. కురుక్షేత్ర రణరంగంలో అర్జునుడి సారథిగా ఉండి కార్యోన్ముఖుడిని చేసి మార్గదర్శి అయ్యాడు. ధర్మాన్ని రక్షించడానికి పాండవుల పక్షాన చేరి వారికి వెన్నుదన్నుగా నిలిచాడు. మహాభారత సంగ్రామంలో పాండవులచే విజయం సాధించేటట్లు చేసి ధర్మదేవత పాండవులను వరించునట్లు చేసి అంతిమవిజయం ధర్మానిదే అని ఋజువు చేశాడు కృష్ణపరమాత్మ. అందుకే జగద్గురువు కన్నయ్యా నీకు నతులు.

★★★

# నామ సంకీర్తన

**- రమేష్**

భజన అనే మాట చాలా పవిత్రమైనది. భజించడం, కీర్తించడం భగవంతుడికే వర్తిస్తాయి. నోరారా భగవన్నామాన్ని పాడి హృదయాలను రంజింపచేయడం భక్తి కార్యాల్లో ముఖ్యమైనది. నారదభక్తి సూత్రాల్లోని నవ విధ భక్తి మార్గాల్లో మొదటి రెండు శ్రవణం, కీర్తనం.

శ్రవణం ద్వారా మోక్షాన్ని పొందవచ్చని నిరూపించినవాడు పరీక్షిత్తు మహారాజు. శుకమహర్షి లాంటి విజ్ఞానఖని దొరికితే చాలదు, పరీక్షిత్తు వంటి శ్రోత ఉండాలి. పరిప్రశ్న అనేది భగవద్గీతలో కృష్ణుడు పలికిన మాట. ప్రశ్నించడం అంటే తెలుసుకోవాలనే కుతూహలంతో అడగడం. పరిప్రశ్న అంటే కుతూహలం సరిపోదు, జిజ్ఞాస ఉండాలి. తెలుసుకున్న దాన్ని ఆచరించే కార్యాచరణ కావాలి. పరీక్షిత్తు అలాంటివాడు. అందుకే శ్రవణం మోక్షానికి రాజమార్గమైంది.

ఒక్కరే భగవంతుడి నామాన్ని గానం చేస్తే అది కీర్తనం. సామూహిక గానం సంకీర్తనం అని పెద్దలు చెబుతారు.

**భజనలు నాలుగు విధాలు** :

**నామ సంకీర్తనం** : గోవిందం, మాధవా, రామా, కృష్ణా లాంటి నామాలతో భజించడం.

**గుణ సంకీర్తనం** : దేవదేవుడి గుణాలను వర్ణిస్తూ భజన చేయడం.

**లీలా సంకీర్తనం** : భగవంతుడి లీలలను పొగుడుతూ ఆయన చేసిన అద్భుత కార్యాల్ని కీర్తించటం.

**భావ సంకీర్తనం** : భగవంతుడు భావప్రియుడు. మన భావాలతో స్తుతించడం. పల్లెల్లో నేటికీ కొన్ని భజన సంప్రదాయాలు కొనసాగుతున్నాయి. చిడతల భజన, చెక్కభజన, తాళాల భజన, జ్యోతి భజనతో గ్రామస్థులు భగవంతుణ్ణి ఆరాధిస్తుంటారు.

శ్రీరామదాసు, అన్నమాచార్యులు, వాగ్గేయకారులు సంకీర్తనలతో తరించినవారు. తమ జీవితాలను సంప్రదాయ రీతుల్లో సంగీతపరంగా గానానికి అంకితం చేశారు. హనుమంతుడు శ్రీరామ నామ భజనలో అగ్రగణ్యుడు. నిరంతరం రామనామ తారక మంత్రంతో తరించాడు.


మీరాబాయి కృష్ణ భక్తురాలు. మహారాణి వంశానికి చెందిన స్త్రీ అయినా వీధుల వెంట నగర సంకీర్తన చేసేవారు. మహారాణి హోదాలో ఉండి, వీధుల వెంట తిరిగి భజన పాటలు పాడటం ఆమె మరిది సహించలేక పాలల్లో విషాన్ని కలిపి ఇచ్చాడు. కృష్ణార్పితంగా నైవేద్యం పెట్టి విషం పాలు త్రాగింది. నామ సంకీర్తనా బలంతో ఆమెను శ్రీకృష్ణుడు రక్షించాడంటారు.

రెండు చేతులూ చరుస్తూ చప్పట్లతో భజన చేయడం గీతానికి అనుగుణమైన తాళంగా ప్రసిద్ధి చెందింది. భజన కూడా ప్రార్థనే.

రామనామ సంకీర్తనలో తరించిన గుహుడు, శబరి, భరతుడు, హనుమంతుడు భజన సంప్రదాయాన్ని ఆదర్శంగా నిలిపారు. అక్రూరుడు, విదురుడు, కుచేలుడు, మీరాబాయి కృష్ణ భక్తులుగా చరిత్రలో నిలిచారు.

త్రేతాయుగంలో యజ్ఞ యాగాది క్రతువులు, ద్వాపరయుగంలో వ్రతాలు, పూజలు, నోములు, కలియుగంలో నామస్మరణ, యుగభక్తి ధర్మాలుగా మహర్షులు పేర్కొన్నారు.

నామి కన్నా నామం గొప్పదని ప్రకటించిన ఆంజనేయుడు భక్తి సామ్రాజ్యానికి చక్రవర్తిగా నిలిచాడు.




# శయన భంగిమలో మారుతి కొలువై ఉన్న
# బడే హనుమాన్ దేవాలయం

- శ్రీమతి వెలమకన్ని పద్మావతి

సాధారణంగా హనుమంతుడు వీరాంజనేయులుగానో, దాసాంజనేయులుగానో, సంజీవపర్వతధారిగానో దేవాలయంలో మనకు దర్శనమిస్తూ ఉంటాడు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని రతన్‌పూర్ జిల్లా గిర్జాబంధ్ లో స్త్రీ రూపంలో వుండే మారుతి ఆలయం వుంది. ఈ ఆలయం గురించి మనం గత సంచికలలో తెలుసుకొన్నాం. ఇప్పుడు మనం శయన భంగిమలో హనుమంతుడు కొలువై ఉన్న భారతదేశంలోని ఏకైక దేవాలయం గురించి తెలుసుకుందాం. ఉత్తరప్రదేశ్ లో కాశీనుండి సుమారు 120 కిలోమీటర్ల దూరంలో అలహాబాద్ ఉంది. ఈ అలహాబాద్ లో త్రివేణీ సంగమంలో స్నానం ఆచరించడానికి, పితృతర్పణాలు కావించడానికి నిత్యం అనేకమంది యాత్రీకులు వస్తూ వుంటారు. ఈ త్రివేణీ సంగమానికి ఒక కిలోమీటరు దూరంలోనూ, అలహాబాద్ రైల్వేస్టేషన్ నుండి 78 కిలోమీటర్ల దూరంలోను, అలహాబాద్ కోటకి అత్యంత సమీపంలోనూ, ఈ 'బడేహనుమాన్' దేవాలయం ఉంటుంది. ఈ దేవాలయంలో హనుమంతుడు శయన భంగిమలో దర్శనమిస్తాడు. ఇలా శయన భంగిమలో కొలువై ఉన్న హనుమంతుడి దేవాలయం భారతదేశంలో ఇది ఒక్కటి మాత్రమే. హనుమంతుడు శయనించిన పీఠం నేలమట్టానికి 6 నుంచి 7 అడుగులు పల్లంగా ఉంటుంది. ఈ శయన భంగిమలో ఉన్న హనుమాన్ విగ్రహం 20 అడుగుల పొడవు, 8 అడుగుల వెడల్పు కల్గి ఉంటుంది. ఈ ఆలయం 600-700 సంవత్సరాల క్రితం నాటి ప్రాచీన ఆలయంగా చెప్తారు. లంకను దహించిన హనుమంతుడు ఈ త్రివేణీ సంగమం సమీపంలో శయనించి విశ్రాంతి తీసుకొన్నాడనీ, అందుకే శయన భంగిమలో కొలువై ఉన్నాడని ఒక కథనం. లంకను జయించి, యుద్ధంలో అలసి సొలసి ఉన్న హనుమంతునికి జానకీమాత తన సింధూరాన్ని ఇచ్చి పునర్జన్మను ప్రసాదిస్తూ చిరంజీవిగా ఆయురారోగ్యాలతో వర్థిల్లమని ఈ ప్రాంతంలోనే దీవించిందట. అలాగే త్రివేణీ సంగమంలో స్నానం ఆచరించాక ఈ స్వామిని దర్శించిన వారికి మాత్రమే సంగమస్నాన ఫలితం దక్కుతుందని జానకీమాత చెప్పినదట. అందుకు ప్రతీకగా ఈ దేవాలయానికి సమీపంలో జానకీమాత దేవాలయం కూడా ఉంది.




ఇక ఆలయ చరిత్ర పరిశీలిస్తే – కనౌజ్ మహారాజు గారికి సంతానం లేక వారి గురువుగారిని ఆశ్రయించారట. రామలక్ష్మణులను నాగపాశం నుండి విడిపించడానికి పాతాళానికి వెళ్ళిన హనుమంతుని ప్రతిమ ప్రతిష్ఠించమని గురువుగారు చెప్పారట. గురువుగారి సలహా మేరకు వింధ్యాచల పర్వత శ్రేణులలో విగ్రహాన్ని తయారు చేయించి నావలో తీసుకొని వస్తుండగా, అలహాబాద్ చేరేసరికి రాత్రి అయిపోయింది. నావను కట్టేసి రాత్రికి మహారాజు విశ్రాంతి తీసుకున్నాడట. మహారాజు తెల్లవారి వచ్చి చూసేసరికి విగ్రహం నదిలో మునిగిపోయింది. రాజు చాలా విచారించి చేసేది లేక తిరుగు ప్రయాణమై వెళ్ళిపోయారు. చాలా సంవత్సరాలు గడిచిపోయాయి. బాబా బాలగిరి మహరాజ్ అనే రామభక్తుడైన సాధువుకు గంగానదిలో ఈ విగ్రహం దొరికింది. అప్పుడు ఈ ఆలయాన్ని నిర్మింపచేసి ఈ విగ్రహాన్ని ప్రతిష్ఠింపచేసారని చెప్తారు.

మరొక కథనం ప్రకారం చాలా వందల ఏళ్ళ క్రితం ఒక ధనవంతుడైన వ్యాపారి ఒక నావలో ఈ హనుమంతుని విగ్రహాన్ని తీసుకొని వెళ్తుండగా సంగమం ఒడ్డుకు చేరాక ఈ విగ్రహం పడిపోయింది. ఈ విగ్రహాన్ని తీయడానికి వ్యాపారి తీవ్రంగా ప్రయత్నించినప్పటికీ ఫలితం రాలేదు. ఆనాటి రాత్రి స్వామి వ్యాపారికి కలలో కనిపించి ఈ సంగమ తీరాన్నే నేను కొలువై ఉంటాను అని చెప్పాడట. ఈ ఆలయాన్ని నిర్మించి ఈ విగ్రహాన్ని అందులో ప్రతిష్ఠించారని చెప్తారు.

ఢిల్లీ వెళుతూ తులసీదాస్ ఇక్కడకి వచ్చి ఈ ఆలయాన్ని దర్శించాడని చెప్తారు. 1400 సంవత్సరంలో ఔరంగజేబు ఈ హనుమంతుని విగ్రహాన్ని తొలగించడానికి 100 మంది సిపాయిలతో చాలా సంవత్సరాలు ప్రయత్నింపచేశాడని కానీ సాధ్యం కాలేదని చెప్తారు.

స్త్రీ రూపంలో శనిదేవుడు ఈ హనుమంతుడి పాదాల వద్ద ఉన్నాడని అంటారు శనిదేవుడు స్త్రీ రూపంలో హనుమ పాదాల వద్ద చేరడానికి ఒక పౌరాణిక కథ ఇలా చెప్తోంది. శనిదేవుడు మానవులని అతిక్రూరంగా పీడిస్తూ వుంటే భరించలేని మానవులు హనుమను చేరి తమ బాధలు విన్నవించుకున్నారట. హనుమ ఆగ్రహోదగ్రుడై శనిని దండించాలి అని ఎదురు చూస్తున్నాడట. ఈ విషయం తెల్సుకున్న శనిదేవుడు స్త్రీరూపం ధరించి హనుమ పాదాల చెంతకు చేరాడట. ఆజన్మ బ్రహ్మచారి యైన హనుమ స్త్రీలను తాకడు కదా. పైగా దండించడం అసలు జరగదు కనుక అలా శనిదేవుడు హనుమ దండనను తప్పించుకొన్నాడట. ఇలా శనిదేవుడు స్త్రీ రూపంలో హనుమ పాదాల చెంత ఉన్న హనుమ దేవాలయాలు చాలా చాలా అరుదుగా ఉంటాయని, అలాంటి ఆలయాలను దర్శిస్తే హనుమ కృపతో అన్నిరకాల శనిపీడలూ నివృత్తి అవుతాయనీ అంటారు. ఇలాంటి హనుమ దేవాలయం గుజరాత్ లో ఒకటి ఉందట. ఈ బడే హనుమాన్ దేవాలయంలో కూడా స్త్రీ రూపంలో శని, హనుమ పాదాల వద్ద ఉన్నాడనీ అందుకే ఈ హనుమంతుడి దర్శనం వలన అన్నిరకాల శనిపీడలూ వెంటనే తొలగిపోతాయనీ భక్తుల విశ్వాసం. శని–మంగళ వారాలలో ఈ ఆలయాన్ని భక్తులు అధికసంఖ్యలో దర్శిస్తారు. ఉదయం 5.30 నుండి 2.00 గంటల వరకు, మరల సాయంత్రం 5 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు ఈ ఆలయం తెరిచే ఉంటుంది.

గంగానది నీటిమట్టం పెరిగినప్పుడు తన జలంతో ఈ ఆలయంలోని స్వామిని అభిషేకిస్తుంది. ఈ అపూర్వ దృశ్యాన్ని చూడడానికి తండోపతండాలుగా జనం వస్తారు. హనుమ శయన భంగిమలో కొలువై ఉన్న భారతదేశంలోని ఏకైక దేవాలయం ''బడే హనుమాన్'' దేవాలయం విశేషాలు ఇవి.

★★★

# సర్పరూప సుదర్శనునకు శాప విమోచనం

- విద్వాన్
వల్లూరు చిన్నయ్య

**(ఆంధ్రమహాభాగవతం – దశమస్కంధం – పూర్వభాగం)**

మహాదుర్లభమైన మానవజన్మను దాల్చి మనుచున్న మానవుల మనస్సులలో చేరి నా మేటి ధాటికి దీటు లేదని విర్రవీగుతూ వీర విహారం సల్పుతున్న అరిషడ్వర్గ రాక్షసి నాలుకను కరకర కోసివేసే అసి లాంటి ఆత్మతత్వ విభూతికి అందె వేసిన హస్తంగా పురాణపురుషుడు, పురుషోత్తముడు, ముక్తిదాయకుడు, భక్తి సుధలకు కట్టుబడే పరంధాముడగు దశావతారమూర్తి లీలా విశేషాలకు ఆటపట్టుగా అలరారే ఆంధ్రమహాభాగవతం యొక్క విమలమైన విలువలో విశ్వంలో వెలగట్టరానివి. ఆ మహాకావ్యం దశమస్కంధం పూర్వభాగం ఆధారంగా సర్పరూప సుదర్శనునకు శాపవిమోచనం అనే వ్యాసం వ్రాయబడింది.

ఒకానొక రోజు నందుడు కృష్ణస్వామితో తన బంధువర్గంతో కలిసి పార్వతీ పరమేశ్వరుల సేవాభాగ్యం కోసం అంబికా వనానికేతెంచి, ఆ దేవతామూర్తులను మోక్షాసక్తితో పూజించి, కానుకలు సమర్పించి, విప్రవరులకు అనేక విధాలుగా దానాలు చేశారు. అనంతరం నిద్రిస్తున్న నందుణ్ణి ఒక సర్పం చుట్టుకుని మ్రింగడానికి ప్రయత్నించింది. అతడు భయభ్రాంతుడై కృష్ణా! కృష్ణా అంటూ కేకలు వేశాడు. పరమాత్ములు వచ్చేలోగా అక్కడ ఉన్న యాదవులు కర్రలతో కొట్టి నందుని రక్షింప యత్నించారు. కానీ అది వదలలేదు. అంతలో కృష్ణ పరమాత్మ ఏతెంచి తమ పాదపద్మాలతో తొక్కి ఒక తన్ను తన్నాడు. తక్షణమే ఆ పాము తన పూర్వ రూపమగు సుదర్శనరూపం దాల్చింది. ముకుళిత హస్తాలతో అతడు మ్రొక్కాడు. అంతట మురళీధరుడగు శ్రీకృష్ణుడు అతనితో ఇట్లన్నాడు.

**ఉ ॥ "మండిత మూర్తితోఁ గనకమాలికతో శుభలక్షణుండవై**
**యుండెడు నీకుఁ గష్టపు మహోరగ దేహ మిదేల వచ్చె? నె**
**వ్వండవు? నామమెయ్యది? భవంబున కెద్ది మిషంబు? నాకు నొం**
**డొండ యెఱుంగఁజెప్పుము బుధోత్తమ! నీపనిచోద్యమయ్యెడిన్"**
**పై పద్యం ఆంధ్ర మహాభాగవతం దశమస్కంధం పూర్వభాగం 113 పద్యం**

శృంగారమైన ఆకారంతో బంగారు మాలిక ధరించి సర్వశుభలక్షణాలతో శోభిల్లే నీకు ఈ భయంకర సర్పపు ఆకారం రావడానికి కారణమేమిటి? నీ చర్య చాలా వింతగా ఉంది. సరైన సమాధానం తెల్పుమన్నాడు శ్రీకృష్ణస్వామి.

దేవా! మహానుభావా! కృష్ణా! నా నామధేయం సుదర్శనుడు. నా దేహ సౌందర్యాతిశయానికి మిక్కిలి గర్వించి దిక్కులయందు తిరుగుతూ, ఒక సమయంలో అంగిరసుని సంతతి వారూ వికారరూపం కలవారూ అయిన ఋషులను కాంచి ఎగతాళి భావంతో నవ్వాను. అందుకువారు నాపై మండిపడి "ఓరీ! నీవు మమ్ము గేలి చేశావు. భయంకర సర్పపు రూపాన్ని వహించు" అని శపించారు. నేను వారిని బ్రతిమాలగా ఇలా నన్ను అనుగ్రహించారు.

**చ. "యదుకులంబు భక్తుల భయంబు హరించుటకున్ జనార్దనుం**
**డుదయమునొంది యీ యడవి కొక్కదినంబున రాఁగలండు, త**
**త్పదమున నీవు తన్నబడి పన్నగదేహముతోడఁ బాసి, నీ**
**మొదలిటిమేను గాంచెదవు మూఢుఁడ! పొమ్మని రా దయానిధుల్"**
**–ఆంధ్రమహాభాగవతం, దశమస్కంధం, పూర్వభాగం 115వ పద్యమిది.**

ఓయీ! మూఢస్వభావం కలవాడా! భక్తుల భయాన్ని బాపడానికై విష్ణుదేవుడు శ్రీకృష్ణావతారం దాల్చి యాదవ వంశాన్ని ఉద్ధరిస్తూ ఒకానొక సమయంలో ఈ అడవి ప్రాంతానికి వస్తాడు. అప్పుడు నీవు ఆ మహానుభావుని పాదములతో తన్నబడి పాము రూపాన్ని వదలి మునుపటి రూపాన్ని వహించగలవు అని ఆ ఋషీశ్వరులు దయాంతరంగులై పలికి నన్ను ఊరడించారు అన్నాడు. ఇంకా ఇలా పలికారు.

**మ. "నినుఁ జింతించిన విన్నఁ జేరుకొనినన్ నిర్మూలమై క్రుస్సి, పా**
**పనికాయంబు వినష్టమౌనట! భవత్పాదంబు నామీఁదఁ బె**
**ట్టినఁ దద్బ్రాహ్మణ శాప సంజనిత కౌటిల్యంబు దా నిల్చునే?**
**వనజాతేక్షణ? నేఁడు వాసె నురగత్వం బెల్ల నేఁ బోయెదన్"**
**ఆంధ్రమహాభాగవతం, దశమస్కంధం, పూర్వభాగం, 116వ పద్యమిది**

కమలముల వంటి కన్నులు గల సర్వాంతర్యామీ! కృష్ణభగవానుడా! తమను చిత్తశుద్ధితో ధ్యానించినా, తమ పవిత్ర చరితలు వినినా, మీ నామ సంకీర్తనం చేసినా, పాపమనే రాశి నశిస్తుందని భక్తవర్యులు పల్కుతారు. నా శరీరంపై తమ పాదపద్మాలను మోపినావు కదా! అందువల్లనే విప్రుల శాప కారణంగా నాకు సంక్రమించిన భయంకరమైన పాము రూపం భస్మమైపోయింది. నేను తమ అమల లీలానుసారం నా స్వస్థానానికి వెళుతున్నానని వినయపూర్వకంగా పలికి వెళ్ళాడు. నందుడు కూడా ఆపద నుండి విముక్తుడయ్యాడు. గోపకులు కృష్ణ లీలా విలాసాన్ని మరీ మరీ కీర్తించారు.

★ ★ ★

ధారావాహికం



# శ్రీ కృష్ణ తత్త్వం

– రాళ్ళబండి శ్రీనివాసన్

కృష్ = అపరిమితమైనటువంటి–ణ=ఆనందం. అపరిమితమైన ఆనందాన్ని ప్రసాదించేవాడు కృష్ణుడు – పరిపూర్ణ ఆనందస్వరూపుడు కృష్ణుడు అని అర్థాలు.

అంధకారంలో మగ్గిపోతున్నవాళ్లకు సూర్యుడులాంటివాడని – సముద్రంలోమునిగిపోయేవాళ్లను ఒడ్డుకు చేర్చే ఓడలాంటివాడని – ఇంకా దప్పిగొన్నవాళ్లకి మధుర జలాలనిచ్చే మేఘంలాంటివాడని– ఇంకా నిరుపేదలపాలిటి పెన్నిధిలాంటివాడని – వ్యాధిగ్రస్తులకు దివ్యౌషధంలాంటివాడని– అలాంటి కృష్ణుడు– మా అందరికి క్షేమాన్ని చేకూర్చాలని లీలాశుకుడు శ్రీకృష్ణ కర్ణామృతంలో కీర్తించాడు.

జన్మపరంపరలనుంచి పేరుకుపోయిన పాపరాశిని భస్మంచేయగల – సమస్త కళ్యాణగుణపూర్ణుడైన కృష్ణుని నామస్మరణం మనకు శరణ్యం.

విష్ణువు = ఈ విశ్వం సర్వస్వం వ్యాపించివుండేవాడు.

వాసుదేవుడు – సమస్త లోకాల్లోనూ ప్రకాశించేవాడు.అంతే కాక సమస్త చరాచరజీవకోటిలో వుండేవాడు.

నారాయణుడు = చరాచర జీవకోటికి ఆశ్రయమై – వాటినే ఆశ్రయం చేసుకుని నియమిస్తూవుండేవాడు.

భగవానుడు = జ్ఞానబలైశ్వర్య వీర్యతేజః శక్తిమంతుడైనట్టి వానినే భగవానుడు అంటారు.

పన్నెండు మంది ఆళ్వార్లు – ఇంకా రూపగోపస్వామి – ఇంకా మధుసూదన సరస్వతిస్వామి – ఇంకా మీరాబాయి – లీలాశుకుడు – ఇంకా జయదేవుడు – పోతన – కృష్ణ తత్వాన్ని ఎంతగానో అర్థం చేసుకున్నవారు మరెందరో మహానుభావులు వున్నారు.

భగవత్ సంబంధం తప్ప ఇంకేవిధమైన ప్రయోజనాన్ని కూడా ఆశించనట్టి నిశ్చలమైనదానిని భక్తి అంటారు.తను ఏమయినప్పటికీ – భగవంతుడు క్షేమంగా వుండాలనుకోవడమే – భక్తి పండిన ప్రేమ.ఇక భగవదవతారాలు ఎన్ని వున్ననూ– అతిసామాన్యుడూ భక్తితో ఉపాసించదగ్గవి రెండే రెండు వున్నాయి. అవే రామ కృష్ణ అవతారాలు.

కృష్ణ జననము ఒక మహాద్భుతమైన సన్నివేశం. కంస శిశుపాల దుర్యోధనాదుల దుష్టసంహారం కోసం కృష్ణుడు అవతరించాడన్నారు కొందరు. కాదు కాదు అలాంటి దుర్మార్గుల వలన సంభవించిన భూభారమును తొలగించడానికి అన్నారు కొందరు. ఆ కారణాల కంటే సంసార సాగరంలో బంధించబడి – అజ్ఞానాంధకారములో– కొట్టుమిట్టాడుతున్న సంసారులను ఉద్ధరించాలని – ప్రధాన కారణం అని – మోక్షసాధనకు ఉపాయ ఉపేయాలు రెండు కూడా తనేనని విశ్వసించాలని – తెలియజేస్తూ – అర్ధరాత్రి సమయంలో చిమ్మచీకటితో కూడిన చెరసాలలో చతుర్భుజుడై– దివ్య తేజోవిరాజమానుడై అవతరించినాడు కృష్ణభగవానుడు.

అవతరించినప్పటినుంచి రాక్షసపీడ వెంటాడుతుందని గ్రహించాడు కృష్ణుడు. తనని గొల్లపల్లె చేర్చాలని ఆదేశించాడు తండ్రిని. కృష్ణుణ్ణి తలమీద పెట్టుకోగానే కారాగారపు తలుపులు తెరుచుకున్నాయి. కాపలాదారులు నిద్రలోకి జారుకున్నారు. ఇక బయట కుండపోతగా వర్షం కురుస్తోంది. తన స్వామి తడిసిపోకుండా ఆదిశేషుడు తన పడగలను గొడుగుగా పట్టాడు. పరవళ్లు తొక్కుతున్న యమునానది కృష్ణునికి దారి ఇచ్చింది. ఒక కెరటమై లేచి – చిన్నికృష్ణుని దివ్యపాదాలను ముద్దాడి జన్మని ధన్యమొనర్చుకుంది యమున.

సీతమ్మ ఏమైందని – నీవు చూసావా అని రాముడు అడిగాడు. వేల కిలోమీటర్ల దూరంలో లంకలో వున్న రావణునికి భయపడింది గోదావరి.

తనకు పక్కనేవున్న మధురానగరంలోని కంసునికి భయపడక కన్నయ్యకు దారినిచ్చింది యమునమ్మ.

పూతన మొదలుకుని – కాళీయమర్దనం వరకు – కృష్ణుని అతి మానుషమైనట్టి కృత్యాలని – గోపాలురులతోడ కలిసి చల్దులారగిస్తూ ప్రదర్శించిన సౌశీల్యాన్ని– గోవర్ధనగిరిధారియై – గో గోపికా గోపాలుర రక్షణత్వంలో నడిపిన పరత్వాన్ని – వ్రజ గోపభామలతోఆడుతూపాడుతూసలిపినరాసక్రీడావిలాసములోని ఆజన్మ బ్రహ్మచర్యాన్ని – రాయబారిగానూ కౌరవసభలో చూపినట్టి బహుముఖ రాజనీతిజ్ఞతని, కురుక్షేత్ర సంగ్రామములో అర్జునునికి గీతోపదేశం చేయడంలోని యోగమైశ్వర్యాన్ని –ఇంకా ద్వారకలో యదువంశనాశనాన్ని వీక్షిస్తున్నప్పటి స్థితప్రజ్ఞత్వాన్ని – కృష్ణతత్వ వైశిష్ట్యాన్ని వర్ణించడానికి భాష చాలదు. **(సశేషం)**

ధారావాహిని



# అమ్మకథలు

- డి.శ్రీనివాస దీక్షితులు

## శశికళ

సుబాహుడు అనే రాజు కాశీరాజ్యాన్ని పరిపాలిస్తున్నాడు. ఆయనకి శశికళ అనే కుమార్తె ఉంది. ఆమె అపరంజి బొమ్మ. అందాలరాశి. శశికళకి యుక్తవయస్సు వచ్చింది. ఆమె అందం మరింతగా పెరిగింది. సుదర్శనుడు గుణవంతుడు, వీరుడు. రూపంలో మన్మథుడు. ఇన్ని లక్షణాలనున్న రాజకుమారుణ్ణి ఏ రాజకుమార్తె అయినా వరించకుండా ఉంటుందా? సుదర్శనుని గురించి వినగానే అతనినే తన భర్తగా భావించుకుంది శశికళ. ఆమె దేవీ భక్తురాలు. ఎప్పుడూ అమ్మవారిని ధ్యానిస్తూ ఉంటుంది రాజకుమారి.

ఒకనాటి రాత్రి శశికళకి అమ్మవారు కలలో కనిపించింది. ''రాజకుమారీ! సుదర్శనుడు కూడా నా భక్తుడే. అతడే నీకు అన్నివిధాలా తగిన భర్త'' అని చెప్పింది మహాదేవి.

ఆ మాట వినగానే శశికళ మనసులో మంగళ వాయిద్యాలు మధుర మధురంగా మ్రోగాయి. ఆనంద తరంగనాదాలు ఉప్పొంగాయి. పారిజాత సుమదళాలు పరిమళాల్ని వెదజల్లాయి.

అంతఃపురంలో ఆనందంగా తిరుగుతున్న రాజకుమారిని చూసి కన్నతల్లి ''శశీ! ఏంటి అంత సంతోషంగా ఉన్నావు? ఏం జరిగింది?'' అని అడిగింది.

కన్నతల్లి అడిగినా తన మనసులోని మాటని చెప్పలేదు రాజకుమారి. యుక్తవయస్సులో ఉన్నవాళ్ళు తల్లికీ, తండ్రికీ, అమ్మమ్మకీ, తాతయ్యకీ, నానమ్మకీ, అన్నయ్యకీ, అక్కయ్యకీ చెబుతారా? ఊహుఁ చెప్పరు.

అంతే... అది ఆ వయసు లక్షణం.

కానీ మనసు ఊరుకోదు కదా! అది గిలిగింతలు పెడుతుంది. మెలి పెడుతుంది. అంతులేని ఆలోచనలతో మెదడు నిండిపోతుంది. ఆ భావావేశాన్ని తట్టుకోవటం కష్టం.

రాజకుమారి చెలికత్తె ప్రియంవద వచ్చింది.

అన్ని విషయాలూ ఆమెకి శశికళ చెబుతుంది.

''రాజకుమారీ! మీ మనసు అల్లకల్లోలంగా ఉంది సుమా! అవునా?'' మృదువుగా అంది ప్రియంవద.

''ఊఁ'' గంభీరంగా అంది రాజకుమారి.

''అమ్మా! నా దగ్గర కూడా దాపరికాలా?'' అంది చెలికత్తె.

''నాకు కల వచ్చిందే...''

''కలా...?''

''అవును...''

''అయితే ఆ కలలోకి...''

''ఊహుఁ...''

''సుదర్శనులవారు వచ్చారా?''

''లేదు.. లేదు.. దేవి వచ్చింది''

''ఏమైనా చెప్పిందా?''

''ఊఁ చెప్పింది...''

''నీకు తగిన భర్త సుదర్శనుడే'' ''అని అమ్మ నన్ను ఆదేశించింది'' అని చెప్పింది రాజకుమారి.

చెలికత్తె వెళ్ళిపోయింది.

కలలో దేవి కనిపించి సుదర్శనుని గురించి చెప్పిన క్షణం నుండి అనుక్షణం రాజకుమారి సుదర్శనుడి గురించే ఆలోచించసాగింది. విరహంతో వేగిపోతోంది.

ప్రియంవద సపర్యలు చేస్తోంది.

రాజకుమారికి రోజులు భారంగా గడుస్తున్నాయి.

ఒకనాడు చెలికత్తె ప్రియంవదతో కలిసి శశికళ వనవిహారానికి వెళ్ళింది. అందమైన పూలు, రంగురంగుల పూలు, పరిమళాల పూలు, రకరకాల పూలు అన్నీ చూస్తోంది శశికళ. ప్రియంవద ఆ పూల గురించి చెబుతోంది. కానీ రాజకుమారి మనసు అక్కడ

లేదు. ఎక్కడో ఉంది.

గమనించింది ప్రియంవద.

అంతలో వాళ్ళు సంపెంగ పూలచెట్ల వద్దకు వచ్చారు.

సంపెంగలంటే రాజకుమారికి చాలా ఇష్టం. అయినా ఇప్పుడు వాటిని చూసి కూడా రాజకుమారి చలించలేదు.

ప్రియంవద సంపెంగపూలు కోస్తోంది రాజకుమారి కోసం. అప్పుడే ఒక బ్రాహ్మణుడు పరుగు పరుగున అక్కడికి వచ్చాడు. గబగబా తన ఉత్తరీయం నిండా సంపెంగపూలు కోసుకున్నాడు.

శశికళ ఆ బ్రాహ్మణునికి నమస్కరించింది.

"అయ్యా! మీరు ఎక్కడ నుంచి వస్తున్నారు?" అని అడిగింది శశికళ.

"ఈ అడవిలోనే భరద్వాజ మహర్షి ఆశ్రమం ఉంది. అక్కడ నుండి వస్తున్నాను" అన్నాడు బ్రాహ్మణుడు.

"మరి ఈ పూలు..." అంది శశికళ.

"ఈ పూలంటే మా రాజకుమారుడికి చాలా ఇష్టం" అన్నాడు బ్రాహ్మణుడు.

"మీ రాజకుమారుడు..." అంది శశికళ.

"మా రాజకుమారుడు సుదర్శనుడు. అన్నివిధాలా అరుదైన వ్యక్తి సుదర్శనుడు. ఆయన భరద్వాజుని ఆశ్రమంలో ఉన్నాడు. అందగాడు, సద్గుణవంతుడు. వీరుడు. దేవీభక్తుడు. మరి నువ్వు ఎవరు?" అని అడిగాడు బ్రాహ్మణుడు.

"కాశీ రాజుగారి కూతురు ఈమె. పేరు శశికళ" అని చెప్పింది ప్రియంవద.

బ్రాహ్మణుడు రాజకుమారిని ఆశీర్వదించి వెళ్ళిపోయాడు.

ప్రియంవదతో శశికళ తన మనసులోని మాటని దృఢంగానే చెప్పింది.

"చెలీ! వాగ్ బీజాక్షరాన్ని జపించటం వల్ల మహాదేవి నన్ను కరుణించింది. కలలో కనిపించింది. సుదర్శనుణ్ణి తగిన భర్తగా నిర్ణయించింది. ఇప్పుడు ఈ బ్రాహ్మణుని ద్వారా సుదర్శనుడి వివరాల్ని నాకు తెలిపింది. అంతా దేవి సంకల్పం" అంది శశికళ.

"ఇన్నాళ్ళు తనకి పెళ్ళి వద్దని మొండికేసిన శశికళ ఇప్పుడు సుముఖంగా ఉందని ప్రియంవద ద్వారా తెలుసుకున్నాడు కాశీరాజు. వెంటనే రాజకుమారికి స్వయంవరాన్ని ప్రకటించాడు కాశీరాజు సుబాహుడు. భరద్వాజ మహర్షి ఆశ్రమంలో సుదర్శనుడు నిరంతరం కామరాజ బీజమంత్రాన్ని జపిస్తూనే ఉన్నాడు. అతని నిష్ఠకి అమ్మ కరుణించింది. విష్ణుమాయగా దేవి సుదర్శనునికి దర్శనమిచ్చింది. సకల శుభాలు కలుగుతాయని ఆశీర్వదించింది.

తర్వాత శృంగిబేరపురం నుంచి బోయలరాజు వచ్చి సుదర్శనునికి దివ్యమైన జైత్రరథాన్ని కానుకగా ఇచ్చాడు. ఎల్లవేళలా తన సైన్యం అందుబాటులో ఉంటుందని తనని మిత్రుడిగా స్వీకరించమని చెప్పి బోయలరాజు వెళ్ళిపోయాడు.

మునులందరూ వచ్చి సుదర్శనుని ఆశీర్వదించారు. సుదర్శనుని తల్లిని ఓదార్చారు. తొందరలోనే దేవి అనుగ్రహంతో సుదర్శనుడు మహారాజు అవుతాడని వాళ్ళు చెప్పారు.

అయినా సుదర్శనుని తల్లికి అనుమానం తీరలేదు.

"సుదర్శనుడు జైత్రరథాన్ని ఎక్కి ఎక్కడికి వెళ్ళినా అతను దివ్యతేజస్సుతో ప్రకాశిస్తాడు. ఆ జైత్రరథాన్ని అమ్మవారి ఆదేశంతో బోయలరాజు కానుకగా ఇచ్చాడు. అతని వెంట అక్షౌహిణీ సేన ఉన్నట్లుగా శత్రువులకి అనిపిస్తుంది. కామరాజు బీజమంత్రం ప్రభావంగా కోరిన కోరికలన్నీ తీరతాయి. సుదర్శనునికి అమ్మ దయ పుష్కలంగా ఉంది. అంతా శుభమే జరుగుతుంది" అని చెప్పి మహర్షులు వెళ్ళిపోయారు.

శశికళ స్వయంవరానికి అంతా సిద్ధం చేస్తున్నారు.

కాశీరాజు తన కుమార్తెకు ఇచ్చా స్వయంవరాన్ని ప్రకటించాడు. అందులో కన్య తనకి నచ్చిన రాజకుమారుణ్ణి తానే వరిస్తుంది. రాజకుమారులకి ఆహ్వానాలు పంపారు.

శశికళ తన తల్లి దగ్గరికి వెళ్ళింది. రాజ్యం లేకపోయినా సంపద లేకపోయినా ఆశ్రమంలో తల దాచుకుంటున్న సుదర్శనుని మాత్రమే వరిస్తాను. దేవి కూడా కలలో కనిపించి సుదర్శనుని వరించమని ఆదేశించదని చెప్పింది రాజకుమారి.

తల్లీ తండ్రి అందుకు అంగీకరించలేదు.

సుదర్శనుని తప్ప మరొకరిని భర్తగా వరించనని కరాకండిగా చెప్పింది శశికళ. తండ్రి ఒప్పుకోలేదు.

అడవిలో సంపెంగ పూలచెట్ల దగ్గర కనిపించిన బ్రాహ్మణుడిని రహస్యంగా పిలిపించింది శశికళ. అతని ద్వారా సుదర్శనునికి రహస్యంగా సందేశం పంపింది శశికళ.

స్వయంవరానికి వచ్చి తనని స్వీకరించమని, త్రికరణశుద్ధిగా తాను వరిస్తున్నానని, అలా రాకపోతే తాను విషం తాగి మరణిస్తానని శశికళ సుదర్శనునికి కబురు పంపింది.

భరద్వాజ మహర్షి ఆశీస్సులతో సుదర్శనుడు తన జైత్ర రథం మీద కాశీరాజ్యానికి వచ్చాడు. స్వయంవరం కోసం వివిధ దేశాల నుంచి రాజకుమారులు తమ సైన్యాలతో తరలి వచ్చారు.

స్వయంవరానికి ముందురోజు సుదర్శనుడు వారణాసి వెళ్ళాడు. అతని వెంట అతని తల్లి కూడా ఉంది.

"తండ్రీ! నేను స్వయంవర మంటపంలో అడుగుపెట్టను. మరో వ్యక్తిని వరించను. ఇది నా నిర్ణయం. నాకు దేవి అండ ఉంది" అని చెప్పింది తండ్రికి శశికళ.

మహారాజు ఏకాంతంగా సుదర్శనునితో మాట్లాడాడు. వధూవరుల అభిప్రాయాలు తెలుసుకున్న తరువాత తన నిర్ణయాన్ని మార్చుకున్నాడు కాశీరాజు. శశికళతో సుదర్శనునితో చర్చించి ఒక పథకాన్ని రూపొందించాడు కాశీరాజు సుబాహుడు.

ఆ రోజు రాత్రి అంతఃపురంలోని రహస్య మందిరంలో నిరాడంబరంగా శశికళ, సుదర్శనుల వివాహం జరిపించాడు రాజు. మర్నాడు ఈ పెళ్ళి విషయం రాజకుమారులందరికీ

తెలిసింది. వాళ్ళు కోపంతో ఊగిపోయారు.

కాశీరాజు జరిగిన విషయం, శశికళ మనసులోని అభిప్రాయం వివరించిన తర్వాత రాజకుమారులు కొంత శాంతించారు. కాని వారం రోజుల తర్వాత యుద్ధానికి సిద్ధమయ్యారు. సుదర్శనుడికి, రాజకుమారులకి మధ్య భయంకరంగా యుద్ధం జరిగింది. సుదర్శనుడు యుద్ధం చేస్తూ దేవిని ధ్యానిస్తూనే ఉన్నాడు.

రాజులందరూ కలిసి మూకుమ్మడిగా సుదర్శనుని మీద దాడి చెయ్యడంతో దేవికి ఆగ్రహం కలిగింది.

సింహం మీద ఎక్కి వివిధ ఆయుధాల్ని ధరించి ఉగ్రరూపంతో కదనరంగంలోకి అడుగుపెట్టింది మహాదేవి. సింహం భయంకరంగా గర్జించింది. అమ్మరూపాన్ని చూసిన శత్రువుల గుండెలు గుభేలు మన్నాయి. అమ్మవారు... సుదర్శనుడు యుద్ధంలో శత్రురాజులందరినీ వధించారు.

సుబాహువు ప్రార్థనని మన్నించి అమ్మవారు దుర్గాదేవిగా కాశీనగరంలో కొలువైంది.

సుదర్శనుడు అమ్మవారి ఆదేశానుసారం అయోధ్య రాజ్యాన్ని పరిపాలించసాగాడు. అయోధ్యలో దుర్గాదేవి విగ్రహాన్ని ప్రతిష్ఠించాడు. నిత్య పూజలు చేస్తున్నాడు. వైభవంగా శరన్నవరాత్రుల్ని ఆచరిస్తున్నాడు. సుఖశాంతులతో రాజ్యం విలసిల్లుతోంది. సుదర్శన మహారాజు తన పట్టపురాణి శశికళతో ఆనందంగా కాలం గడుపుతున్నాడు.



**శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం సంకల్పించిన మొత్తం 111 శ్రీనివాస కళ్యాణాలలో భాగంగా గత నెలలో నిర్వహించిన కళ్యాణాలు**

**62వ కళ్యాణము -**

తేది 30-12-2023, శనివారం ఉదయం 10.30 గంటల నుండి జరిగింది. దీనిని శ్రీమాన్ కోవ్వూరి విశ్వేశ మేఘమాల దంపతులు నిర్వహించారు. ఇది నీలాద్రి నిలయం అపార్టుమెంట్ వద్ద, సాయిబాబా నగర్ కాలనీ, ఓల్డ్ అల్వాల్, సికింద్రాబాద్ లో వైఖానసాగమోక్తంగా జరిగింది.


# శ్రీ వేంకటేశ్వరుని కృపను పొందుటకు గొప్ప అవకాశం

**'శ్రీ వేంకటేశం' మాసపత్రికలో ధారావాహికగా ప్రచురితమైనవి, మరియు శ్రీ వేంకటేశ్వర పరిశోధకులు డా. విష్ణుభట్ల గోపాలకృష్ణమూర్తి, తిరుపతి గారిచే ఈ క్రింది పురాణాల నుండి తెలుగులో అనువదించబడినవి. భక్తులు వీటిని మరింత చదివి స్వామి తత్త్వమును తెలుసుకోవాలనే కోరికతో పుస్తకముగా ముద్రించుటకు ఆర్థిక సహాయం కోరుచున్నాము. దాతలు ఎన్నుకొన్న పుస్తకముపై దాతగా వారి పేరును ముద్రించుటతోపాటు కొన్ని పుస్తకములు ఇవ్వడబడును. మరియు శ్రీ వేంకటేశ్వరుని కృపాకటాక్షములు లభించగలవు.**

1. శ్రీ వేంకటాచల మాహాత్మ్యం, మొదటి సంపుటం, స్కాందపురాణ భాగం (250 పేజీలు)
2. శ్రీ వేంకటాచల మాహాత్మ్యం, రెండవ సంపుటం, వరాహ పురాణ భాగం (200 పేజీలు)
3. శ్రీ వేంకటాచల మాహాత్మ్యం మూడవ సంపుటం, పద్మ, గరుడ, హరివంశ పురాణ భాగములు (200 పేజీలు)

## శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠము

**హైదరాబాద్. ఫోన్: 040-27175050, 9348212354. Email: srivenkatesham@gmail.com**

## శ్రీ వేంకటేశ్వర మహామంత్రపీఠం ఆధ్వర్యంలో

# శ్రీనివాస కళ్యాణాలు

**ఉచిత శ్రీనివాస కళ్యాణాలను నిర్వహించండి!**
**శ్రీవారి కృపకు పాత్రులుకండి!!**



**తిరుమల శ్రీవేంకటేశ్వరుని కరుణా కటాక్షములు అందరికీ లభించాలని 'కరోనా' లాంటి మహమ్మారి నుండి లోకాన్ని స్వామివారు రక్షించాలనే ఉద్దేశ్యంతో, భగవంతునికి మరియు ఆయన భక్తులకు సేవచేయాలన్న లక్ష్యంతో 'శ్రీనివాస కళ్యాణాలు' అనే కార్యక్రమమును చేపట్టాము.**

కలియుగ దైవమైన తిరుమల శ్రీవేంకటేశ్వరునికి ప్రతి సంవత్సరం 7 కళ్యాణాల కంటే తక్కువ కాకుండా కనీసం 111 కళ్యాణాలను వివిధ ప్రాంతాలలో ఉచితంగా నిర్వహించాలని సంకల్పించాము.

ఆహ్వానించిన భక్తుల ప్రాంతములో అనగా వారి వారి ఊరు, అపార్టుమెంట్ లేదా ఇంటివద్దనే నిర్వహించెదము. శ్రీవారి కళ్యాణమును శాస్త్రోక్తంగా నిర్వహించుటకు అన్ని ఏర్పాట్లు అనగా విగ్రహాలను, బ్రాహ్మణులను, ఇతర సామగ్రిని మేమే ఏర్పాటు చేసెదము. కళ్యాణముతో పాటు వీలైతే అన్నమయ్య కీర్తనలు, ప్రవచనములను కూడా ఏర్పాటు చేయగలము. భక్తులలో శ్రీవేంకటేశ్వరస్వామి పట్ల భక్తి భావమును, శరణాగత తత్త్వమును ప్రోత్సహించుచు, స్వామివారి సేవాభాగ్యమును మరియు ఆశీస్సులను అందించుటే మా లక్ష్యం.

**శ్రీవారి కళ్యాణమును తమ ప్రాంతము, ఊరు, ఇంటి వద్ద నిర్వహించుటకు ఆసక్తికల భక్తులు మమ్మల్ని సంప్రదించవలెనని మనవి. భక్తులకు అనువైన రోజున 'నమో వేంకటేశాయ' రథం యుక్తంగా విచ్చేసి శ్రీనివాస కళ్యాణమును నిర్వహించుదుము. (హైదరాబాద్ మరియు పరిసర ప్రాంతాలలో మాత్రమే)**

**శ్రీవేంకటేశ్వర మహామంత్రపీఠం**

శ్రీవేంకటేశ్వర పాదసేవకుడు
**పుల్లగూర్ల సాయిరెడ్డి**
(గోవిందదాసు)

ఫోన్: 040-27175050
సెల్: 93482 12354
E.mail: srivenkatesham@gmail.com
Website:Srivenkatesham.org

# రాశి ఫలితములు

## మేషరాశి

**అశ్వని 1,2,3,4 పాదములు, భరణి 1,2,3,4 పాదములు, కృత్తిక 1వ పాదము**

ఈ రాశి స్త్రీ పురుషులు సంఘంలో గౌరవవమన్ననలు. విందు వినోదాల్లో పాల్గొంటారు. వివాహ ప్రయత్నాలు ఫలించే అవకాశాలు ఉన్నాయి. ఆర్థికంగా అనుకూలంగా ఉంటుంది. పాత బాకీలు తీరిపోతాయి. రావాల్సిన డబ్బు చేతికి అందుతుంది. ఆభరణాలు, స్థలాలు కొనడంలో పట్టుదల కలిగి ఉండండి. పంతాలు వదిలి ప్రయత్నిస్తే విజయం మీదే. అందుకోసం కొన్ని నియమాలు పాటించండి. ఇష్టదైవరాధన చేయడం చాలా అవసరం.

## వృషభరాశి

**కృత్తిక 2,3,4, రోహిణి 1,2,3,4 పాదములు, మృగశిర 1,2 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులు విందు వినోదాల్లో పాల్గొంటారు. సంఘంలో గౌరవ, మర్యాదలు పొందుతారు. వివాహ ప్రయత్నాలు ఫలిస్తాయి. భూములు, ఆభరణాలు, అలంకార సామగ్రి, ఇంట్లో అవసరమైన సామాన్లు కొనుగోలు చేస్తారు. గ్రామ దేవతలను స్మరించుకోవాలి.

## మిథునరాశి

**మృగశిర 3, 4 పాదములు, ఆరుద్ర 1,2,3,4 పాదములు, పునర్వసు 1, 2, 3 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు సామాన్యంగా ఉంటుంది. విందులు, వినోదాలు, బంధు మిత్రుల కలయికతో ఆనందంగా ఉంటారు. ప్రతి విషయంలో సామరస్య ధోరణి కలిగి అందరితో అనుకూలంగా ఉండండి. అనారోగ్య సమస్యలు ఉన్నవి. అమ్మవారికి శాంతి పూజలు చేయండి.

## కర్కాటకరాశి

**పునర్వసు 4వ పాదము, పుష్యమి 1,2,3,4 పాదములు, ఆశ్లేష 1,2,3,4 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు అనుకూలంగా ఉంటుంది. విందు వినోదాలు, శుభ కార్యాలు జరుగుటకు చాలా అనుకూలమైన రోజులు. వివాహ ప్రయత్నాలు ఫలిస్తాయి. అధికారుల మన్ననలు, సంఘంలో గౌరవమైన విధంగా ఆలోచనలు చేస్తారు. కుల దేవత ఆరాధన వల్ల శక్తి వస్తుంది.

## సింహరాశి

**మఘ 1,2,3,4 పాదములు, పుబ్బ 1,2,3,4 పాదములు, ఉత్తర 1వ పాదము**

ఈ రాశి స్త్రీ పురుషులకు చాలా అనుకూలంగా ఉంటుంది. గ్రహల కాంబినేషన్‌తో చక్కడి ఫలితం రాగలదు. అధికారులతో అనుకూలంగా ఉండండి. మానసిక ధోరణి, నిరాశ నిస్పృహలకు అవకాశం ఇవ్వొద్దు. అనారోగ్యం పాలయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. ఆయుర్వేద మందులు వాడండి. ఆదిత్య హృద పారాయణం చేయండి.

## కన్యారాశి

**ఉత్తర 2,3,4 పాదములు, హస్త 1,2,3,4 పాదములు, చిత్త 1,2 పాదములు**

ఈ రాశి స్త్రీ పురుషులకు కొంతవరకు అనుకూలంగా ఉంటుంది. ఎంత ఒత్తిడిలో ఉన్న చాలా జాగ్రత్తగా ఉంటారు. సమస్యలు రాకంటే ముందే జాగ్రత్తలు తీసుకుంటే కొంత వరకు ఉపశమనంగా ఉంటారు. విందువినోదాలు, వివాహ శుభకార్యాలకు హాజరు అవుతారు. శ్రీసుబ్రమణ్యేశ్వర స్వామి ఆరాధన, దర్శనంతో శాంతి ఉంటుంది.

## తులారాశి

**చిత్త 3,4 పాదములు, స్వాతి 1,2,3,4 పాదములు, విశాఖ 1,2,3 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు సామాన్యంగా ఉంటుంది. బంధు మిత్రుల కలయిక వల్ల సంతోషంగా ఉంటారు. అకస్మిక ప్రయాణాలు ఉంటాయి. అనారోగ్య సమస్యలు ఉన్నాయి. దీర్ఘకాలిక ఆలోచనలతో ఎంతపెద్ద సమస్య వచ్చినా అదరక బెదరక మనో నిగ్రహంతో ఉండి చాకచక్యంగా పరిష్కరించుకుంటారు. అమ్మవారి పూజలు అనంతమైన శక్తిని ఇస్తాయి.

## వృశ్చికరాశి

**విశాఖ 4వ పాదము, అనూరాధ 1,2,3,4 పాదములు, జ్యేష్ఠ 1,2,3,4 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు సామాన్యంగా ఉంటుంది. బంధు మిత్రుల కలయిక, విందువినోదాలు చేస్తారు. వివాహ ప్రయత్నాలు అనుకూలిస్తాయి. నూతన వ్యక్తుల పరిచయం వలన ప్రయత్న లాభం ఉంటుంది. దూర ప్రయాణాలు కలిసి వస్తాయి. అరోగ్యంగా ఉండేందుకు యోగా, ధ్యానం చేయాలి. జాగ్రత్తగా ఆలోచన చేసి నిరంతరం దైవ ప్రార్థన చేయండి.

## ధనూరాశి

**మూల 1,2,3,4 పాదములు, పూర్వాషాఢ 1, 2, 3, 4 పాదములు, ఉత్తరాషాఢ 1వ పాదము.**

ఈ రాశి స్త్రీ పురుషులకు గ్రహ సంచారంలో కొంత దోషం వలన సమస్యలు రావొచ్చు. అలాగని భయపడుతూ కూర్చోకండి. నమ్మకంతో ముందుకు వెళ్లండి. మీ కార్యదీక్ష, మీ వాక్ చాతుర్యంతో నిబ్బరంగా ఉండగలరు. ఉరుములు ఉరిమిన, మెరుపులు మెరిసినా ఉప్పెనలు వచ్చినా మనం ఏమీ చేయలేం కదా.. భగవంతుడి నామస్మరణతో అంత మంచే జరగాలని కోరుకోండి.

## మకరరాశి

**ఉత్తరాషాఢ 2,3,4 పాదములు, శ్రవణం 1,2,3,4 పాదములు, ధనిష్ట 1,2 పాదములు**

ఈ రాశి స్త్రీ పురుషులకు వివాహ ప్రయత్నాలు ఫలిస్తాయి. కావాల్సిన ధనం సమకూరుతుంది. ఆర్భాటాలకు ఇది సమయం కాదు. పొదుపు గురించి ఆలోచన చేయండి. అనుకున్న పనుల పట్ల కరెక్ట్ సమయానికి పూర్తి చేయలేకపోతే, అన్ని సమస్యలు ఒకేసారి మీద పడే అవకాశం ఉంది. సత్యదేవుడి వ్రతం చేయండి. ఆనందంగా ఉంటారు.

## కుంభరాశి

**ధనిష్ట 3,4 పాదములు, శతభిషం 1,2,3,4 పాదములు, పూర్వాభాద్ర 1,2,3 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు అనేక విధాలుగా ఆనందంగా ఉంటారు. అనుకోని కలహాలు వస్తాయి. చాలా ఓర్పు నేర్పుతో సమన్వయం కలిగి పరిష్కరించుకోవాలి. దూర ప్రయాణంలో లాభం ఉన్నది. నిర్లక్ష్యంగా ఉండరాదు. మిమ్మల్ని మోసం చేయగలరు. శనివారం ఆంజనేయస్వామి వారి పూజలు చేయండి. అలాగే , 11 ప్రదక్షిణలు చేయాలి.

## మీనరాశి

**పూర్వాభాద్ర 4వ పాదము, ఉత్తరాభాద్ర 1,2,3,4 పాదములు, రేవతి 1,2,3,4 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు అనుకూలంగా ఉంటుంది. కొన్ని రకాల ఇబ్బందులు కలిగి ఉన్నారు. ఓర్పునేర్పు పట్టుదలతో విజయం సాధించేందుకు ఇదే సరైన సమయం. సాహసాలు చేసేందుకు ఇది సమయం కాదు. ఆచితూచి మాట్లాడగలరు. మాటపట్టింపులు ఉన్నాయి. గురువు ఆజ్ఞతో నడుచుకొని ఎంతటి ఇబ్బంది అయిన ఇట్టే పరిష్కారం అవుతుంది.

# మీ విజ్ఞానం

నిర్వహణ: **డా.పి. లలితవాణి**




శ్రీ వేంకటేశం
ఆధ్యాత్మిక మాసపత్రిక
ఇం.నెం. 1-1-53, వీధి నెం.1,
హబ్సీగూడ, హైదరాబాద్-500007,
ఫోన్: 040-27175050
Email: srivenkatesham@gmail.com

ఈ ప్రశ్నలన్నింటికీ ఇదే పేపరు మీద కొట్టివేతలు లేకుండా సమాధానాలు రాసి ఈనెల 20వ తేదీలోగా మాకు పంపగలరు. మీ చిరునామాను స్పష్టంగా రాయాలి. సరియైన సమాధానాలు వ్రాసిన వారిలో లక్కీడిప్ ద్వారా ఒకరిని ఎంపిక చేసి వారికి 'శ్రీవారి పాదాలు' బహుమతిగా ఇవ్వబడతాయి.

## ఈ క్రింది ప్రశ్నల జవాబుల కోసం గత నెల సంచికను పరిశీలించండి

1. గోదా - అంటే ఏమిటి?
2. శంకరాచార్యులు ఎక్కడ నుండి ఎక్కడి వరకు పాదయాత్ర చేశారు?
3. నాడీజంఘుని మిత్రుడెవరు?
4. గోదాదేవి చేసిన వ్రతమేది?
5. చిరకారి తండ్రి ఎవరు?
6. భోగిపండుగ ఎవరికి ఇష్టం?
7. నాడీజంఘుడు ఏ జాతివాడు?
8. శ్రీకృష్ణుడు గోవర్ధనగిరిని ఏరోజు ఎత్తాడు?
9. సావిత్రీ గౌరీ వ్రతం ఎప్పుడు చేస్తారు?
10. దున్నపోతు చేత వేదాలు చెప్పించింది ఎవరు?
11. వాడపల్లి వెంకన్నది ఏ రూపం?
12. పద్మసరోవరాన్ని నిర్మించిందెవరు?
13. విష్ణువు ఎవరికోసం తపస్సు చేశాడు?
14. ఆకాశరాజు పూర్వజన్మలో ఎవరు?
15. సూర్యుడు ఎప్పుడు జన్మించాడు?

1. ______
2. ______
3. ______
4. ______
5. ______
6. ______
7. ______
8. ______
9. ______
10. ______
11. ______
12. ______
13. ______
14. ______
15. ______

### గత నెల ప్రశ్నలకు కరెక్టు సమాధానాలు

1. సహస్రం, 2. రక్షకురాలు, 3. రామచరితమానస్, దోహావళి, జానకీ మంగళ్, గీతావళి, 4. పలితుడు, 5. శనిదేవునిది, 6. బుధుడు, 7. బంగారుమాల, 8. ఆత్మారాం, 9. నామదేవుడు, 10. పుంజికస్థల, 11. మేరు పర్వతం, 12. ధర్మాచరణం, 13. శని శింగనాపూర్, 14. తులసీదాస్‌కి, 15. ఉమ్మెత్త

### సరైన సమాధానాలు రాసినవారు

1. చిల్లర సీతారామారావు, 2. వి. వసుంధర, 3. వనమాల రామలింగాచారి, 4. బులుసు బాబురావు, 5. పి. యశోద, 6. వెంకట్ రమణారెడ్డి

పేరు: ______
చిరునామా: ______
______
______
______
పిన్‌కోడ్: ______
ఫోన్: ______

### లక్కీడిప్ ద్వారా స్వామివారి పాదాలు పొందిన విజేత

**బులుసు బాబురావు**


మ్యూజియంనకు దారి

Postel Registration No:
HSE/879/2022-2024

Published on 28th and Licenced to
Post On 29th & 30th of Every Month

RNI No.:
APTEL/2008/23122

# శ్రీ వేంకటేశం

ఆధ్యాత్మిక మాసపత్రిక



If Un delivered please return to:

**SRI VENKATESHAM, (Sri Venkateshwara Maha Mantra Peetham)**

H.No: 1-1-53, Street No. 1, Habsiguda, Hyderabad-500007. Ph: 040-27175050.

డిజిటల్ పాఠకుల కోసం పూర్తిగా కలర్ పేజీలు https://www.srivenkatesham.org లో చదవండి

Srivenkatesham Magazine in Google Drive https://drive.google.com/drive/folders/1jOWBeoUHjF4Qhn4wl-d9eUGlh6kVYyLq